
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 180
బుధవారం 20-9-2023


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఆస్ట్రేలియాతో వన్డేలకు అశ్విన్
స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జట్టు ప్రకటన - 14లో


జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేసింది..
హైదరాబాద్ సహా 8 నగరాల్లో ఆవిష్కరణ రూ. 599 నుంచి ప్లాన్లు - 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


భారత్, కెనడా.. ఖలిస్తాన్ చిచ్చు
భారత్, కెనడాల మధ్య ఖలిస్తాన్ వేర్పాటువాద అంశం అగ్గి రాజేసింది. ఇరు దేశాలు పరస్పరం దౌత్యవేత్తల్ని బహిష్కరించాయి.
- వివరాలు 10లో


లష్కరే కమాండర్ హతం
కశ్మీర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా కమాండర్ ఉజయిర్ ఖాన్ సహా ఇద్దరు హతమయ్యారు.
- వివరాలు 10లో


ఆదిత్య ప్రస్థానంలో కీలక దశ..
సూర్యుని గుట్టు విప్పేందుకు ఇస్రో ప్రయోగించిన తొలి మిషన్ ఆదిత్య–ఎల్1 ప్రస్థానంలో కీలక దశ మొదలైంది.
- వివరాలు 10లో


ఏడు చిరుత కూనల మృతి
బెంగళూరులోని బయోలాజికల్ పార్కులో ఏడు చిరుత కూనలు అత్యంత తీవ్రమైన వైరస్ సోకి మృత్యువాతపడ్డాయి.
- వివరాలు 10లో

నారీశక్తికి వందనం

లోక్‌సభలో మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం • అతివల దశాబ్దాల నిరీక్షణకు తెర

పార్లమెంట్ నూతన భవనంలో ఉభయ సభలు కొలువుదీరిన తొలిరోజే మోదీ సర్కార్ కీలక నిర్ణయం

- బిల్లుపై నేడు దిగువ సభలో కీలక చర్చ
- గురువారం రాజ్యసభ ముందుకు..
- బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లాంఛనమే
- 2027 తర్వాతే రిజర్వేషన్లు అమలు!
- రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కోటా
- ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ సీట్లు లేనట్లే



న్యూఢిల్లీ: దేశంలో మహిళల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, వారి ఆకాంక్షను నెరవేరుస్తూ, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీశక్తి వందన్ అధినియమ్'బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో రెండో రోజు, పార్లమెంట్ నూతన భవనంలో ఉభయసభలు కొలువుదీరిన తొలిరోజు మంగళవారం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 'రాజ్యాంగ(128వ సవరణ) బిల్లు–2023'ను దిగువ సభలో ప్రవేశపెట్టారు. ముందు రోజే.. అంటే సోమవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఆమోదముద్ర వేశారు. బిల్లుపై బుధవారం లోక్‌సభలో కీలక చర్చ జరుగనుంది. గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ నూతన భవనంలో లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బిల్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు రికార్డుకెక్కింది. ఉభయసభల ఆమోదం, ఆ తర్వాత రాష్ట్రపతి సంతకంతో బిల్లు చట్టంగా మారనుంది.

మహిళా కోటా ఇప్పుడే కాదు

జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లోకి రానుంది. అంటే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు మిగతా 6వ పేజీలో ▶

విభజనతో చేదు అనుభవాలు!

- తెలంగాణ, ఏపీ సంబరాలు చేసుకోలేకపోయాయి
- ఆ విభజన సమయంలో విషబీజాలు నాటబడ్డాయి
- వాజ్‌పేయి హయాంలోలా ఏర్పాటు చేసి ఉంటే తెలంగాణ కొత్త శిఖరానికి చేరుకునేది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తొలిరోజు ప్రసంగంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రధాని మోదీ అవమానించారు: రాహుల్ గాంధీ మండిపాటు
- ప్రధాని వ్యాఖ్యలు సరికాదు: బీఆర్‌ఎస్..
- తెలంగాణ మనోభావాల్ని మోదీ గాయపర్చారు: కేటీఆర్
- పోరాట స్ఫూర్తిని కించపర్చేలా ప్రధాని మాటలు: రేవంత్

- వివరాలు 2లో

ఆ(మె) బిల్లు వెనక...

- దశాబ్దాలుగా చర్చలకే పరిమితమైన మహిళా బిల్లు
- పార్టీలన్నీ సమర్థిస్తున్నా ఆమోదం ఇన్నాళ్లుగా ఎండమావే

- వివరాలు 6లో


పార్లమెంట్ నూతన భవనంలో...

- ప్రధాని మోదీ సారథ్యంలో పార్లమెంట్ నూతన భవనంలోకి ఎంపీలు
- కార్యకలాపాలను ప్రారంభించిన స్పీకర్ బిర్లా
- పార్లమెంట్ పాత భవనం ఇక 'సంవిధాన్ సదన్' అంటూ నోటిఫికేషన్

6 లో

ప్రజాస్వామ్యం బలోపేతం

గొప్ప ఆలోచనలతోనే 'బలమైన భారత్' 6 లో


మంగళవారం ఢిల్లీలోని పార్లమెంటు పాత భవనం నుంచి నూతన భవనానికి సహచర మంత్రులు, ఎంపీలతో కలిసి వెళ్తున్న ప్రధాని మోదీ

న్యూస్‌రీల్

జేఈఈ మెయిన్స్ తేదీలు ఖరారు



జేఈఈ మెయిన్స్ తొలి విడతను 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ మధ్య.. రెండో దఫా జేఈఈ మెయిన్స్‌ను ఏప్రిల్ 1 నుంచి 15 మధ్య నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది.
- వివరాలు 3లో

ఔను.. 6 నెలలకు సీఎం మారడం గ్యారంటీ



కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు పథకాలపై ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ కార్డులు అమలు కావని, ఆరు నెలలకు సీఎం మారడం గ్యారంటీ అని విమర్శించారు.
- వివరాలు 2లో

మీరు జోకర్లు, బ్రోకర్లు... మీది గులామీ గ్యాంగ్



మోసం, వంచన, ద్రోహం, దోఖాల మయం కాంగ్రెస్ అర్ధ శతాబ్దపు పాలనంతా అని కేటీఆర్ ట్వీట్ చేస్తే తెలంగాణ కోసం తల్లి సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను చూసి అర్ధరాత్రి నుంచి అయ్యా కొడుకులు అంగీలు చింపుకుంటున్నారని రేవంత్ రీట్వీట్ చేశారు.
- వివరాలు 5లో

అక్టోబర్ 5 తర్వాత నగారా!

ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం

వచ్చే నెల 3న రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల సంఘం బృందం

- తెలంగాణ శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతపై సమగ్ర పరిశీలన
- మూడు రోజుల పాటు రాజకీయ పార్టీలు, దర్యాప్తు సంస్థలు, కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షలు
- చివర్లో మీడియా సమావేశం నిర్వహించి పర్యటన విశేషాల వెల్లడి
- ఎన్నికలు జరగాల్సిన మరో 4 రాష్ట్రాల్లో ఇప్పటికే ముగిసిన పర్యటనలు
- రాష్ట్రంలో పర్యటన ముగిశాక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల తరుణం ముంచుకొస్తోంది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరం శాసనసభల ఎలక్షన్లకు అక్టోబర్ తొలి వారం తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణలో శాసనసభ ఎన్నికల నిర్వహణ సంసిద్ధతను పరిశీలించడానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన కేంద్ర ఎన్నికల సంఘం బృందం వచ్చే నెల 3న రాష్ట్ర పర్యటనకు రానుంది. 5 వరకు అంటే మూడురోజులపాటు విస్తృత సమీక్షలు, వరుస సమావేశాలు నిర్వహించనుంది.

మిగతా చోట్ల ఇప్పటికే ముగియడంతో..

ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు సంసిద్ధతను స్వయంగా పరిశీలించడానికి సీఈసీ బృందం మిగతా 10వ పేజీలో ▶

నెలాఖరుకు కాంగ్రెస్ జాబితా?

లేదంటే అక్టోబర్ తొలివారంలో!

- ఢిల్లీలో నేడు, రేపు భేటీ కానున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ
- అక్కడే ఉన్న రేవంత్, ఉత్తమ్.. బయలుదేరి వెళ్లిన భట్టి
- ఈ భేటీల్లో 119 నియోజకవర్గాలకు సంబంధించిన జాబితా షార్ట్‌లిస్ట్
- ఆపై ఈ జాబితా సీఈసీకి... వచ్చే నెల తొలివారంలోగా తొలి జాబితా విడుదల


2 లో



ప్రజాధనాన్ని లూటీ చేశారు

ఇదంతా అప్పటి సీఎం చంద్రబాబుకు తెలిసే జరిగింది

స్వలాభాపేక్షతో ఖజానాకు రూ.371 కోట్ల నష్టం



- ఆయన ఆలోచనల్లో నుంచే ఈ కుంభకోణం పుట్టింది
- ప్రజాధనం దుర్వినియోగం అధికార విధుల్లో భాగం కాదు
- అందువల్ల కేసు నమోదుకు 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి అక్కర్లేదు..... ఆధారాల సేకరణకు ఏడాదిన్నర పట్టింది.. ఆ తరువాతే అరెస్టు చేశాం
- ఇదే స్కిల్ డెవలప్‌మెంట్‌కు గుజరాత్ రూ.కోటి మాత్రమే చెల్లించింది
- ఐటీ, ఈడీ సైతం దర్యాప్తు... అసలు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది.. దీన్ని అడ్డుకోవద్దు
- కేసు నమోదు చేసిన 10 రోజులకే కొట్టేయాలంటున్నారు
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ తరఫు న్యాయవాదులు
- వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి

11 లో

ఏపీ ఫైబర్ నెట్ కేసులోనూ బాబుపై పీటీ వారంట్ 12 లో

ఇదం జగత్



... అరెస్టును ఖండించమని స్వామిని ఎందుకు అడిగావ్!

క్లుప్తంగా...

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

ఓబీసీల రిజర్వేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టాలి: కవిత



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు ఆమోదం విషయంలో కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడాన్ని స్వాగతించారు. బిల్లులో పేర్కొన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఆమోదంలో ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా చూడాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాల్సిందిగా ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు రోజుల క్రితం లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇదే తరహాలో చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్ బిల్లును కూడా ప్రవేశ పెడితే తాము మద్దతు ఇస్తామని కవిత ప్రకటించారు. కాగా మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసం వద్ద సంబురాలు జరి గాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు పలకాల్సిందిగా కోరుతూ ఇటీవల 40కి పైగా రాజకీయ పార్టీల నేతలకు ఎమ్మెల్సీ కవిత లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూ మిఠాయిలు పంచారు.

ఎమ్మెల్సీ కవిత కృషితోనే మహిళా బిల్లు

సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుదీర్ఘ పోరాటం వల్లనే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చిందని సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆమె కృషి వల్లనే ఇది సాధ్యమైందని సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకులు కుంట గంగాధర్ రెడ్డి, ఏపూరి నర్సయ్య, సుదర్శన్, మహేందర్ రెడ్డి, భారతి పేర్కొన్నారు. కవిత ఎన్నోసార్లు మహిళా బిల్లు కోసం దీక్షలు చేపట్టారని వీటి ఫలితంగానే నేడు ఈ బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చిందన్నారు.

మహిళాబిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం శుభపరిణామం

రాజకీయాలకతీతంగా మద్దతు ఇద్దాం: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: మహిళాబిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం శుభపరిణామమని, రాజకీయాలకతీతంగా ఈ బిల్లుకు మద్దతిద్దామని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే చారిత్రక ఘట్టానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నామని..మహిళలు సమాన హక్కు పొందే రోజు కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలోనే ఈ బిల్లు ప్రవేశపెట్టడంపై ప్రజల్లో అనుమానాలున్నాయని మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిప్రాయపడ్డారు.

జనగణన లేకుండా బిల్లు పెట్టి ఏం చేస్తారు?

ఇది మోదీ కొత్త నాటకం: సునీతారావు



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సునీతారావు ఆరోపించారు. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మహిళా ఓటర్లను మభ్య పెట్టేందుకే ఇప్పుడు మహిళా రిజర్వేషన్ల బిల్లు తెరపైకి తెచ్చారని, జనగణన జరగకుండా, మహిళల జనాభా తెలియకుండా ఈ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారని ఆమె ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మహిళా బిల్లును వెంటనే అమలు చేసే చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే జనగణన పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. తక్షణం జరగబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మోదీని నమ్మే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఇదో కొత్త నాటకమని తేలిపోయిందని ఎద్దేవా చేశారు.

మహిళా బిల్లును మేం వ్యతిరేకిస్తున్నాం: జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును బీసీల పక్షాన తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే పటేళ్ల స్థానంలో పటేలమ్మలు, దొరస్వాముల స్థానంలో దొరసానమ్మలు తెరపైకి వస్తారంటూ ఆరోపించారు. ఈబిల్లులో బీసీ మహిళలకు ఉపకోటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాజుల మాట్లాడారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య బద్ధంగా బీసీలు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.

విభజన చేదు అనుభవాలు మిగిల్చింది!

ఏపీ, తెలంగాణ రెండూ సంబరాలు చేసుకోలేకపోయాయి

- ఆ విభజన సమయంలో విష బీజాలు నాటబడ్డాయి
- వాజ్‌పేయి హయాంలోలా ఏర్పాటు చేసి ఉంటే తెలంగాణ కొత్త శిఖరానికి చేరుకునేది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తొలిరోజు ప్రసంగంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- ప్రధాని వ్యాఖ్యలు సరికాదన్న బీఆర్ఎస్.. నేడు దేశంలో తెలంగాణ నంబర్‌వన్‌గా మారిందన్న ఎంపీ నామా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎంతో ప్రయాసతో జరిగిందని, అనేక చేదు అనుభవాలను మిగిల్చిందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతో ఇటు తెలంగాణగానీ, అటు ఏపీగానీ సంబరాలు చేసుకోలేపోయాయని.. విభజన సమయంలో విషపు బీజాలు నాటబడ్డాయని విమర్శించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా సోమవారం పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రసంగించిన మోదీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ''అందరి సమ్మతితో కష్టతరమైన పనులనూ పార్లమెంటు పూర్తి చేసింది. ఇదే సభలో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో ప్రణాళికాబద్ధంగా మూడు రాష్ట్రాల విభజన జరిగింది. ఆ రాష్ట్రాల విభజన సమయంలో అన్నిచోట్లా సంబరాలు జరిగాయి. ఉత్తరాఖండ్ ఏర్పాటు సమయంలో దాని మాతృ రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ సంబరాలు చేసుకుంది. అలాగే ఛత్తీస్‌గఢ్ ఏర్పాటు సమయంలో మధ్యప్రదేశ్.. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో బిహార్ కూడా సంబరాలు చేసుకున్నాయి. అందరి సమ్మతితో సుహృద్భావ వాతావరణంలో విభజన జరిగింది. కానీ కొన్ని చేదు జ్ఞాపకాలు మిగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎంతో ప్రయాసతో జరిగింది. రక్తపుటేర్లు పారాయి. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ రెండూ సంబరాలు చేసుకోలేకపోయాయి. విభజన సమయంలో విష బీజాలు నాటబడ్డాయి. వాజ్‌పేయి హయాంలో మూడు రాష్ట్రాలు ఏర్పాటైన మాదిరిగా అదే ఉత్సాహంతో తెలంగాణను ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ఈ రోజు తెలంగాణ ఒక కొత్త శిఖరానికి చేరుకునేది..'' అని మోదీ పేర్కొన్నారు. నిజానికి గత ఏడాది ఫిబ్రవరి 8న బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ప్రధాని మోదీ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. విభజన సరిగా జరగలేదని.. కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు దోహదపడిన ఏపీని సిగ్గుపడేలా కాంగ్రెస్ విభజించిందని ఆరోపించారు.

పోరాట స్ఫూర్తిని కించపర్చేలా మోదీ వ్యాఖ్యలు: రేవంత్‌రెడ్డి

తెలంగాణ పోరాట స్ఫూర్తిని కించపర్చేలా ప్రధాని మోదీ వ్యాఖ్యలు ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ''తెలంగాణ త్యాగాల విలువ, పోరాట స్ఫూర్తిని కించపర్చేలా మోదీ మాట్లాడటం ఘోరం. రాష్ట్రం ఏర్పాటు చేసిన పార్టీగా తెలంగాణ గుండె చప్పుడు తెలుసుకాబట్టే మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తిప్పికొట్టారు. మనం బీజేపీని తరిమికొడదాం'' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.



తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించడమే: రాహుల్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తప్పుపట్టేలా ప్రధాని మోదీ వ్యాఖ్యలు చేశారని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ''తెలంగాణ అమరులను, వారి త్యాగాలను అవహేళన చేస్తూ ప్రధాని మోదీ మాట్లాడటం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని అవమానించడమే..''అని మంగళవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికాదు: బీఆర్ఎస్

విభజనపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు సభలో తిప్పికొట్టారు. బీఆర్ఎస్ తరఫున ప్రసంగించిన నామా... ''తెలంగాణ ఏర్పాటు చేదు జ్ఞాపకాలను మిగిల్చిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికాదు. తెలంగాణ నేడు దేశంలోనే నంబర్‌వన్‌గా ఉంది. తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగంలో నంబర్‌వన్ స్థానంలో ఉంది. రైతు బంధు, రైతు బీమా, రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే. రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నాం. ఇప్పుడు దేశంలో తెలంగాణ మోడల్ రావాల్సి ఉంది..''అని పేర్కొన్నారు. ఒకప్పుడు బీజేపీకి కేవలం ఇద్దరు ఎంపీలే ఉంటే ఇప్పుడు 300కు పైగా ఉన్నారని, పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్నారని... అదే మాదిరిగా ఇద్దరు ఎంపీలే ఉన్నా తమ పార్టీ కొట్లాడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సాధించిందని చెప్పారు. ఇక నూతన పార్లమెంట్ భవనానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని నామా డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టామని, హైదరాబాద్‌లో 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళిత పక్షపాతని కేసీఆర్ నిరూపించుకున్నారని చెప్పారు.

త్యాగాల పునాదుల మీదే తెలంగాణ

తెలంగాణ మనోభావాలను ప్రధాని గాయపరుస్తున్నారు: మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇక్కడి ప్రజలు, ప్రత్యేకించి యువత అనేక త్యాగాలు చేసిన విషయాన్ని మరచి, పార్లమెంటు వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరాధార ప్రకటనలు చేస్తున్నారని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చారిత్రక వాస్తవాలను పక్కన పెట్టి తెలంగాణ ఏర్పాటుపై ప్రధాని మోదీ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ఇది తొలిసారి కాదన్నారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ప్రజలు సాగించిన రాజీ లేని పోరాటం వల్లే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంబురాలు జరగలేదన్న మోదీ, చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. కోట్లాది మంది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న చారిత్రక అంశాల పట్ల ప్రధాన మంత్రి సున్నితంగా వ్యవహరించడం నేర్చుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి పదేపదే కోట్లాదిమంది తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మానుకోవాలన్నారు. గాంధేయ మార్గంలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో రక్తపాతం జరిగిందనడం ఇక్కడి ప్రజల ఆత్మగౌరవ పోరాటాన్ని పార్లమెంట్ సాక్షిగా అవమానించడమే అన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వని ప్రధాని, కనీసం మాటల్లోనైనా మర్యాద చూపించాలని కేటీఆర్ హితవు పలికారు. తెలంగాణ పుట్టుకనే అవమానించిన బీజేపీకి, ఇక్కడ పుట్టగతులు ఉండవన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం మానుకుని పార్లమెంట్ సాక్షిగా క్షమాపణలు చెప్పాలన్నారు. ద్వేషం కంటే దేశం ముఖ్యమని, దేశమంటే రాష్ట్రాల సమాహారం అని ప్రధాని తెలుసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

ఆ బిల్లులో బీసీ మహిళలకూ ప్రాధాన్యం కల్పించాలి

ఎంపీ కె.కేశవరావు



సాక్షి, న్యూఢిల్లీ: మహిళారిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ నేత కె.కేశవరావు డిమాండ్ చేశారు. మహిళాబిల్లుకు బీఆర్ఎస్ వంద శాతం మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళాబిల్లు కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉద్యమం చేస్తోందని గుర్తుచేశారు. గతంలో ఈ బిల్లు రాజ్యసభలో చర్చకు వచ్చినప్పుడు అందులో పాల్గొని పలు సూచనలు చేశానన్నారు. బీసీ మహిళలకు ఈ బిల్లులో ప్రాధాన్యత కల్పించాలంటూ ఇప్పటికే అనేక పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయని గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ కొన్ని పార్టీలు బీసీలకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఆయావర్గాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నా యని కేశవరావు మండిపడ్డారు. పెత్తనం ఉన్నచోట బీసీలను అణచివేస్తున్నారని ధ్వజమెత్తారు.

మహిళా రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఆకునూరి మురళి తదితరులు

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి: జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి, సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్డీఎఫ్)కన్వీనర్ ఆకునూరి మురళితో కలిసి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తెచ్చిన మహిళా బిల్లును స్వాగతిస్తున్నామన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ ఈ బిల్లు తీసుకొచ్చిందన్నారు. ఎమ్మెల్సీ కవితకు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్‌లో మహిళలకు రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. ఎస్డీఎఫ్ చేసిన తీర్మానాలను బీఎస్పీ పాలసీలుగా అమలు చేయాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఆకునూరి మురళి కోరారు.

నెలాఖరుకు కాంగ్రెస్ జాబితా?

- లేదంటే అక్టోబర్ తొలివారంలో!
- ఢిల్లీలో నేడు, రేపు భేటీ కానున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ
- అక్కడే ఉన్న రేవంత్, ఉత్తమ్.. బయలుదేరి వెళ్లిన భట్టి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ మరోమారు భేటీ కానుంది. ఢిల్లీ వేదికగా బుధ, గురువారాల్లో ఈ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగనుంది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయడంలో భాగంగా దరఖాస్తులను వడపోసి షార్ట్ లిస్ట్ తయారు చేయడమే ఎజెండాగా ఈ సమావేశాలు జరగనున్నాయి. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పీసీసీ నుంచి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. ఇందులో ఉత్తమ్, రేవంత్‌లు పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీలోనే ఉండగా, భట్టి మంగళవారం ఉదయం ఢిల్లీ వెళ్లారు. వీరితో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్‌చౌదరి, మన్సూర్ అలీ ఖాన్ కూడా స్క్రీనింగ్ కమిటీ భేటీకి హాజరవుతారు. ఇటీవలే హైదరాబాద్ వేదికగా సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ ఏమీ తేల్చకుండానే సమావేశాన్ని వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో బుధ, గురువారాల్లో జరిగే మలిదశ భేటీల్లో 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన షార్ట్‌లిస్ట్ రెడీ కానుంది. అనంతరం ఈ జాబితాను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపుతారని, ఈ కమిటీ భేటీ అనంతరం ఈ నెలాఖరున లేదంటే అక్టోబర్ మొదటి వారంలో తొలి జాబితాను విడుదల చేస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీకి లాభం చేసేందుకే ఎంఐఎం థర్డ్‌ఫ్రంట్ ప్రకటన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో బీజేపీకి లాభం చేసేందుకే ఎంఐఎం పార్టీ థర్డ్‌ఫ్రంట్ ప్రకటన చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మూడో ఫ్రంట్‌ను బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్‌తో కలిసి ఏర్పాటు చేస్తామని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించడం మత ప్రాతిపదిక రాజకీయాలకు మేలు చేసి, దేశ సమైక్యత, సమగ్రతకు నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలోని రెండు ఫ్రంట్‌లకు సమదూరం పాటిస్తామని బీఆర్ఎస్ ప్రకటించడం కూడా బీజేపీకి దోహదపడేదేనని తమ్మినేని తెలిపారు. ఈ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకునే ధోరణి, వైఖరిని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండిస్తోందన్నారు. గతంలోనూ బిహార్, ఉత్తర ప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో సెక్యులర్ ఓట్లను చీల్చే బీజేపీకి లాభం జరిగేలా ఎంఐఎం పార్టీ వ్యవహరించిందని తమ్మినేని ఆరోపించారు. మైనార్టీలపై జరుగుతున్న దాడులను ప్రోత్సహించే బీజేపీకి వత్తాసు పలికేలా వ్యవహరించడం మానుకోవాలని సీపీఎం తెలంగాణ కమిటీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

'చరిత్రను వక్రీకరించేందుకు అమిత్‌షా యత్నం'



సాక్షి, హైదరాబాద్: అటు స్వాతంత్ర్య పోరాటంలో కానీ, ఇటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోగానీ ఎలాంటి పాత్ర లేని బీజేపీకి చెందిన అగ్రనేత అమిత్‌షా చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. నాడు నిజాం సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసే ప్రక్రియను జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌లు సమష్టిగా నడిపించారని, కలిసే నిర్ణయాలు తీసుకున్నా రని ఆయన చెప్పారు. ఎప్పుడో 1981లో పుట్టిన బీజేపీకి ఇలాంటివి ఏం తెలుస్తాయని, అసలేమీ తెలియకుండానే చరిత్ర వక్రీకరణకు అమిత్‌షా పూనుకోవడం దురదృష్టకరమని మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. విజయభేరి సభ చూసిన తర్వాత బీజేపీ, టీఆర్ఎస్‌లకు భయం వేస్తోందని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కాంగ్రెస్ మానస పుత్రికని, ఆ బిల్లును కాంగ్రెస్ స్వాగతిస్తుందని చెప్పారు. తాను పోరాటం చేస్తేనే మహిళా బిల్లు వచ్చినట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చెప్పుకోవడం చూస్తే నవ్వు వస్తోందని, కేబినెట్‌లో ఒక్క మహిళ లేనప్పుడు కూడా తన తండ్రిని అడగలేని కవిత ఎక్కడ ఉద్యమం చేశారని ఎద్దేవా చేశారు.

మహిళా బిల్లు ఆమోదం పొందడం ఖాయం

ఎంపీ బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో పూర్తిస్థాయి మెజారిటీ ఉన్నందున మహిళాబిల్లు ఆమోదం పొందడం ఖాయమని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌సహా విపక్షాలన్నీ వ్యతిరేకించినా బిల్లును అడ్డుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. ఈ బిల్లును వ్యతిరేకించిన ఎంఐఎం మహిళాద్రోహిగా చరిత్రలో మిగిలిపోతుందని విమర్శించారు. మహిళాబిల్లు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ద్వంద్వ విధానాలు మానుకోవాలని హితవు పలికారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించి ఆయా పార్టీలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. యూపీఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ ఉన్నా, పదేళ్లు యూపీఏ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉన్నా మహిళాబిల్లుకు అప్పట్లో ఆమోదం లభించలేదని, కాంగ్రెస్ పార్టీ మహిళావ్యతిరేకి అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని సంజయ్ ప్రశ్నించారు. అమరులు, వారి త్యాగాలను అవహేళన చేస్తూ మోదీ మాట్లాడటం తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానపరచడమేనని రాహుల్‌గాంధీ చేసిన ట్వీట్‌పై సంజయ్ స్పందిస్తూ 1,400 మంది బలిదానానికి కారణమైన కాంగ్రెస్ ఇలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంగళవారం 'ఎక్స్'(ట్విట్టర్)లో వ్యాఖ్యానించారు.

ఆ నినాదం తెలంగాణ ప్రజలది కాదు.. కేసీఆర్‌ది

'నీళ్లు, నిధులు, నియామకాల'పై రేవంత్‌రెడ్డి

- ఇక్కడి ప్రజలు కోరుకున్నది స్వేచ్ఛ, ఆత్మగౌరవం
- మా ట్రాక్ రికార్డు చూసి ప్రజలే నిర్ణయం తీసుకుంటారు
- ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది
- మేం అధికారంలోకి వచ్చాక 100 శాతం ధరణిని రద్దు చేసి తీరుతాం



సాక్షి, హైదరాబాద్: నీళ్లు, నిధులు, నియామకాలన్నది తెలంగాణ ప్రజల స్లోగన్ కాదని, అది కేసీఆర్ నినాదం మాత్రమేనని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇక్కడి ప్రజలు కోరుకున్నది స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసమని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, మరో నేత మల్‌రెడ్డి రాంరెడ్డిలతో కలసి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విజయభేరి సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు హామీలతో బీఆర్ఎస్ నేతలు కకావికలం అవుతున్నారని ఎద్దేవా చేశారు. 'పార్లమెంటులో పెప్పర్ స్ప్రే కొట్టి, బిల్లు పేపర్లు చింపేసినా తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఏర్పాటు చేశారు. నిజంగా బీఆర్ఎస్‌కు రాజకీయ విజ్ఞత ఉన్నట్టయితే సోనియాను గౌరవంగా స్వాగతించి ఉండాల్సింది. కానీ, మేం మీటింగ్ పెట్టుకోగానే బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్‌లు ఏకమై కుట్రలు చేశాయి. సభకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించాయి. సోనియా తెలంగాణకు రావడంతో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంల ముసుగులు తొలగిపోయాయి. వీళ్లంతా కలసి సభను అడ్డుకోవాలని చూశారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారు. సభ విజయవంతం కావడంతో ఇప్పుడు అందరూ చొక్కాలు చించుకుంటూ రాజకీయ విచక్షణ కోల్పోయి వీధి కుక్కల కంటే దారుణంగా దిగజారి మాట్లాడుతున్నారు'అని రేవంత్ వ్యాఖ్యానించారు. తాము ప్రజలకు ఏం చేస్తామో చెప్పుకుంటూ వెళతామని, తమ ట్రాక్ రికార్డు ఏమిటో తెలిసిన ప్రజలు.. తగిన నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు. తాము తెలంగాణ ఇచ్చామని, రైతులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేశామని, అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పించామని, అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదల ఆరోగ్యాన్ని కాపాడామని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన చరిత్ర తమదని రేవంత్ పేర్కొన్నారు. '2004 నుంచి 2014 వరకు మేము అధికారంలో ఉన్న కాలంలో ప్రజలకు ఎలాంటి హామీలిచ్చామో, ఏమి నెరవేర్చారో చెపుతాం. 2014లో తెలంగాణ ఏర్పాటయిన తర్వాత బీఆర్ఎస్ ఇచ్చిన ఎన్ని హామీలు నెరవేర్చారో వారినే చెప్పమనండి. మేం చర్చకు సిద్ధం'అని అన్నారు. బీఆర్ఎస్‌కు మిగిలింది ఇక 99 రోజులేనని రేవంత్ పేర్కొన్నారు.

రాష్ట్రాల అవసరాల్లో తేడాలుంటాయి

తాటిచెట్టంత పెరిగితే.. మెదడు మోకాళ్లలోకి వస్తుందని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావును చూస్తే అర్థమవుతుందని రేవంత్ వ్యాఖ్యానించారు. 'ఇంటింటికీ ప్రణాళికలు మారినట్టే, రాష్ట్రాల అవసరాల్లో కూడా తేడాలుంటాయి. ఆయా రాష్ట్రాల్లోని ప్రజల అవసరాలు, ఆదాయం ఆధారంగా పార్టీల కార్యాచరణ ఉంటుంది. జాతీయ పార్టీలు అయినంత మాత్రాన దేశమంతా ఒకే విధానం అమలు కాదు. అలా చేయడం వృథా అవుతుంది. ఏ రాష్ట్రంలో ఏ అవసరం ఉందో గుర్తించి, వాటిని నెరవేర్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుంది'అని అన్నారు. బుర్ర లేకుండా వితండ వాదం చేయవద్దని, వెర్రిమాటలు మాట్లాడితే ప్రజలు చీరి చింతకు కడతారని వ్యాఖ్యానించారు. ధరణిని రద్దు చేస్తామన్న వ్యాఖ్యలను రేవంత్ పునరుద్ఘాటించారు. 'తెలంగాణలో భూమి సమస్యే ప్రధానమైంది. భూమి కోసమే సాయుధ పోరాటం జరిగింది. కేసీఆర్ పాలనను బొందపెట్టడం ధరణితోనే మొదలు పెడతాం. ధరణిని రద్దు చేసి మెరుగైన విధానం తీసుకువస్తాం'అని రేవంత్ వ్యాఖ్యానించారు.

'ఆరు గ్యారంటీ'లతో మోసగించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది

కాంగ్రెస్‌పై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు 6 గ్యారంటీలు అంటూ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సభలో రాహుల్ గాంధీ సహా ఇతర నాయకులు అలవికాని హామీలతో మోసం చేసి అధికారం దక్కించుకోవాలనే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ ఆరు గ్యారంటీ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పార్టీనేతలు మాఘం రంగారెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డి, సీహెచ్ విఠల్, రాకేశ్‌రెడ్డి, జె.సంగప్పలతో కలిసి అరుణ మంగళవారం మీడియాతోమాట్లాడారు. ఒక సాధారణ వ్యక్తి దేశ ప్రధాని కావడం, మోదీ నాయకత్వంలో భారత ఖ్యాతి విశ్వవ్యాప్తమవుతుండటాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు. గాంధీ పేరు పెట్టుకుని రాజకీయాలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రాభవం కోల్పోవడంతో మతఘర్షణలతో లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు.

కవిత లేఖతో బిల్లు పెడుతున్నారనడం హాస్యాస్పదం


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖతో మహిళా రిజర్వేషన్ బిల్లు పెడుతున్నారనడం హాస్యాస్పదమని అరుణ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థుల్లో మహిళలకు కనీసం 15% రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. పేదలకు ఇళ్లు కట్టించేది కేంద్ర ప్రభుత్వ నిధులతోనా లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నూతన పార్లమెంటు భవనంలో తొలిబిల్లుగా మహిళా రిజర్వేషన్ల బిల్లును పెట్టినందుకు బీజేపీ మహిళా నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటానికి డీకే అరుణ ఆధ్వర్యంలో నేతలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి, మహిళానేతలు ఆకుల విజయ, బండా కార్తీకారెడ్డి, సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔను.. 6 నెలలకు సీఎం మారడం గ్యారంటీ

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా



పెద్దశంకరంపేట (మెదక్) / కంగ్టి (నారాయణఖేడ్): కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు పథకాలపై ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ కార్డులు అమలు కావని, ఆరు నెలలకు ముఖ్యమంత్రి మారడం మాత్రం గారంటీ అని విమర్శించారు. అదేవిధంగా 6 నెలలకు ఒక కర్ఫ్యూ, రైతులకు 6 గంటల కరెంటు, పరిశ్రమలకు వారానికి రెండు పవర్ హాలిడేలు ఉండటం మాత్రం గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. మంగళవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేట, సంగారెడ్డి జిల్లా కంగ్టిలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎలాగూ అధికారంలోకి రాలేమని తెలిసి కాంగ్రెస్ నేతలు కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.

ఇక రెండో రాజధాని బెంగళూరు అవుతుందేమో

ఎమ్మెల్యేలకు ఢిల్లీ హైకమాండ్ అవుతుందని, దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లాలంటే వయా బెంగళూరు మీదుగా వెళ్లాలని, ఇక బెంగళూరు మనకు రెండో రాజధాని అవుతుందని హరీశ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హామీలు పోస్టుడేటెడ్ చెక్కులాంటివన్నారు. కర్ణాటకలో అధికారంలో ఉండి రూ.600లు పింఛన్ ఇస్తున్న ఆ పార్టీ.. తెలంగాణలో రూ.4000 ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ ప్రస్తుతం అక్కడ బస్సులు తగ్గించారన్నారు. బీఆర్ఎస్ 24 గంటలూ ఉచిత కరెంటు సరఫరా చేస్తుందని, గతంలో ఉచిత కరెంటు హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉత్త కరెంటు ఇచ్చిందని మంత్రి గుర్తు చేశారు. కిట్లు ఇచ్చే వారు కావాలో, కేసీఆర్‌ను తిట్టే వారు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. త్వరలో బీఆర్ఎస్ నుంచి అద్భుతమైన మేనిఫెస్టో వస్తుందని వెల్లడించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి పీజీఈసెట్ రెండో దశ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎంఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీజీఈసెట్ కన్వీనర్ రమేశ్‌బాబు తెలిపారు. మొత్తం పీజీఈసెట్ పరిధిలో 7,922 కన్వీనర్ కోటా కింద సీట్లు ఉంటే, తొలి దశలో 5,662 సీట్లు కేటాయించారు. ఇందులో 3,638 మంది రిపోర్టు చేశారు. రెండో దశ కౌన్సెలింగ్‌లో మొత్తం 4,284 సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 24వ తేదీ వరకు రెండో ఫేజ్ కింద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 27 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని, సీట్లు పొందిన అభ్యర్థులు అక్టోబర్ 4–7 తేదీల మధ్య కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

జిల్లాలవారీగా టీచర్ పోస్టులకు రోస్టర్ విధానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)ని నిర్వహిస్తున్న ప్రభుత్వం తాజాగా పోస్టులకు రోస్టర్‌ను విడుదల చేసింది. జిల్లాల వారీగా ఏ కేటగిరీకి ఎన్ని పోస్టులనేది నిర్ధారించింది. ఇందులో భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ వారీగా రిజర్వేషన్లను ప్రాతిపదికగా తీసుకుంది. తాజా రోస్టర్ విధానంలో ఎక్కువ పోస్టులు మహిళా అభ్యర్థులకే దక్కే అవకాశం కన్పిస్తోంది. సెకండరీ గ్రేడ్ టీచర్స్‌లో తెలుగు, ఉర్దూ మీడియంకు భారీగా పోస్టులు కేటాయించారు. స్కూల్ అసిస్టెంట్స్‌లో బయాలజీ, సోషల్ పోస్టులు ఎక్కువగా ఉండటం, మేథ్స్ తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టినా, తెలుగు మీడియంకే ఎక్కువ పోస్టులు రోస్టర్ పద్ధతిలో కేటాయించారు.

నేడు టీటీజీడీఏ చలో హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (టీటీజీడీఏ) బుధవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం టీటీజీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్వర్, జలగం తిరుపతిరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీ బకాయిల కోసం 56 నెలలుగా ప్రభుత్వానికి విన్నవించినా స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జేఈఈ మెయిన్స్ తేదీలు ఖరారు

- జనవరి 24 నుంచి తొలి విడత.. ఏప్రిల్ 1 నుంచి రెండో విడత
- ఇతర పోటీ పరీక్షల తేదీలూ వెల్లడి
- 3 నెలల ముందే ఎన్‌టీఏ ప్రకటన
- గతేడాది నుంచి కాస్త పెరిగిన దరఖాస్తులు
- ఈ సంవత్సరం ఎక్కువే ఉండొచ్చని అంచనా



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్ష తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. కోవిడ్ కాలంలో 4 దఫాలుగా నిర్వహించిన ఈ పరీక్షను 2024–25లో మాత్రం రెండు విడతలుగానే నిర్వహిస్తున్నట్టు తెలిపింది. తొలి విడతను 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ మధ్య చేపట్టాలని నిర్ణయించింది. రెండో దఫా జేఈఈ మెయిన్స్‌ను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ మధ్య నిర్వహించబోతున్నట్టు వెల్లడించింది. దీంతో పాటే మే 5న నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్–యూజీ), మే 15–31 తేదీల మధ్య కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ), మార్చి 11–28 మధ్య సీయూఈటీ–పీజీ, జూన్ 10–21 మధ్య యూజీసీ–నెట్ పరీక్షలను నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారంగానే ఉంటాయని పేర్కొంది. అయితే, సమగ్ర వివరాలతో కూడిన షెడ్యూల్‌ను ఎన్‌టీఏ విడుదల చేయాల్సి ఉంది. 2021 నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్ష కోవిడ్ కారణంగా ఆలస్యమవుతూ వస్తోంది. గత ఏడాది మాత్రం జనవరి, ఏప్రిల్ నెలల్లోనే నిర్వహించారు. అయితే, తేదీల ఖరారులో మాత్రం ఆలస్యమైంది. ఈ సంవత్సరం కోవిడ్ కన్నా ముందు మాదిరిగానే మూడు నెలల ముందే తేదీలను వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్‌కు విద్యార్థుల హాజరు సంఖ్య ఇలా..


సంవత్సరం	దరఖాస్తులు	పరీక్షకు హాజరైనవారు
2014	13,57,002	12,90,028
2015	13,56,765	12,03,453
2016	12,34,760	12,07,058
2017	11,86,454	11,22,351
2018	11,35,084	10,74,319
2019	12,37,892	11,47,125
2020	11,74,939	10,23,435
2021	10,48,012	9,39,008
2022	10,26,799	9,05,590
2023	11,62,398	11,13,325

మెయిన్స్ దరఖాస్తులు పెరిగేనా?

కోవిడ్ తర్వాత దేశవ్యాప్తంగా జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల వైపు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో జేఈఈ మెయిన్స్ రాసే వారి సంఖ్య ప్రతీ సంవత్సరం తగ్గుతోంది. ఈ స్థానంలో రాష్ట్ర ఎంసెట్‌కు దరఖాస్తులు పెరుగుతున్నాయి. 2014లో జేఈఈ మెయిన్స్ రాసినవారి సంఖ్య 12.90 లక్షలుంటే, 2022లో ఈ సంఖ్య 9.05 లక్షలకు తగ్గింది. 2023లో మాత్రం ఈ సంఖ్య 11 లక్షలకు పెరిగింది. కోవిడ్ సమయంలో టెన్త్ పరీక్షలు లేకుండా ఉత్తీర్ణులైన వారి సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా దీనికి కారణంగా చెబుతున్నారు. వాస్తవానికి మన రాష్ట్రం నుంచి 2014లో జేఈఈ రాసిన వారి సంఖ్య 2 లక్షల వరకూ ఉంటే, ఇప్పుడు 1.30 లక్షలకు పడిపోయింది. రాష్ట్రంలో ఎంసెట్ రాసేవారి సంఖ్య 2018లో 1.47 లక్షలుంటే, 2022లో ఇది 1.61 లక్షలకు పెరిగింది. కాగా, గత రెండేళ్లుగా రాష్ట్రంలో హాస్టళ్లు పూర్తిస్థాయిలో తెరుచుకోవడం, జేఈఈపై దృష్టి పెడుతున్న వారి సంఖ్య పెరగడంతో ఈ సంవత్సరం కూడా జేఈఈ రాసే వారి సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



వినాయక చవితి సందర్భంగా సోమవారం ప్రగతిభవన్‌లో పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు



ఆ ఏడుగురిపై 3 నెలలు సస్పెన్షన్ వేటు

మరో 20 మంది విద్యార్థులకు షోకాజ్ నోటీసులు

కేఎంసీలో ర్యాగింగ్ ఘటనపై యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం

ఎంజీఎం (వరంగల్ జిల్లా): వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఈ నెల 14న జూనియర్ వైద్యవిద్యార్థి మనోహర్‌పై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారించింది. ర్యాగింగ్‌కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను తరగతుల నుంచి మూడు నెలలపాటు సస్పెండ్ చేసింది. ఏడాదిపాటు క్యాంపస్ హాస్టల్‌లో ఉండేందుకు కూడా యాంటీ ర్యాగింగ్ కమిటీ నిరాకరించింది. ఈ ఘటనకు సంబంధించి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న 20 మంది విద్యార్థులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. ర్యాగింగ్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, ర్యాగింగ్ ఘటనలో మనోహర్ ఫిర్యాదు మేరకు ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదైందని, ర్యాగింగ్ కమిటీ చర్యలతో సంబంధం లేకుండా ఘటనపై విచారణ కొనసాగుతుందని ఏసీపీ కిషన్ తెలిపారు.

మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె విరమణ

సాక్షి, హైదరాబాద్: తమ ఉద్యోగ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ గత 48 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న రాష్ట్ర మత్స్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం సమ్మెను విరమించారు. మంత్రుల నివాసంలో మంగళవారం ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయిన పల్లి వినోద్ కుమార్‌తో మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం నాయక్‌తో మాట్లాడి కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్ అంశాల గురించి వినోద్ కుమార్ తెలుసుకున్నారు. మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు, సహా సంబంధిత అధికారులతో చర్చించి డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తామని వినోద్ కుమార్ హామీనిచ్చారు. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ తదితరులు ప్రకటించారు.

ఎస్సైల శిక్షణ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో సివిల్ ఎస్సై కేడెట్లకు మంగళవారం శిక్షణ ప్రారంభమైంది. మొత్తం 414 మంది సివిల్ ఎస్సైలు ఈ బ్యాచ్‌లో శిక్షణ పొందనున్నారు. 12 నెలలపాటు కొనసాగనున్న ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ ఎస్సై కేడెట్లకు డీజీపీ దిశానిర్దేశం చేశారు.





నిన్ను ద్వేషించేవాళ్ల కన్నా, నీ అందరి శత్రువుల కన్నా,
నీకు ఎక్కువ కీడు చేసేది నీ క్రమశిక్షణ లేని మనసే.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 20 సెప్టెంబర్ 2023

సరికొత్త సంకల్పంతో...

ఎన్నో కీలక ఘట్టాలకు వేదికైన పాత పార్లమెంటు భవనం చరిత్ర ముగిసి, కొత్త పార్లమెంటు భవనం అందుబాటులోకొచ్చింది. అయిదురోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సోమవారం పాత భవనంలోనే ప్రారంభమైనా, రెండోరోజు కొత్త భవనంలోకి మారాయి. ఇకపై పాత భవనం సంవిధాన్ భవన్‌గా పేరు మార్చుకుని భవిష్యత్తు తరాలకు ఉత్తేజాన్నందిస్తూంటుందని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయనన్నట్టు దేశ ప్రజాతంత్ర యాత్రలో సామాన్య పౌరుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొన్న చరిత్ర పార్లమెంటుది. ఇక్కడే వేలాది చట్టాలపై ఎడతెగని చర్చలు జరిగాయి. ఎన్నో కీలక నిర్ణయాలు రూపుదిద్దుకున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పక్షాల మధ్య వాగ్యుద్ధాలు చోటుచేసుకున్నాయి. రాజీలేని ధోరణిలో వాద ప్రతివాదాలు సాగాయి. ఎన్నెన్నో భావోద్వేగాలకు అది వేదికైంది. అదే సమయంలో కీలక సందర్భాల్లో బలమైన స్వరాన్ని వినిపించలేని దాని అశక్తత నిరంకుశ చట్టాలకు కూడా కారణమైంది. అది మౌనం వహించటంవల్ల పాలకపక్షం ఆత్యయిక స్థితి పేరిట దేశ ప్రజల గొంతు నొక్కటానికి అవకాశం ఏర్పడింది. తొలినాళ్లలో ఆరోగ్యకరమైన చర్చలకు చోటిచ్చిన సభే రాను రాను ఉత్త ఉపన్యాస వేదికగా, అప్పుడప్పుడు బలప్రదర్శన రంగస్థలిగా మారుతోంది. దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో తమకూ భాగస్వామ్యం ఉన్నదని... తమ ఆశలూ, ఆకాంక్షలూ వ్యక్తమవుతున్నాయని సామాన్యులు భావించటానికి వీల్లేని స్థితిగతులు నెలకొంటున్నాయి. ఏ విధాన నిర్ణయంలోని మంచిచెడ్డలనైనా ఆరోగ్యకరమైన చర్చల ద్వారా నిగ్గుతేల్చాల్సి వుండగా చాలా నిర్ణయాలు అరుపులూ, కేకల మధ్య మూజువాణి ఓటుతో గట్టెక్కుతున్నాయి. అంతకన్నా దారుణం లక్షల కోట్ల రూపాయలు వ్యయం కాగల ఆర్థిక పద్దులు సైతం గిలెటిన్ అవుతున్నాయి. అవతలి పక్షాన్ని అవహేళన చేయటం, స్వోత్కర్షలకు పోవటం నిత్యకృత్యమైంది. ఇవన్నీ గమనిస్తే నూతన పార్లమెంటు భవనం సరికొత్త ఆశలకూ, విశ్వాసాలకూ అద్దం పడుతుందా అన్నది సందేహాస్పదమే. అది సాధ్యమేనని ప్రధాని తన ప్రసంగంలో బలంగా చెప్పారు. కానీ అధికార, విపక్షాల మధ్య అంతటి సామరస్యత ఏర్పడుతుందా? మన పార్లమెంటు నడతను నిర్దేశిస్తున్న నిబంధనలు సంతృప్తికరంగా లేకపోవటం కూడా సమస్యలకు దారితీస్తోంది. దేన్ని చర్చించాలి...ఏ రూపంలో చర్చించాలన్న అంశాలు తరచు వివాదాస్పదమవుతున్నాయి. సభాధ్యక్షులకుండే విచక్షణాయుత అధికారాలు ఇందుకు దోహదపడుతున్నాయి.

గడిచిన కాలాన్ని బేరీజు వేసుకోకుండా, జరిగిన తప్పొప్పులను నిజాయితీగా సమీక్షించుకోకుండా సరికొత్త ప్రయాణం సులభం కాదు. అధికార, విపక్షాల మధ్య విభేదాలుండటం, అవి ఒక్కోసారి తీవ్ర రూపం దాల్చటం అసాధారణమేమీ కాదు. కానీ సమష్టిగా ఉండటానికి ముందుకు రావలసిన తరుణంలో సైతం పాక్షిక దృక్పథంతో వ్యవహరించే ధోరణి ప్రబలుతోంది. ఎదురు పడినప్పుడు మర్యాదపూర్వకంగా పలకరించుకునే సంస్కృతి కూడా ఆవిరవుతోంది. ఇవన్నీ పార్లమెంటుపై దేశ ప్రజలకుండే విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. మొన్నటికి మొన్న దేశం మొత్తం సిగ్గుతో తలవంచుకోవాల్సిన మణిపూర్ అకృత్యాలపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాలు రెండూ వ్యవహరించిన తీరు దిగ్భ్రాంతి కలిగించింది. దీన్ని తప్పించుకునే ధోరణిగా చూడాలా లేక ప్రజల మనోభావాలను అవగాహన చేసుకోవటంలోని అశక్తతగా పరిగణించాలా? సమాజంలో భిన్న వర్గాలున్నప్పుడూ, వాటికి భిన్న ప్రయోజనాలున్నప్పుడూ పార్లమెంటులో అవి ప్రతిబింబించటం వింతేమీ కాదు. నిజానికి అలాంటి వైరుధ్యాలకు సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనటమే ప్రజాతంత్ర సంస్థల లక్ష్యం. కానీ బలం ఉంది కదా అని ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం, వాటి మంచిచెడ్డల విశ్లేషణకు అవకాశమీయకుండా అసమ్మతికి పాతరేయటం ఇటీవలి కాలంలో రివాజైంది. పార్లమెంటు సజావుగా సాగటానికి, అక్కడ ఆరోగ్యవంతమైన చర్చలు జరగటానికి ప్రస్తుత పాలక్ష పక్ష కూటమికి నేతృత్వం వహిస్తున్న పార్టీగా బీజేపీపై ఎక్కువ బాధ్యత ఉంటుంది. అధికార పక్షంనుంచి అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు దాన్ని స్వాగతించి తమ వంతుగా సకారాత్మక దృక్పథాన్ని ప్రదర్శించటం విపక్షాల వంతు.

స్వరూపం, సదుపాయాల కోణంలో మాత్రమేకాదు...స్వభావరీత్యా వర్తమాన ప్రగాఢ ఆకాంక్షలకు కూడా నూతన పార్లమెంటు భవనం అద్దం పడుతుందన్న గ్రహింపు ఏర్పడినప్పుడు ఇరు పక్షాలూ విజ్ఞతతో మెలుగుతాయి. ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయంటే, ఒక బిల్లు విషయంలో, ఒక విధాన నిర్ణయం విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయంటే దాన్ని కేవలం రాజకీయ కోణంలో కాక, ప్రజానీకంలో ఏర్పడిన అభిప్రాయానికి ప్రతిబింబంగా చూడగలిగితే చాలా సమస్యలకు పరిష్కారాలు సాధ్యమవుతాయి. ప్రస్తుత పార్లమెంటు భవనం లోక్‌సభలో 888 మంది, రాజ్యసభలో 384 మంది కూర్చొనటానికి అనువుగా ఉంది. సెంట్రల్ హాల్ లేకున్నా, ఉభయసభల ఉమ్మడి సమావేశాల సమయంలో 1,272 మంది కూర్చొనేందుకు లోక్‌సభలో అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కల్పించే బిల్లు రాజ్యసభలో మంగళవారం ప్రవేశించటం శుభపరిణామం. బిల్లు ఆమోదం పొంది చట్టమైనా నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఇది అమల్లోకి వస్తుందనటం కొంత నిరాశ కలిగిస్తుంది. ఏదేమైనా కొత్త సభా భవనం సరికొత్త ఆచరణకు, సమున్నత సంప్రదాయాలకు వేదిక కాగలదని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. దాన్ని నెరవేర్చ వలసిన బాధ్యత శాసనకర్తలదే.

విప్లవాగ్ని జ్వలితుడు

తలవంచని విప్లవ కవిగా, పెక్కు నిర్బంధాల మధ్యనే ముందుకు సాగుతున్నారు వరవరరావు! 1957–2017 మధ్య కాలంలో ఆయన రాసిన సుమారు 50 కవితలను పెంగ్విన్ రాండమ్ హౌస్ 'వరవరరావు – ఎ లైఫ్ ఇన్ పొయెట్రీ' పేరుతో ఆంగ్లంలో ప్రచురించింది. 'బానిస సమాజం నుంచి బానిస భావం కూడా లేని కమ్యూనిజం' వైపు పయనిస్తున్న 'వరవర'కు తగిన గౌరవం.




ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''లోకంలో మేధావులనుకుంటున్నవారు సహితం పిరికిపందలుగా ఉంటారు. అలాంటి పిరికి పందలకన్నా మనోధైర్యంతో, దమ్ములతో బతకనేర్వడం అతి అరుదైన లక్షణంగా భావించాలి.''
– 'వికీలీక్స్' వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్

ప్రపంచ దేశాలపై అమెరికా నిరంతర కుట్రలను బహిర్గతం చేసినందుకు జీవితమంతా కష్టాలను కాచి వడబోస్తున్న మహాసంపాదకుడు, ప్రపంచ పాత్రికేయ సింహం... జూలియన్ అసాంజ్. అలాంటి ఒక అరుదైన సింహంగా, తలవంచని విప్లవ కవిగా ఈ క్షణం దాకా పెక్కు నిర్బంధాల మధ్యనే ముందుకు సాగుతున్న కవి వరవరరావు! దఫదఫాలుగా దశాబ్దాలకు మించిన జైళ్ల జీవితంలో ఆయనను (1973లో తొలి అరెస్టు మొదలు) 25 కేసులలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇబ్బందులు పెట్టారు. అలాంటి విప్లవకవి వరవరరావు తెలుగులో 1957–2017 మధ్య కాలంలో రాసిన సుమారు 50 కవితలను ఎంపిక చేసి... కవి, సాహితీ విమర్శకులు, మానవ హక్కుల పరిరక్షణా ఉద్యమాలకు నిరంతరం చేయూతనందిస్తున్న పాత్రికేయులు ఎన్.వేణుగోపాల్, నవలాకారిణి, కవయిత్రి మీనా కందసామి ఇండియాలోని సుప్రసిద్ధ పెంగ్విన్ రాండమ్ హౌస్ కోరికపై అందజేసిన గ్రంథమే 'వరవరరావు – ఎ లైఫ్ ఇన్ పొయెట్రీ'!

సర్వత్రా 'సామ్యవాద రంకె' వినిపించిన వరవరరావు 1972 లోనే:

'దోపిడీకి మతం లేదు, దోపిడీకి కులం లేదు
దోపిడీకి భాష లేదు, దోపిడీకి జాతి లేదు
దోపిడీకి దేశం లేదు
తిరుగుబాటుకూ, విప్లవానికీ
సరిహద్దులు లేవు' అని చాటుతూనే, తనను శత్రువు కలమూ, కాగితమూ ఎందుకు బంధించాయో తెగేసి చెప్తాడు: 'ప్రజలను సాయుధులను కమ్మన్నందుకు గాదు/ నేనింకా సాయుధుణ్ణి కానందుకు' అన్నప్పుడు జూలియన్ అసాంజ్ చేసిన హెచ్చరికే జ్ఞాపకం వస్తుంది. అంతేగాదు, 'వెనక్కి కాదు, ముందుకే' అన్న కవితలో 'వరవర':



'బానిస సమాజం నుంచి
బానిస భావం కూడా లేని కమ్యూనిజం దాకా
పయనించే ఈ కత్తుల వంతెన మీద
ఎంత దూరం నడిచి వచ్చావు –
ఇంకెంత దూరమైనా ముందుకే సాగు' గాని
వెనకడుగు వెయ్యొద్దని ఉద్బోధిస్తాడు!

ధనస్వామ్య రక్షకులైన పాలకుల దృష్టిలో 'ప్రజాస్వామ్యా'నికి అర్థం లేదని–

'పార్లమెంటు పులి కూడ /పంజాతోనే పాలిస్తూ
సోషలిజం వల్లించుతూనే / ప్రజా రక్తాన్ని తాగేస్తుంద'నీ
నాగుబాము పరిపాలనలో / ప్రజల సొమ్ము పుట్ట పాల'వుతున్న చోటు –
'జలగల్ని మీకేయండే – శాంతి లేదు/ క్రాంతి రాద'ని
నిర్మొహమాటంగా ప్రకటిస్తాడు.

'జీవశక్తి' అంటే ఏమిటో కవితాత్మకంగా మరో చోట ఇలా స్పష్టం చేస్తాడు:

'అన్ని రోజులూ కన్నీళ్లవి కావు / అయినా ఆనంద తీరాలు
ఎప్పుడూ తెలియకుండా / దుఃఖం లోతెట్లా తెలుస్తుంది?
ఆ రోజులూ వస్తాయి / కన్నీళ్లు ఇంద్రధనుస్సులవుతాయి
నెత్తురు వెలుగవుతుంది / జ్ఞాపకం చరిత్ర అవుతుంది
బాధ ప్రజల గాథ అవుతుంది!'

జైలు జీవితానుభవాన్ని సుదీర్ఘ అనుభవం మీద ఎలా చెప్పాడో!

'జైలు జీవితమూ అంగ వైకల్యం లాంటిదే
నీ కంటితో ఈ ప్రపంచాన్ని చూడలేవు
నీ చెవితో వినలేవు, నీ చేయితో స్పృశించలేవు
నీ ప్రపంచంలోకి నువ్వు నడవలేవు
నీవుగా నీ వాళ్ళతో నువ్వు మాట్లాడలేవు
ఎందుకంటే – అనుభూతి సముద్రం పేగు తెగిన అల ఇక్కడ హృదయం!'

ఇప్పటికీ దేశవ్యాపితంగా ప్రజా కార్యకర్తలపైన, పౌరహక్కుల నాయకులపైన యథాతథంగా హింసాకాండ అమలు జరుగుతూనే ఉంది. దానికి ఉదాహరణగా, అనేక రకాలుగా వికలాంగుడైన ప్రజా కార్యకార్త ప్రొఫెసర్ సాయిబాబానే కార్పొరేట్ శక్తుల కన్నా ప్రమాదకరం అన్నట్టుగా పాలకులు వ్యవహరించడం ఏమాత్రం క్షంతవ్యం గాదు!

abkprasad2006@yahoo.co.in

శతవర్ష శోభితుడు

తొంభై మూడేళ్ల వరకూ నిరవధికంగా నటిస్తూ సినీ ప్రేమికుల్ని అలరించిన ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు. గుండెకి ఆపరేషన్ జరిగినా నటనలో, నాట్యంలో ఉత్సాహం మరింత పెరిగిందే కానీ, ఇసుమంతైనా తగ్గకపోవడం ఆయన మానసిక స్థైర్యానికి మచ్చుతునక. తెలుగు సినీరంగంలో అక్కినేని 'ఎక్కని ఎత్తుల్లేవు. వెళ్లలేని దూరాల్లేవు.'

సందర్భం



వి.ఎన్. ఆదిత్య

జనన మరణాల మధ్య రెప్పపాటు జీవితకాలంలో, మన చూపు తిప్పుకోకుండా మన నలరించిన ఎందరో మహానుభావుల్లో ప్రముఖులు... తెలుగు సినిమా ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు. నాటక రంగం నుంచి నటరాజు వరప్రసాదమైన 'అభినయ' కళ ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించి, తొంభై మూడు సంవత్సరాల వయసు వరకూ నిరవధికంగా నటిస్తూ సినీ ప్రేమికుల్ని, తెలుగు ప్రేక్షకుల్ని అలరించి, తెలుగు హృదయాలలో చిరంజీవిగా కొలువై ఉన్న నటనావతంసుడీయన. పద్మవిభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం వంటివి అక్కినేనిని అలంకరించి తమ గౌరవాలను ఇనుమడింప చేసుకున్నాయి. తన కళని తర్వాత తరాలకి కూడా వారసత్వంగా అందించి అక్కినేని నాగార్జున వంటి సూపర్ స్టార్‌ని, నాగచైతన్య, అఖిల్, సుమంత్, సుశాంత్ వంటి స్టార్లని తయారు చేసి 'అక్కినేని' జయభేరి తరతరాలుగా నినదించేలా చేయడం సామాన్యమైన విషయం కాదు.



1950 నుంచి 60ల మధ్యలోనే 'నాతో సినిమాలు తీయాలనుకుంటే దర్శక, నిర్మాతలు హైదరాబాద్‌కి వచ్చి తీయా'లని నిర్దేశించ గలిగిన 'ఖలేజా' ఉన్న ఏకైక తెలుగు సూపర్ స్టార్ అక్కినేని.

1970ల మధ్య గుండెకి ఆపరేషన్ జరిగినా నటనలో, నాట్యంలో ఉత్సాహం మరింత పెరిగిందే కానీ, ఇసుమంతైనా తగ్గకపోవడం ఆయన మానసిక స్థైర్యానికి మచ్చుతునక. అదే 'గుండె ధైర్యం'తో తన తొంభై ఏళ్ల వయసులో ప్రెస్ మీట్ పెట్టి తనకు క్యాన్సర్ సోకిందనీ, మరెంతో కాలం బతకననీ చెప్పగలగడం స్ఫూర్తి దాయకం. పై మూడు సంఘటనలూ, వయసు మారిందే గానీ, ఆయన వన్నె ఏ మాత్రం తగ్గ లేదని నిరూపించాయి.

'ఆడపిల్లలకి చదువులెందుకు? పెళ్లిళ్లు చేసి ఓ అయ్య చేతిలో పెట్టి పంపెయ్యక' అనే పాత కాలపు భావజాలం సమాజంలో అధికంగా ఉన్న రోజుల్లో 'చదువుకున్న అమ్మాయిలు' అనే టైటిల్‌తో స్త్రీలకు విద్య యొక్క ప్రాధాన్యతను తెలిపేలా చిత్రం చేయడం ఆయన ప్రోగ్రెసివ్ థాట్ ప్రాసెస్‌కి తార్కాణం. ఈనాటి 'వుమెన్ ఎంపవర్‌మెంట్' ట్రెండ్‌కి బీజం వేసిన సాంఘిక కార్యకర్తల్లో అక్కినేని కూడా ఒకరు.

విగ్గు, మేకప్పు లేకుండా ఇంట్లోంచి కాలు కూడా బైటికి కదపలేని కళాకారులకి ఆయన 'సీతారామయ్య గారి మనవరాలు' మారుతున్న సినిమా మేకింగ్ విలువలకి ఒక గొప్ప పాఠం. స్టార్ హీరోగా అత్యధిక పారితోషికం అందుకుంటున్న రోజుల్లో 'సుడిగుండాలు' వంటి చిన్న పిల్లల మానసిక సమస్య మీద చిత్రాన్ని నిర్మించి, నటించడం ఆయన సామాజిక బాధ్యతకి, ప్రభావవంతమైన ఆలోచనా పరిణతికి నిదర్శనం. దసరా బుల్లోడు, ప్రేమనగర్, ప్రేమాభిషేకం, ఆత్మగౌరవం, అగ్నిపుత్రుడు, సూత్ర ధారులు, డాక్టర్ చక్రవర్తి, మూగ మనసులు, దేవదాసు, మాంగల్యబలం, విప్రనారాయణ, సువర్ణ సుందరి, కీలుగుర్రం... ఇలా ఏ జోనర్‌లో చూసినా తెలుగు సినిమా కీర్తి కిరీటంలో అక్కినేని పొదుకొచ్చిన కలికి తురాళ్లు కనిపిస్తాయి. మిస్సమ్మ, గుండమ్మ కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం వంటి మల్టీ స్టారర్‌లతో తెలుగు సినిమా మార్కెట్ పరిధిని ఇతోధికంగా పెంచడం కూడా ఆయన చేసిన కృషిలో ఒక భాగం. హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోస్ నెలకొల్పడం, చలన చిత్ర నిర్మాణ సంస్థని ప్రారంభించడం... కొన్ని లక్షలమంది కళాకారుల కలలని సాకారం చేయడానికి ఆయన ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని చెప్పాలి.

''అక్షరం నేర్చుకోలేదని బాధ ఉంది'' అని చెప్తూనే, నిరంతర విద్యార్థిగా తెలుగు, తమిళ, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా మాట్లాడడం, రాయడం, నేర్చుకుని, 'అక్కినేని ఆలోచనలు (అ, ఆలు)' వంటి వచన కవితా సంపుటిని ప్రచురించడం ఆయనలోని క్రమశిక్షణకి, విద్యారంగం పట్ల గౌరవానికి దర్పణం. ముళ్లపూడి వెంకటరమణ గారన్నట్లు–

అక్కినేని నాగేశ్వరరావు / ఎక్కని ఎత్తుల్లేవు / వెళ్లలేని దూరాల్లేవు.

ఆయన కీర్తి, ప్రభావం, ప్రతిభ ప్రయాణించే కాలంలో మన జీవిత కాలం ఒక చిన్న మజిలీ మాత్రమే. ఆయనే శాశ్వతం. శతమానం భవతి. అక్కినేని అభిమానులకి ఆయన శత సంవత్సర జయంతి శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రముఖ సినీ దర్శకుడు
(నేటి నుంచి అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** శు.పంచమి ఉ.10.40 వరకు
తదుపరి షష్ఠి, **నక్షత్రం:** విశాఖ ప.12.43 వరకు
తదుపరి అనూరాధ, **వర్జ్యం:** సా.4.43 నుండి 6.21 వరకు,
దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.19 వరకు,
అమృత ఘడియలు: రా.2.23 నుండి 3.56 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ మీడియా

నమ్మితే చాలా?



ఈ రెండు దేశాలు తీవ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నాయని ఇండియా నమ్ముతోంది: పాకిస్తాన్, కెనడా.
– డెరెక్ జె. గ్రాస్‌మన్, ప్రొఫెసర్

సంబంధాలకు దెబ్బ



కెనడా, ఇండియా శత్రుదేశాలు కాదు, మిత్రులు. కానీ కెనడాలోని సిక్కు రాడికల్స్‌తో తన రాజకీయ మైత్రి వల్ల ప్రధాని జస్టిన్ ట్రూడో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీశారు.
– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఎందుకు చేస్తుంది?



అసలు కెనడాలోని ఒక సిక్కు యాక్టివిస్టును చంపాల్సిన అవసరం ఇండియాకు ఎందుకుంటుంది? ఇది తర్కానికి అందని విషయం. పైగా, పంజాబ్ వేర్పాటువాద ఉద్యమం కూడా ఇప్పుడు అంత చురుగ్గా లేదు కదా!
– ముర్తజా హుస్సేన్, కాలమిస్ట్

'మహాలక్ష్మి' గేమ్ చేంజరే!

అభిప్రాయం



ఫిరోజ్ ఖాన్

తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ 'సిక్స్ గ్యారంటీస్'ను ప్రకటించింది. అయితే ఇందులో ఉన్న 'మహాలక్ష్మి' స్కీమ్ గేమ్ చేంజర్‌గా నిలిచే అవకాశముంది. ఈ పథకంలో కుటుంబ పెద్ద అయిన మహిళకు ప్రతి నెల రూ. 2500 ఇవ్వడంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అంతేకాకుండా ఇంట్లో వినియోగమయ్యే 'గ్యాస్ బండ' గుదిబండగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని రూ. 500కే ఇస్తామని 'హస్తం' పార్టీ మాటిచ్చింది. రైతుభరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత వంటి పథకాల ఎఫెక్ట్ ఎలా ఉన్నా... జనాభాలో సగభాగమున్న మహిళలను 'మహా లక్ష్మి' స్కీమ్ ద్వారా కాంగ్రెస్ తనవైపు తిప్పుకునే పరిస్థితి కనిపిస్తున్నది. ఆర్థిక పరిస్థితులు, అమలులో కష్టనష్టాలు ఎలా ఉన్నా... కర్ణాటకలో ఇలాంటి స్కీమ్‌నే కాంగ్రెస్ అమలు చేసి చూపిస్తున్నది. దీంతో ఈ స్కీమ్ పట్ల మహిళల్లో నమ్మకం, భరోసా కనిపిస్తున్నది.

అనేక హామీలను ఇష్టానుసారంగా ఇచ్చేస్తున్న కాంగ్రెస్ నేతలు వాటిని ఎలా అమలు చేస్తారో మాత్రం నివృత్తి చేయడం లేదు. మహాలక్ష్మి స్కీమ్ కింద రూ. 2,500 ఇస్తామని చెబుతున్నా... వాటి విధి విధానాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. ఈ స్కీమ్‌కు ఎన్ని నిధులు అవసరమవుతాయి? అర్హులను ఎలా ఎంపిక చేస్తారు? తదితర వాటిపై కూడా ప్రజలకు వివరిస్తే మహిళల్లో నమ్మకం పెరిగే అవకాశముంటుంది. బస్సుల్లో ఉచిత ప్రయాణం స్కీమ్ వల్ల కర్ణాటక ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడుతున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దీన్ని ఎలా అమలు చేస్తారో కాంగ్రెస్ స్పష్టంగా చెప్పడం లేదు. టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ సర్కారు రూపొందించిన బిల్లుకు ఇటీవలే గవర్నర్ ఆమోదం తెలిపారు. అయితే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ద్వారా ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం ఎంత? ఉచిత ప్రయాణానికి ఎలాంటి నిబంధనలు రూపొందిస్తారు? ఎలాంటి నిబంధనలు లేకుండానే ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారా? వంటి వాటిపై కాంగ్రెస్ స్పష్టతనివ్వాల్సిన అవసరముంది.

వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

వైఫల్యాలను ఒప్పుకోవడమే!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

ఇటీవల కాంగ్రెస్ 'గ్యారంటీ' కార్డును విడుదల చేసినప్పుడు చాలా బాధేసింది. ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతాన్ని అత్యధిక కాలం పాలించింది కాంగ్రెస్సే కదా? అందిస్తున్న గ్యారంటీలను చూస్తుంటే ఇంత కాలం ఆ పార్టీ ప్రజలకు తాను ఒరగబెట్టింది ఏమీ లేదని తనంతట తాను ఒప్పుకుంటున్నట్లుగా ఉంది. స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితో దేశాన్ని తీర్చి దిద్దుకోవటానికి 75 సంవత్సరాలు సరిపోలేదంటే దేశాన్నేలిన పార్టీలనేమనాలి? రాజకీయంగా విమర్శల కోసం మాట్లాడుతున్న మాటలు కావివి. కాంగ్రెస్, బీజేపీలకు ఇంతకాలం అధికారం ఇస్తే అవి ఏం చేశాయి? దేశంలోని 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల బతుకులకు కనీస భద్రత కల్పించేందుకు ఇంత కాలం సరిపోలేదంటే ఏమనాలి? దేశం ఎటుపోతోంది? నీళ్లు, నిధుల పంపిణీకీ, నియామకాలకూ, ప్రజల జీవన విధానానికీ భరోసా కల్పించటానికి వీళ్ళకు ఇంకెంత కాలం కావాలో?

రైతుకు గ్యారంటీ లేదు. మహిళలకు భద్రత లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆదివాసీ, గిరిజన వర్గాలకు అసలు గ్యారంటీ లేదు. యువకులు నిస్తేజంతో నిరాశలో మునిగిపోయారు. ప్రభుత్వ బడులను దిక్కులేనివాళ్ళ బడులుగా మార్చేసి ఇప్పుడు ప్రతి మండలంలో 'ఇంటర్నేషనల్ స్కూల్' పెడతారా? కేంద్రం పెట్టిన 'నవోదయ స్కూళ్ళే' అంతంతమాత్రం నడుస్తున్నాయి. ఒక వస్తువును కొంటే నిర్ణీత కాలం లోపు అది చెడిపోతే బాగుచేసి ఇస్తామన్న గ్యారంటీ ఇస్తే ఆ యా కంపెనీల వస్తువులను వినియోగదారులు కొనడానికి ముందు కొస్తారనేది తెలిసిందే. ఇప్పుడు కాంగ్రెస్ ఎన్నికలను 'వ్యాపారం'గా మార్చి ఓట్లు దండుకోవడానికి 'గ్యారంటీ' కార్డులను విడుదల చేసిందన్న మాట!

75 ఏళ్ళుగా వారు చేయవలసినవి చేయకుండా... వాటికి ఇప్పుడు గ్యారంటీ ఇవ్వడాన్ని



ఎలా అర్థం చేసుకోవాలి? నిరుద్యోగాన్ని పెనుభూతం చేశారు. మానవ శ్రమకు ఆస్కారం లేని జీవితాలను సృష్టించుకుంటూ పోతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ పిడికెడు మంది పెట్టుబడిదారులను పెంచి పోషించడంలో చూపిస్తున్న శ్రద్ధ పేదలను పైకి తీసుకు రావడంలో చూపించడం లేదు. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే మనం ఎంతో గొప్ప అని పాలక పార్టీలు ప్రచారం చేసుకోవడం చూశాం. మరికొన్ని విషయాల్లో బాగా వెనుకబడిన దేశంగా చెప్పుకునే బంగ్లాదేశ్ కన్నా భారత్ చాలా వెనుకబడి పోయిందనే సంగతి వీళ్లు చెప్పరేం?

మాఫీ గ్యారంటీ పథకం, రాయల్టీ గ్యారంటీ పథకం ఇస్తామంటున్న వీరు పన్ను రాయితీలు, సబ్సిడీలు, విదేశీ పెట్టుబడులకు అనుమతులు ఎవరికిచ్చారు? ఎన్నికలు రాగానే ప్రజలను ఓట్ల యంత్రాలుగా మార్చి పేదలకు గ్యారంటీ పథకాలను ప్రకటించేస్తున్నారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కాపలాదారులుగా వ్యవహరించడం కాదు చేయవలసింది, పేదలకు కొండంత అండగా నిలవాలి. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ పొడిగిస్తామంటే చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోగలరు. 'దళితబంధు' లాంటి పథకాలను కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటిదాకా ఎందుకు పెట్టలేక పోయాయో తెలంగాణ ప్రజలు తెలుసుకోగలరు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పేర్లు మార్చి అంతకంటే ఎక్కువ ఇస్తామని చెప్పి వాటిని గ్యారంటీ పథకాలు అని చెప్పి కాంగ్రెస్ ప్రకటించింది. కానీ దేశ ఆదాయాన్ని పెట్టుబడిదారులకు కాకుండా పేదలకు పంచిపెడతామని మాత్రం చెప్పడం లేదు.

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్

గ్యారంటీలు ఫలించేనా?

అభిప్రాయం



డా॥ తిరునాహరి శేషు

మరొక రెండు నెలలలో తెలంగాణ రాష్ట్ర శాసన సభకు మూడోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇవి దేశ రాజకీయాలను ప్రభావితం చేసేవి కాబట్టి ఈ ఎన్నికలలో గెలుపుని అధికార బీఆర్ఎస్, ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత జరిగిన మొదటి శాసనసభ ఎన్నికలలో తెలంగాణ ఇచ్చిన పార్టీగా గెలుపుని అందు కోవటంలో కాంగ్రెస్ పార్టీ భంగపడింది. రెండో శాసనసభ ఎన్నికలలో బలమైన అధికార బీఆర్ఎస్‌ని ఓడించడానికి ఐదు పార్టీలతో 'మహాకూటమి' ఏర్పాటు వ్యూహం కూడా బెడిసి కొట్టి పరాజయం పాలైంది. కానీ, మూడోసారి జరగబోయే శాసనసభ ఎన్నికలలో సంక్షేమ పథకాలతో ఓటర్లను తన వైపుకు తిప్పుకొని విజయం సాధించాలనే ఎత్తుగడలతో కాంగ్రెస్ ఉన్నట్లు కనిపిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో గెలుపు కోసం ఒకవైపు ఆ యా వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి డిక్లరేషన్‌లను ప్రకటిస్తూ తుక్కుగూడ సభ నుండి 'మహాలక్ష్మి', 'గృహ జ్యోతి', ' రైతు భరోసా' 'చేయూత', 'ఇందిరమ్మ ఇండ్లు', 'యువ వికాసం' – ఇలా ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. వీటి ద్వారా మహిళలు, రైతులు, వృద్ధులు, పేదలు, యువ ఓటర్లను ఆకర్షించాలనేది కాంగ్రెస్ పార్టీ ఎత్తు గడగా కనిపిస్తోంది. ముఖ్యంగా మహాలక్ష్మి గ్యారంటీలో భాగంగా మహిళలకు ప్రతినెల ధనసహాయం చేయడం, గ్యాస్ సిలిండర్‌ను తక్కువ ధరకే అందించడం, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం లాంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకునే అవకాశం ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ, పంజాబ్‌లలో; కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకల్లో ఇలాంటి హామీలతో మహిళా ఓట్లను ఆకర్షించగలిగాయి. అధికారంలోకి రాగలిగాయి. గృహజ్యోతి గ్యారంటీ ద్వారా ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా ఓటర్లపై ప్రభావం చూపెట్టబోతోంది. అలాగే 'ఇందిరమ్మ ఇండ్లు' గ్యారంటీలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం ఇస్తామనే హామీ ఉద్యమకారులపై పడితే బీఆర్ఎస్‌కు రాజకీయంగా నష్టం జరిగే అవకాశం లేకపోలేదు.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు

జోకర్లు, బ్రోకర్లు X గులామీ గ్యాంగ్

గ్యారంటీలపై ట్విట్టర్ యుద్ధం

- మంత్రి కేటీఆర్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌ల మధ్య మాటల దాడులు
- కల్లబొల్లి గ్యారంటీలు చెల్లవిక్కడ అంటూ కేటీఆర్ ట్వీట్
- అయ్యా కొడుకులు అంగీలు చింపుకుంటున్నారని రేవంత్ రీట్వీట్





సాక్షి, హైదరాబాద్: విజయభేరి పేరుతో తుక్కుగూడలో నిర్వహించిన భారీ బహిరంగసభ వేదికగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై రాష్ట్ర మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నడుమ ట్విట్టర్ వేదికగా యుద్ధమే జరిగింది. మోసం, వంచన, ద్రోహం, దోఖాల మయం కాంగ్రెస్ అర్ధ శతాబ్దపు పాలనంతా అని కేటీఆర్ ట్వీట్ చేస్తే తెలంగాణ కోసం తల్లి సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను చూసి అర్ధరాత్రి నుంచి అయ్యా కొడుకులు అంగీలు చింపుకుంటున్నారని రేవంత్ రీట్వీట్ చేశారు.

మీ కపట కథలు చెల్లవిక్కడ: కేటీఆర్

కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ కేటీఆర్ సుదీర్ఘంగా ట్వీట్ చేశారు.'ఇది మీ కపట కథలు, కుత్రి గోత్రాలు బాగా తెలిసిన తెలివైన తెలంగాణ గడ్డ, కల్లబొల్లి గ్యారంటీలు చెల్లవ్ ఇక్కడ' అంటూ తన ట్వీట్‌ను మొదలుపెట్టిన కేటీఆర్.. రాబందుల రాజ్యమొస్తే రైతుబంధు రద్దవడం గ్యారంటీ, కాలకేయుల కాలం వస్తే కరెంట్ కోతలు, కటిక చీకట్లు గ్యారంటీ, మూడు రంగుల ఊసరవెల్లిని నమ్మితే మూడు గంటల కరెంటే గతి, ఉచిత విద్యుత్ ఊడగొట్టడం గ్యారంటీ,, బకాసురులు గద్దెనెక్కితే రైతుబీమా, ధీమా గల్లంతవ్వడం గ్యారంటీ, సమర్థత లేని సన్నాసులకు ఓటేస్తే సకల రంగాల్లో సంక్షోభం గ్యారంటీ, ఢిల్లీ కీలుబొమ్మలు కుర్చీఎక్కితే ఆత్మగౌరవాన్ని అంగట్లో తాకట్టు పెట్టడం గ్యారంటీ, స్కాముల పార్టీకి స్వాగతం చెబితే, స్కీములన్నీ ఎత్తేయడం గ్యారంటీ, పనికిమాలిన వాళ్ల పవర్‌లోకి వస్తే పరిశ్రమలు పారిపోవడం గ్యారంటీ, థర్డ్ గ్రేడ్ నాలాయక్‌ను నమ్ముకుంటే ప్రథమ స్థానంలో ఉన్న స్టేట్ అధమ స్థాయికిపోవడం గ్యారంటీ, జోకర్లకు, బ్రోకర్లకు పీఠం ఇస్తే పరువు ప్రతిష్ఠలు గంగలో కలవడం గ్యారంటీ, దాచి దాచి దెయ్యాలకు పెట్టేంత ఎడ్డిది కాదు.. ఈసగాచి నక్కల పాలుజేసేంత అమాయక నేల కాదు నా తెలంగాణ, జై తెలంగాణ అంటూ ముగించారు.

పదేళ్లలో వందేళ్ల విధ్వంసం సృష్టించారు: రేవంత్

మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఘాటుగానే స్పందించారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్. 'మా నాయకుడు రాహుల్‌గాంధీ చెప్పిన విధంగా రాబోయే 100 రోజుల్లో' అంటూ తన ట్వీట్‌ను ప్రారంభించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని దోఖా ఇచ్చిన దగాకోరును గద్దె దించడం గ్యారంటీ, మూడెకరాల భూమి మాట తప్పి, వేల ఎకరాలు వెనకేసిన భూబకాసురులను బొందపెట్టడం గ్యారంటీ, కమీషన్లను దండుకోవడమే మిషన్‌గా పెట్టుకున్న వసూల్ రాజాల భరతం పట్టడం గ్యారంటీ, పదేళ్లలో వందేళ్ల విధ్వంసం సృష్టించిన వినాశకారులను పాతరేయడం గ్యారంటీ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టిన 'గులామీ' గ్యాంగ్‌ను పాతాళానికి తొక్కడం గ్యారంటీ, అధికారం శాశ్వతం అనుకుని నీలిగిన నిజాం రాచరికాన్నే పీచమణిచిన గడ్డ ఇది.. మీరొక లెక్కా..? అధికారంలోకి వస్తున్నాం.. అన్ని గ్యారంటీలు అమలు చేస్తున్నాం. జై కాంగ్రెస్! జై తెలంగాణ! అంటూ రేవంత్ తన ట్వీట్‌ను ముగించారు.

మోదీ వ్యాఖ్యలపై రాహుల్ ట్వీట్‌కి రేవంత్ రీట్వీట్

ఇక, ఏపీ విభజనపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ ఖండించిన ట్వీట్‌కు రీట్వీట్ చేశారు రేవంత్. 'తెలంగాణ త్యాగాల విలువ, పోరాట స్ఫూర్తిని కించపరిచేలా మోదీ మాట్లాడటం ఘోరం. రాష్ట్రం ఏర్పాటు చేసిన పార్టీగా తెలంగాణ గుండె చప్పుడు తెలుసు కాబట్టే మోదీ వ్యాఖ్యలను రాహుల్ తిప్పికొట్టారు. మనం బీజేపీని తరిమికొడదాం' అని ఆ ట్వీట్‌లో పోస్టు చేశారు.

ఆర్.కృష్ణయ్యకు శస్త్రచికిత్స



సాక్షి, హైదరాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆరోగ్యం కుదుటపడటంతో ఆయన్ను వైద్యులు మంగళవారం డిశ్చార్జి చేశారు. వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉంటూ విశ్రాంతి తీసుకోకపోవడంతో తీవ్ర ఒత్తిడి, ఇతర అనారోగ్య సమస్యలతో 3 రోజుల కిందట జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరారు. వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత శస్త్రచికిత్స చేయడంతో ఆయన ఆరోగ్యం కుదుటపడింది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ పక్షం రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు చెప్పారన్నారు. ఆ తర్వాత తిరిగి ప్రజల్లోకి వెళ్తానని చెప్పారు. ప్రస్తుతం పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఢిల్లీ వెళ్లనున్నట్లు కృష్ణయ్య తెలిపారు.

ముందే పక్వానికి వచ్చిన వరి

ఆందోళనలో రైతాంగం



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ చంద్రశేఖరరెడ్డి

దమ్మపేట: వరిలో సగం పంట ముందే పక్వానికి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పేరంటాల చెరువు ఆయకట్టు కింద సుమారు 70 ఎకరాల్లో ఎంటీయూ–1064 రకం వరి సాగు చేశారు. సాధారణంగా ఈ వరి విత్తిన 120 నుంచి 130 రోజుల తర్వాత పక్వానికి రావాల్సి ఉండగా, వంద రోజులకే వచ్చింది. అయితే, పూర్తి పంట పక్వానికి రాకపోవడం రైతుల ఆవేదనకు కారణమైంది. దీంతో ఏఓ చంద్రశేఖరరెడ్డి మంగళవారం పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంపెనీ బాధ్యులు బుధవారం పంటను పరిశీలిస్తారని, విషయాన్ని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దీప్తి, రైతులు పందేటి బుజ్జి, పందేటి వెంకటేశ్వరరావు, చిన వెంకయ్య, కుప్పాల శ్రీను, చిన్నశెట్టి రాధ, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో స్వల్ప భూకంపం

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో సోమవారం రాత్రి స్వల్పంగా భూమి కంపించింది. రెండు మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో, పులిచింతల ప్రాజెక్టు ప్రాంతంలోనూ స్వల్పంగా భూ ప్రకంపనలు సంభవించినట్లు పలువురు తెలిపారు. 10 సెకన్ల పాటు సంభవించిన ఈ ప్రకంపనలను కొద్ది మంది మాత్రమే గుర్తించినట్లు చెబుతున్నారు. రిక్టర్‌స్కేల్‌పై 2.3 మాగ్నిట్యూడ్‌గా ప్రకంపనలు నమోదైనట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం వచ్చిన భూకంపం 3.0 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. కాగా, 2020, 2022 సంవత్సరాల్లో పలు మార్లు భూ ప్రకంపనలు సంభవించాయి. ఇప్పుడు మళ్లీ భూకంపం రావడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

70 ఏళ్ల వయసులో అంతర్జాతీయ పతకం

200 మీటర్ల పరుగు పందెంలో రజతం సాధించిన రామానుజమ్మ



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన 70 ఏళ్ల టమటం రామానుజమ్మ అంతర్జాతీయ వేదికపై మెరిశారు. 35వ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 50 కిలోల విభాగంలో పాల్గొని రజతం సాధించారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన పరుగు పందెంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల విభాగాల్లో తలపడ్డ ఆమె.. 200 మీటర్ల విభాగంలో మూడోస్థానం సాధించారు. దేశం తరఫున మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొనడం, మూడోస్థానం సాధించడం గర్వంగా ఉందని రామానుజమ్మ కౌలాలంపూర్ నుంచి 'సాక్షి'కి మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సీఎం జలగం సోదరుడు కెప్టెన్ రామారావు కన్నుమూత



బంజారాహిల్స్ (హైదరాబాద్): దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు, ప్రముఖ పర్యావరణవేత్త కెప్టెన్ జె.రామారావు (94) మంగళవారం ఉదయం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని వ్యాలీ వ్యూలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరుగుతాయని వెంగళరావు తనయుడు జలగం ప్రసాదరావు వెల్లడించారు. కెప్టెన్ రామారావు 32 సంవత్సరాల పాటు భారత నావికాదళంలో వివిధ హోదాల్లో పని చేశారు. కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌గా కూడా ఆయన సేవలందించారు. ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్, సీఐఐ చైర్మన్‌గా, ప్రిజర్వేషన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ అధ్యక్షుడిగా, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఫౌండర్ చైర్మన్‌గా కెప్టెన్ రామారావు పని చేశారు. 1972లో ఆయన చేసిన సేవలకు గాను విశిష్ట సేవా మెడల్ లభించింది. విశాఖపట్నం నావల్ ప్రాజెక్ట్స్ డీజీగా కూడా ఆయన విధులు నిర్వర్తించారు. ఆయన మృతి పట్ల పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

భావోద్వేగాలతో బీజేపీ ఆటలు

- అధికారంలోకి రాలేమన్న నిస్పృహతో కాంగ్రెస్ వాగ్దానాలు
- ప్రజలు ఏవైపు నిలబడతారో తేల్చుకునే సమయం వచ్చింది: కేటీఆర్
- మోదీ సర్కారు రాష్ట్రంపై వివక్ష చూపుతోంది
- ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ కరెంటు, నీటి కష్టాలు తప్పవని వ్యాఖ్య
- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు 'కోనేరు'



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కోనేరు చిన్నసత్యనారాయణ. చిత్రంలో పువ్వాడ అజయ్, రేగ కాంతారావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: అధికారం దూరమవుతుందనే నిరాశ, నిస్పృహలతో కాంగ్రెస్ నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తోందని.. తొమ్మిదేళ్ల పాలనలో చెప్పు కొనేందుకు చేసినదేమీ లేక ఓట్ల కోసం బీజేపీ భావోద్వేగాలను రెచ్చగొడుతోందని మంత్రి కేటీ రామారావు ఆరోపించారు. పేదలు, రైతులను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న సీఎం కేసీఆర్.. తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఏ వైపు నిలబడతారో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోనేరు చిన్నసత్యనారాయణ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ''కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి చేసిందేమిటో చెప్పుకునే పరిస్థితి లేక తిమ్మినిబమ్మి చేసి అధికారంలోకి రావాలనుకుంటోంది. హైదరాబాద్ సంస్థానం విలీనమైన సందర్భం, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం, త్యాగాలను గుర్తు చేసుకుంటూ సీఎం కేసీఆర్ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఇది నచ్చని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత వైషమ్యాలు రెచ్చగొట్టి. పాత గాయాలను రేపి చలి కాచుకోవాలని చూస్తోంది'' అని కేటీఆర్ ఆరోపించారు.

రాష్ట్రంపై తీవ్ర వివక్ష

తెలంగాణ ఏర్పాటైననాటి నుంచే మోదీ నేతృత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. పార్లమెంటు వేదికగా ఇచ్చిన విభజన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. పేదల జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామని మోదీ మాట ఇచ్చి తప్పారని.. మరోవైపు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుబంధు పేరిట 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు వేశారని చెప్పారు. కేంద్రం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతూ, ప్రభుత్వ సంస్థలను అదానీకి కట్టబెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అంటూ డ్రామాలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పౌరుషముంటే మోదీ ఇంటి ముందు ధర్నా చేయాలని వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి పెట్టుబడితో పాత గాయాలను మళ్లీ రేపేలా రజాకార్ సినిమా తీసి, ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మోదీకి ఉత్కృష్ట పదవి ఇస్తే.. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, రజాకార్ ఫైల్స్ అంటూ నికృష్ట పనులు చేస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌వి ఆపద మొక్కులు

రాష్ట్రంలో 55 ఏళ్లు అధికారంలో ఉండీ ఏమీ చేయలేని కాంగ్రెస్.. ఇప్పుడు అధికారం కోసం ఆపద మొక్కులు మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. ''కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలుకానీ ఆరు గ్యారంటీలు ఇక్కడ అమలు చేస్తారట. డబ్బు సంచులతో కెమెరాలకు చిక్కిన వారికి నాయకత్వం అప్పగిస్తే ఇలాంటి దిక్కుమాలిన ఆలోచనలే వస్తాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు, తాగునీరు, సాగునీరు, ఎరువులు, విత్తనాల కోసం మళ్లీ కష్టాలు తప్పవు. రైతుబంధు, దళితబంధుకు మంగళం పాడుతారు. కర్ణాటకలో హామీల అమలుకు నిధులు లేవని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్తున్నారు. కాంగ్రెస్ నేతల వద్ద కుంభకోణాలతో సంపాదించిన సొమ్ము చాలానే ఉంది. వాళ్లు డబ్బులు ఇస్తే తీసుకుని బీఆర్‌ఎస్‌కు ఓటు వేయండి..'' అని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్, ప్రభుత్వ విప్ రేగ కాంతారావు, ఎమ్మెల్యే హరిప్రియ, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన సందర్భం

మహిళా బిల్లుపై మంత్రి కేటీఆర్ ట్వీట్


''రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన సందర్భాలు కొన్ని వస్తూ ఉంటాయి. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని అంశాలపై ఐక్యంగా నిలవాల్సి ఉంటుంది. ఈ రోజు మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ పరిగణనలోకి తీసుకోవడం పట్ల భారతీయుడిగా గర్విస్తున్నా'' అని మంత్రి కేటీఆర్ ఎక్స్(ట్విట్టర్)లో వ్యాఖ్యానించారు. ''మైలు రాయి వంటి ఈ చట్టానికి మద్దతు పలికిన కేంద్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలకు నా హృదయపూర్వక అభినందనలు. ఈ బిల్లు వాస్తవ రూపం దాల్చేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నో ప్రయత్నాలు చేసినందుకు గర్విస్తున్నా. ఇంకా చెప్పాలంటే స్థానిక సంస్థలైన జిల్లా, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎన్నో ఏళ్ల క్రితం నుంచే తెలంగాణలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి'' అని కేటీఆర్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

అక్టోబర్ 1కి మిలాద్ ర్యాలీ వాయిదా

చార్మినార్ (హైదరాబాద్): మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా నిర్వహించే మిలాద్ ర్యాలీని అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు మార్కజ్ మిలాద్ జూలూస్ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 28న గణేశ్ నిమజ్జనం పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రజలు మతసామరస్యంతో పండుగలు జరుపుకోవాలని కమిటీ కోరింది.

రేపట్నుంచి మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు

చర్ల: మావోయిస్టు పార్టీ 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 27 వరకు వారోత్సవాలను నిర్వహించాలని ఆ పార్టీ చర్ల–శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. 21న ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని ఈ మేరకు సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. చర్ల మండలంలోని కలివేరు – పెదమిడిసిలేరు మార్గంలో సోమవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్ర కమిటీ, చర్ల శబరి ఏరియా కమిటీ పేరిట కరపత్రాలు విడుదల చేయడంతోపాటు బ్యానర్లు కట్టారు. సరిహద్దు ప్రాంతంలోని గ్రామాల నుంచి వారోత్సవాల సభలకు పెద్దఎత్తున తరలిరావాలని ఆదివాసీలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారిని కట్టడి చేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. అటవీప్రాంత గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దండకారణ్యం వైపునకు ఏయే గ్రామాల నుంచి వెళ్తున్నారనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. దండకారణ్యానికి భారీగా చేరుకున్న పోలీసు బలగాలతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆదివాసీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



చర్ల సమీపాన వెలిసిన మావోయిస్టుల పోస్టర్

ఏఆర్ ఎస్‌ఐ బలవన్మరణం



శోభన్‌బాబు

గంగారం(మహబూబాబాద్): ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) ఎస్‌ఐ ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బావురుగొండ గ్రామానికి చెందిన శోభన్‌బాబు(38) సత్తుపల్లి బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. సెలవుపై స్వగ్రామానికి వచ్చిన శోభన్‌బాబు మంగళవారం ఉదయం చేను వద్దకని వెళ్లి మధ్యాహ్నం వరకు తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చేను వద్దకు వెళ్లి చూడగా అతడు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. తన భర్త కొంతకాలంగా తీవ్ర మెడనొప్పితో బాధపడుతున్నారని, ఆస్పత్రిలో చూపించుకోవాలని మూడురోజులు సెలవు పెట్టి ఆదివారం స్వగ్రామానికి వచ్చారని ఆయన భార్య రజిత పోలీసులకు తెలిపారు.


సెంట్రల్ హాల్‌లో శరద్‌పవార్ తదితరులతో మోదీ


ఖర్గేతో కరచాలనం


మోదీకి సోనియా అభివాదం. చిత్రంలో అధీర్, మిథున్‌రెడ్డి తదితరులు


రాజ్యాంగ ప్రతితో కొత్త భవనంలోకి వెళ్తున్న విపక్ష నేతలు

నారీ శక్తికి వందనం

దశాబ్దాల ఎదురు చూపులకు తెరదించిన కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు


మంగళవారం కొత్త ప్రాంగణంలో కొలువు దీరిన లోక్‌సభ

బిల్లులో ఏముంది?

- మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఆరు పేజీల బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- లోక్‌సభలో, శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఈ సీట్లను భర్తీ చేస్తారు. రాజ్యసభలో, రాష్ట్రాల శాసన మండలిలో ఈ రిజర్వేషన్లు వర్తించవు.
- మహిళల కోటాలో మూడో వంతు సీట్లను ఎస్సీలు, ఎస్టీలకు కేటాయిస్తారు.
- నియోజకవర్గాల పునర్విభజన జరిగిన ప్రతిసారి మహిళల రిజర్వ్‌డ్ సీట్లు రొటేషన్ అవుతుంటాయి. అంటే మహిళకు కేటాయించిన నియోజకవర్గాలు స్థిరంగా ఉండవు.
- బిల్లులో ఓబీసీ(ఇతర వెనుకబడిన తరగతులు)లను చేర్చడంపై ఎలాంటి ప్రస్తావన లేదు. ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండవు.
- ఆంగ్లో–ఇండియన్ మహిళలకు కూడా ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండవు.
- ప్రస్తుతం లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళా సభ్యుల సంఖ్య 14 శాతం ఉంది. ప్రపంచ సగటుతో పోలిస్తే చాలా తక్కువ.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం.. రాజ్యాంగ సవరణ బిల్లును కనీసం 50 శాతం రాష్ట్రాలు అంగీకరించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి
అమలయ్యే అవకాశం లేదు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. 2027 తర్వాతే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలవుతాయని ప్రధాని నరేంద్ర మోదీ సంకేతాలిచ్చారు. మహిళల కోటా బిల్లు చట్టంగా మారిన తర్వాత 15 సంవత్సరాలపాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత కాల వ్యవధిని పొడిగించవచ్చు. 1996 నుంచి.. గత 27 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎట్టకేలకు మోక్షం లభిస్తుండడం పట్ల ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికార ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతోపాటు పలు విపక్షాలు సైతం ఈ బిల్లుకు మద్దతు ప్రకటించాయి. పార్లమెంట్‌లో బిల్లు సునాయాసంగా ఆమోదం పొందడం ఖాయమేనని చెప్పొచ్చు. మహిళా రిజర్వేషన్ బిల్లు ముమ్మాటికీ తమదేనని కాంగ్రెస్ పార్టీ ఎంపీ సోనియా వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుత లోక్‌సభలో 82 మంది మహిళలున్నారు. రిజర్వేషన్ల చట్టంతో ఈ సంఖ్య 181కి చేరుతుందని మంత్రి మేఘ్వాల్ చెప్పారు.


ఉభయ సభలు వాయిదా

పార్లమెంట్ నూతన భవనంలో మంగళవారం ఉభయ సభల కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అదేవిధంగా, రాజ్యసభలో ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసగించారు. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాలకు జీఎస్టీకి సంబంధించిన చెల్లింపులపై ఖర్గే లేవనెత్తిన అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది.

ఆ(మె) బిల్లు వెనక..

- దశాబ్దాలుగా చర్చలకే పరిమితమైన మహిళా బిల్లు
- పార్టీలన్నీ సమర్థిస్తున్నా పార్లమెంట్ ఆమోదం మాత్రం ఇన్నాళ్లుగా ఎండమావే

మహిళలకు చట్ట సభల్లో, ముఖ్యంగా లోక్‌సభ, అసెంబ్లీల్లో మూడో వంతు రిజర్వేషన్లు.. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా చర్చలో ఉన్న అంశం. అదే సమయంలో, అంతేకాలంగా విజయవంతంగా పెండింగ్‌లోనూ ఉన్న అంశం. అన్ని పార్టీలూ ఇందుకు మద్దతు తెలిపేవే. కానీ తీరా సదరు పార్లమెంటులో బిల్లు రూపంలో ప్రస్తావనకు వచ్చినప్పుడు మాత్రం ఆమోదం పొందకపోవడం, చివరికి సంబంధిత లోక్ సభ కాలపరిమితి తీరడం, దాంతో బిల్లుకు కూడా కాలదోషం పట్టడం... ఇదీ వరస!



1989లో తెరపైకి...

మహిళలకు చట్ట సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీతో మొదలైంది. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో వారికి 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆయన హయాంలో, అంటే 1989లో పార్లమెంటులో బిల్లు పెట్టారు. అయితే అది లోక్ సభలో ఆమోదం పొందింది గానీ రాజ్యసభలో గట్టెక్కలేదు. అనంతరం తెలుగు తేజం పీవీ నరసింహారావు ప్రధానిగా ఉండగా 1992, 1993లో ఈ మేరకు 72 73వ రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టారు. వాటిని ఉభయ సభలూ ఆమోదించాలి. అలా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లోని స్థానాలు, చైర్ పర్సన్ పదవుల్లో మహిళలకు 33 శాతం రిజర్వ్ అయ్యాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు స్థానిక సంస్థలకు ఎన్నికయ్యేందుకు ఇది దోహదం చేసింది.

దేవేగౌడ నుంచి మన్మోహన్ దాకా..

లోక్ సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తూ తొలిసారిగా 1996లో దేవేగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ సర్కారు పార్లమెంటులో 81వ రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. కానీ లోక్ సభా ఆమోదం పొందలేక అది కాలగర్భంలో కలిసిపోయింది. అనంతరం అటల్ బిహారీ వాజపేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 1998, 1999ల్లోనూ, ఆ తర్వాత 2002, 2003ల్లోనూ నాలుగుసార్లు బిల్లు పెట్టినా మోక్షానికి నోచుకోలేదు. 2004లో యూపీయే ఈ అంశాన్ని తమ కనీస ఉమ్మడి ప్రణాళికలో చేర్చింది. అధికారంలోకి వచ్చాక 2008లో మన్మోహన్ సింగ్ సర్కారు ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. అక్కడినుంచి స్టాండింగ్ కమిటీకి వెళ్లడం, దాని నివేదికను కేంద్రం ఆమోదించడం, చివరికి రాజ్యసభ మహిళా బిల్లును ఆమోదించడం జరిగిపోయాయి. అయితే అదంతా సులువుగా ఏమీ జరగలేదు. బిల్లును వ్యతిరేకించిన పలువురు ఎంపీలను మార్షల్స్ సాయంతో బయటికి పంపి మరీ ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఇంతా చేస్తే, ఆ బిల్లు దిగువ సభ అయిన లోక్ సభ ముందుకు రానే లేదు. చివరికి 2009లో 15వ లోక్ సభ రద్దుతో అలా పెండింగులోనే ఉండిపోయింది. కాకపోతే శాశ్వత సభ అయిన రాజ్యసభ ఆమోదం పొందింది గనక నేటికీ కాలదోషం పట్టకుండా అలాగే ఉంది.

ఏమిటీ మహిళా రిజర్వేషన్ల బిల్లు?

లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు మూడింట ఒక వంతు, అంటే 33 శాతం స్థానాలను కేటాయించడం దీని ముఖ్యోద్దేశం. ఈ మేరకు వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకోవడం, లోక్ సభలో మంగళవారం ఈ మేరకు ప్రవేశపెట్టడం తెలిసిందే.

ఆ మూడు అసెంబ్లీల్లో అత్యధికం...

అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఛత్తీస్గఢ్ దే! అయితే అక్కడ వారు ఎందరున్నారో తెలుసా? కేవలం 14.4 శాతం! 13.7 శాతంతో పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో, 12.35 శాతంతో జార్ఖండ్ మూడో స్థానంలో ఉన్నాయి.

15 అసెంబ్లీల్లో 10% కన్నా తక్కువ...

గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అసోం.

7 అసెంబ్లీల్లో 10–12% కన్నా తక్కువ...

బీహార్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ.

లోక్‌సభలో 15 శాతమైనా లేరు...

- లోక్ సభలో ప్రస్తుతం మహిళా ఎంపీల సంఖ్య 78. మొత్తం సంఖ్య 543లో ఇది 15 శాతం కూడా కాదు.
- రాజ్యసభలో కూడా మహిళా ఎంపీలు 14 శాతమే ఉన్నారు.

సాక్షి, నేషనల్ డెస్క్

ప్రజాస్వామ్యం బలోపేతం

- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న సంకల్పంతోనే బిల్లు
- బిల్లును పార్లమెంట్‌లో ఎంపీలంతా ఏకగ్రీవంగా ఆమోదించాలి
- లోక్‌సభలో ప్రధాని మోదీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలన్న సంకల్పంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు 'నారీశక్తి వందన్ అధినియమ్'ను తీసుకొచ్చినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పార్లమెంట్‌లో ఉద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పార్లమెంట్ నూతన భవనంలో లోక్‌సభలో మొదటి సెషన్‌లో తొలిసారిగా ప్రసంగించారు. సమాజం ప్రభావవంతంగా పరివర్తన చెందడం వెనుక రాజకీయాల పాత్రను వివరించారు. ఆధునిక యుగంలో మహిళలు ముందంజ వేస్తున్నారని ప్రశంసించారు. అంతరిక్షం నుంచి క్రీడల దాకా, స్టార్టప్ కంపెనీల నుంచి స్వయం సహాయ సంఘాల దాకా అన్ని రంగాల్లో వారు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే..

'మహిళల సారథ్యంలో అభివృద్ధి'

''నారీశక్తి వందన్ అభియాన్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిన సందర్భంగా మన తల్లులకు, సోదరీమణులకు, బిడ్డలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా చట్టంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని మహిళలకు హామీ ఇస్తున్నా. ఈ బిల్లుతో మన ప్రజాస్వామ్యం మరింత బలం పుంజుకుంటుంది. 'మహిళల సారథ్యంలో అభివృద్ధి' అనే విధానాన్ని మనం అనుసరిస్తున్నాం. జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ దేశాలు ఈ విధానాన్ని ప్రశంసించాయి. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం నానాటికీ ఇనుమడిస్తోంది. ప్రభుత్వ విధాన నిర్ణయాల రూపకల్పనలోనూ వారి భాగస్వామ్యం పెరగాలి. తద్వారా దేశ అభివృద్ధిలో వారి పాత్ర, సహకారం పెరుగుతుంది. ఈ చారిత్రక దినాన మహిళామణుల కోసం అవకాశాల ద్వారాలు తెరవాలని ఎంపీలను కోరుతున్నా.


కొత్త భవంతిలోని లోక్‌సభలో మాట్లాడుతున్న మోదీ

లక్ష్మణ రేఖ దాటొద్దు

పార్లమెంట్‌లో కొత్త భవనంలో కొలువుదీరాం. ఎంపీలందరూ పాత చేదు అనుభవాలను, జ్ఞాపకాలను మర్చిపోవాలి. నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. కొత్త భవనంలో ఎంపీలు చేసే ఏం చేసినా సరే అది దేశ పౌరులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. పార్లమెంట్ సమావేశాలను ప్రజలు ప్రత్యక్షంగా తిలకిస్తున్నారు. సభ్యులు అధికార పక్షంలో ఉంటారా? లేక ప్రతిపక్షంలో ఉంటారా? అనేది వారి ప్రవర్తనే నిర్దేశిస్తుంది. పార్లమెంట్ సంప్రదాయాలను సభ్యులంతా పాటించాలి. లక్ష్మణ రేఖ దాటకుండా జాగ్రత్తపడాలి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి. ఈ పార్లమెంట్ ఏర్పాటైంది కేవలం దేశ ప్రగతి కోసమే తప్ప ఏదో ఒక రాజకీయ పార్టీ ప్రయోజనం కోసం కాదు. దేశానికి సేవలందించే విషయంలో పార్లమెంట్ స్థానం అత్యున్నతం. పార్లమెంట్ కొత్త భవనం 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతిబింబం. ఇంజనీర్ల, శ్రామికుల శ్రమతోనే ఈ భవనం రూపుదిద్దుకుంది. 30 వేల మందికిపైగా కార్మికులు స్వేదం చిందించారు. వారి వివరాలతో డిజిటల్ బుక్ తీసుకొచ్చాం. పవిత్ర 'సెంగోల్'ను పార్లమెంట్ నూతన భవనంలో ప్రతిష్ఠించుకున్నాం. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ సెంగోల్‌ను స్వీకరించారు. ఎన్నో ఘట్టాలు సెంగోల్‌తో ముడిపడి ఉన్నాయి'' అని ప్రధానమంత్రి మోదీ వివరించారు.

చరిత్రలో నిలిచిపోతుంది

మహిళలకు హక్కులు కల్పించడం, వాటిని కాపాడడం, వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవడం వంటి గొప్ప పనుల కోసం భగవంతుడు నన్ను ఎన్నుకున్నాడేమో! అందుకే ఆ దిశగా మన ప్రభుత్వం అడుగు ముందుకేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మంత్రివర్గం నిన్న(సోమవారం) ఆమోదముద్ర వేసింది. ఈ రోజు(సెప్టెంబర్ 19) చరిత్రలో నిలిచిపోతుంది. ఏ దేశ అభివృద్ధి ప్రయాణంలోనైనా చరిత్రను సృష్టించే సమయం వస్తుంది. అలాంటి సమయం ఇప్పుడు భారత్‌కు వచ్చింది.

శుభప్రదమైన ప్రారంభానికి శ్రీకారం

మహిళల సారథ్యంలో ప్రగతి అనే తీర్మానాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్తున్నాం. ఇందులో భాగంగా రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్నాం. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృత పర్చడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. శుభప్రదమైన ప్రారంభానికి శ్రీకారం చుడుతున్నాం. మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని పార్లమెంట్ సభ్యులందరికీ నా విజ్ఞప్తి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చాలా ఏళ్లపాటు ఎన్నో చర్చలు, సంవాదాలు, సంప్రదింపులు జరిగాయి. బిల్లు చుట్టూ వివాదాలు ఏర్పడ్డాయి. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. మొట్టమొదటిసారిగా 1996లో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో పలు సందర్భాల్లో బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ అంకెలు సహకరించకపోవడంతో ఆమోదం పొందలేదు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే స్వప్నం నెరవేరలేదు.

గొప్ప ఆలోచనలతోనే 'బలమైన భారత్'

న్యూఢిల్లీ: బలమైన భారత్ నిర్మాణం కోసం వేదికను విస్తరింపజేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు, కొత్త చట్టాలు దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసమేనని స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంట్ పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో మోదీ మాట్లాడారు. చిన్నపాటి కాన్వాస్ వస్త్రంపై పెద్ద చిత్రం గీయలేమని అన్నారు. పార్లమెంట్ సభ్యులు పెద్ద ఆలోచనలు చేయకపోతే 'మహోన్నత్ భారత్' అనే ఆశయం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. మనకు గొప్ప సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం ఉన్నాయన్నారు. వీటికి మన కలలను, తీర్మానాలను జోడించాలని చెప్పారు. అప్పుడు పెద్ద కాన్వాస్‌పై భవ్య భారత్ చిత్రం సాకారం అవుతుందన్నారు.

ఎంపీలు పునరంకితం కావాలి

2047 నాటికి మన దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకోవాలని, అందుకోసం ఎంపీలంతా పునరంకితం కావాలని మోదీ సూచించారు. పార్లమెంట్ పాత భవన నుంచి కొత్త భవనంలోకి ప్రవేశించబోతున్నామని, ఇది నూతన భవిష్యత్తు దిశగా నూతన ప్రారంభంగా అభివర్ణించారు. కొత్త భవనంలో కొత్త భవిష్యత్తుకు శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. పాత పార్లమెంట్ భవనం విశిష్టతను ప్రధానమంత్రి వివరించారు. 1952 నుంచి ఇప్పటిదాకా ఈ భవనంలో 41 దేశాల అధినేతలు ప్రసంగించారని తెలిపారు. 4,000కు పైగా చట్టాలు ఈ భవనంలోనే రూపుదిద్దుకున్నాయని వివరించారు.

గడువులోగా లక్ష్యాలు సాధించాలి

దేశ నిర్మాణంలో నారీశక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడానికి మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఆయన మంగళవారం పార్లమెంట్ కొత్త భవనంలో రాజ్యసభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ఈ రోజు చరిత్రాత్మకం, చిరస్మరణీయమని అన్నారు. రాజ్యసభను ఎగువ సభగా పరిగణిస్తుంటారని, మేధావులు ఉండే ఈ సభలో దేశ ప్రగతికి ఉపయోగపడేలా అర్థవంతమైన చర్చలు జరగాలని రాజ్యాంగ రూపకర్తలు భావించారని చెప్పారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను సాధించాల్సి ఉందని, ఇంకా నిరీక్షించడానికి దేశం సిద్ధంగా లేదని వ్యాఖ్యానించారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నూతన ఆలోచనా ధోరణితో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు.

వికసిత్ భారత్ వేడుక

75వ స్వాతంత్ర్య దినోత్సవాలను పార్లమెంట్ పాత భవనంలో నిర్వహించుకున్నామని, 100వ స్వాతంత్ర్య వేడుకలను 2047లో కొత్త భవనంలో జరుపుకుంటామని ప్రధాని మోదీ చెప్పారు. అది వికసిత్ భారత్ వేడుక కాబోతోందని అన్నారు.


లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో మోదీ గ్రూప్ ఫొటో

పార్లమెంట్ నూతన భవనంలో...

- కార్యకలాపాలను ప్రారంభించిన స్పీకర్ బిర్లా
- పార్లమెంట్ పాత భవనం ఇక 'సంవిధాన్ సదన్' అంటూ నోటిఫికేషన్
- సభ్యులకు ప్రారంభోత్సవ కానుకలు..

న్యూఢిల్లీ: దేశ పార్లమెంటరీ చరిత్రలో నూతన అధ్యాయం మొదలయింది. మంగళవారం పార్లమెంట్ పాతభవనంలోని సెంట్రల్ హాల్‌లో ఉద్విగ్న భరితంగా ప్రసంగించిన పిమ్మట సభ్యులంతా పార్లమెంట్ నూతన భవనంలోకి పాదయాత్రగా తరలివెళ్లారు. పాత భవనం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు నడవగా, మంత్రివర్గ సహచరులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, ఎంపీలు భారత్ మాతాకీ జై, వందేమాతరం అని నినదిస్తూ ఆయన్ను అనుసరించారు. అలాగే, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఉండే భారత రాజ్యాంగ ప్రతిని నూతన భవనంలోకి తరలించారు. అదేవిధంగా, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధురి, రాహుల్ గాంధీ, పార్టీకి చెందిన ఎంపీలు, ప్రతిపక్ష నాయకులతో కలిసి పాత భవనం నుంచి కొత్త భవనంలోకి అడుగుపెట్టారు. అధిర్, రాహుల్‌లు భారత రాజ్యాంగ ప్రతిని చూపుతూ నడిచారు. సభ్యులంతా సభలోకి వెళ్లిన వెంటనే జాతీయ గీతాలాపన జరిగింది. ఆ తర్వాత సభ్యులు తమతమ సీట్లలో ఆశీనులు కావడంతో స్పీకర్ ఓం బిర్లా నూతన సభలో మొదటి రోజు కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రజల సమస్యలను చర్చకు తెచ్చి పార్లమెంట్‌లో నూతన ప్రమాణాలను నెలకొల్పాలని సభ్యులను ఆయన కోరారు. గణేశ్ చతుర్థి శుభాకాంక్షలు తెలుపుతూ పార్లమెంట్ నూతన భవనంలో సభను నిర్వహించుకోవడం ఒక చారిత్రక సందర్భమన్నారు. దేశాన్ని సాధించి, రాజ్యాంగానికి రూపకల్పన చేసిన మహామహులకు ఓం బిర్లా ఘన నివాళులర్పించారు.

ఆ చారిత్రక భవనం ఇక 'సంవిధాన్ సదన్'

పార్లమెంట్ పాత భవనాన్ని ఇకపై సంవిధాన్ సదన్‌గా పిలుచుకుందామని స్పీకర్ బిర్లా చెప్పారు. హౌస్, లాబీ, గ్యాలరీస్ వంటి పదాలు కొత్త భవనం పార్లమెంట్ హౌస్ ఆఫ్ ఇండియాలోని లోక్‌సభ కార్యకలాపాల విషయంలో ఇకపై వర్తిస్తాయన్నారు. సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంట్ పాత భవనానికి ఇచ్చే గౌరవాన్ని ఇకపైనా కొనసాగించాలని, సంవిధాన్ సదన్‌గా పిలుచుకుందామని సెంట్రల్ హాల్‌లో ప్రధాని మోదీ కూడా పేర్కొన్నారు.

పార్లమెంట్ నూతన భవనంలోకి ప్రవేశించిన ఎంపీలందరికీ ప్రత్యేక కానుకలు అందజేశారు. ఆయా సభ్యుల పేర్లతో ప్రత్యేకంగా ముద్రించిన జూట్ బ్యాగ్‌లో రాజ్యాంగ ప్రతి, ఒక స్టాంప్, స్మారక నాణెం ఉన్నాయి.

ఫొటో సెషన్‌కు తరలివచ్చిన ఎంపీలు

అంతకుముందు ఉదయం, పాత భవనంలో జరిగిన ఫొటో సెషన్‌కు ఉభయ సభల సభ్యులు రంగురంగుల్లో దుస్తులతో ముస్తాబై వచ్చారు. ఈ సెషన్‌లో ముందు వరసలో ప్రధాని మోదీ, ఆయనకు ఒకవైపు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ సభ్యుడు జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌స్పీకర్ ఓం బిర్లా, మరో వైపు రాజ్‌నాథ్ సింగ్ ఆశీనులయ్యారు. హోం మంత్రి అమిత్ షా, మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన లోక్‌సభ సీనియర్ సభ్యుడు షఫీక్ ఉర్ రెహమాన్(93), శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లా, జేపీ నడ్డా ముందు వరసలో కూర్చున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి వరసలో మనీష్ తివారీతో కలిసి కూర్చున్నారు. కొందరు సభ్యులు నేలపై కూర్చుని ఫొటోలు దిగారు. మహిళా సభ్యుల్లో ఎక్కువమంది రంగురంగుల చీరలు ధరించగా, పురుషుల్లో ఎక్కువ మంది తెల్లటి కుర్తా–పైజామా ఆకర్షణమైన జాకెట్ ధరించారు. ఫొటో సెషన్ సందర్భంగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు నరహరి అమీన్(68) స్పృహతప్పి పడిపోయారు. ఆయన కొంతసేపటి తర్వాత కోలుకుని, గ్రూప్ ఫొటో తీయించుకున్నారు. అనంతరం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు.



..బెదిరించి దారి దోపిడీ

డమ్మీ పిస్టల్‌తో మహిళలను బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన దుండగులను అరెస్ట్ చేసినట్లు చిలకలగూడ ఏసీపీ జయపాల్‌రెడ్డి, సీఐ మట్టం రాజు, డీఐ శ్రీశైలంనాయక్ తెలిపారు. -8లో



దారుణాల ముఠా గుట్టు రట్టు

బ్యాంకు అధికారులు, వాల్యుయేటర్లతో కుమ్మక్కై కొన్నేళ్లుగా లోన్ కన్సల్టెన్సీలు, ఏజెంట్లు వ్యవస్థీకృతంగా సాగిస్తున్న దందాకు సైబరాబాద్ పోలీసులు చెక్ పెట్టారు. -8లో

పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రీ పీహెచ్‌డీ (కోర్సు వర్క్) పరీక్షలను వాయిదా వేశారు. ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 7, 9 తేదీలలో నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తీరానికి పచ్చ తోరణం!



ఏరియల్ వ్యూలో లేక్ వ్యూ పార్కు





హుస్సేన్ సాగర్‌కు ఉద్యాన మణిహారం

- ఇప్పటికే ఎన్నో విశేషాల సమాహారం
- త్వరలో లేక్‌వ్యూ పార్కు ప్రారంభం
- దాదాపు రూ.26 కోట్లతో అభివృద్ధి
- నాలుగు ఎలివేటెడ్ ఎస్కలేటర్‌లతో లేక్ వ్యూ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలోనే ఒక అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన హుస్సేన్‌సాగర్ తీరంలో మరో అందమైన పార్కు రూపుదిద్దుకుంది. ఒకవైపు అమరుల స్మారకం, మరోవైపు శ్వేతసౌధాన్ని తలపించే సచివాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హుస్సేన్‌సాగర్ సుందరీకరణలో భాగంగా జలవిహార్ సమీపంలో 10 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.26.65 కోట్లతో హెచ్ఎండీఏ లేక్‌వ్యూ పార్కును అభివృద్ధి చేసింది. త్వరలోనే దీనిని ప్రారంభించనున్నట్లు మంత్రి కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్)లో వెల్లడించారు.

విశేషాలెన్నో..

- ఈ పార్కులో ఎలివేటెడ్ వాక్‌వేస్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాక్‌వేలపై నడుస్తుంటే హుస్సేన్‌సాగర్ జలాశయంలో నడుస్తున్న అనుభూతి కలుగుతుంది. ఒక్కొక్కటి 110 మీటర్ల చొప్పున 4 ఎలివేటెడ్ వాక్‌వేలు ఉన్నాయి. పార్కులో అన్ని వైపులా వెళ్లేలా వాక్‌వేలను ఏర్పాటు చేశారు.
- అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో అభివృద్ధి చేసిన ఈ పార్కులో పెవిలియన్స్, పంచతత్వ వాక్‌వే, సెంట్రల్ పాత్‌వే, అండర్ పాస్‌లు ఉన్నాయి. జలాశయంపై 15 మీటర్ల పొడవైన డెక్ ఉంటుంది. కాంటిలివర్, పర్గోలాస్, విద్యుత్ కాంతులతో అందంగా ఆకట్టుకొనే శిల్పాలు సందర్శకులకు వింత అనుభూతిని కలిగిస్తాయి. ఇల్యుమినేషన్ బొలార్డ్స్, ఎల్ఈడీ లైటింగ్, హైమాస్ట్ లైటింగ్, నియో ఫ్లెక్స్‌లైటింగ్ వంటి విద్యుత్ కాంతుల నడుమ బోర్డ్ వాక్ ఎంతో అద్భుతంగా ఉంటుంది.

అందమైన ల్యాండ్‌స్కేప్....

- లేక్‌వ్యూ పార్కును పచ్చదనం ఉట్టిపడేలా అందమైన ల్యాండ్‌స్కేప్‌తో అభివృద్ధి చేశారు. ఆర్కిటెక్ డిజైన్‌లలో సుమారు 4 లక్షల మొక్కలను నాటినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. 25 ఏళ్ల వయసున్న 22 చెట్లను ఈ పార్కులో విజయవంతంగా ట్రాన్స్‌లొకేట్ చేశారు. మరో 40 అరుదైన మొక్కలను నాటారు.
- పార్కు అభివృద్ధి కోసం రూ.22 కోట్లు ఖర్చు కాగా, ల్యాండ్‌స్కేప్, ఎలక్ట్రికల్ వర్క్స్ కోసం మరో రూ.4.65 కోట్లు వెచ్చించినట్లు అధికారులు తెలిపారు.

ఎంట్రీ టికెట్ ఇలా..

- లేక్‌వ్యూపార్కు ఉదయం 5.30 నుంచి రాత్రి 11.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.50 చొప్పున ప్రవేశ రుసుం. వాకర్స్ నెలకు రూ.100 చొప్పున చెల్లించాలి.



వాక్‌వే



పార్కులో ఆహ్లాదకర ప్రదేశం



ఎలివేటెడ్ వాక్‌వే

న్యూస్‌రీల్

ఢిల్లీ ఎయిమ్స్ స్థాయిలో ఎంఎన్‌జే సేవలు

- మంత్రి హరీశ్‌రావు



నాంపల్లి: ఎంఎన్‌జే ఆస్పత్రిలో అధునాతన రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌తో లాప్రోస్కోపిక్ ఎక్విప్‌మెంట్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్ రావు, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్, డీఎంఈ రమేష్ రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఎన్‌జే డైరెక్టర్ జయలతతో కలిసి పరికరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రూ.32 కోట్లతో అధునాతన రోబోటిక్ సర్జికల్ సిస్టమ్, రూ.50 లక్షలతో లాప్రోస్కోపిక్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంఎన్‌జే ఆస్పత్రి స్వరూపాన్నే మార్చేసినట్లు తెలిపారు. 750 పడకల ఆస్పత్రిగా దేశంలోనే అతి పెద్ద కేన్సర్ ఆస్పత్రిగా ఎంఎన్‌జే రికార్డు నెలకొల్పిందన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ సేవలతో సమాన స్థాయిలో నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే దేశంలోనే తొలిసారిగా ఎంఎన్‌జే ఆస్పత్రిలో అంకాలజీ స్పెషల్ నర్సింగ్ స్కూల్‌ను ప్రారంభిస్తామ ఆయన వెల్లడించారు.

నేటి నుంచి గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు



సాక్షి, సిటీ బ్యూరో: నగర వాసుల కోసం ఆర్టీసీ నూతనంగా 'గ్రీన్ మెట్రో లగ్జరీ' ఏసీ బస్సుల్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. బుధవారం నుంచి ఇవి పరుగులు తీయనున్నాయి. మొత్తం 50 గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ సర్వీసుల్లో మొదటి విడతగా 25 బస్సులు వస్తున్నాయి. ఈ బస్సుల్ని రవాణా శాఖ మంత్రి అజయ్ కుమార్ గచ్చిబౌలి స్టేడియం వద్ద ప్రారంభించనున్నారు. మిగతా 25 బస్సులు నవంబరు నాటికి అందుబాటులోకి రావచ్చని ఆర్టీసీ ప్రకటించింది.

అతివకు అందలం!

నగర మహిళా కార్పొరేటర్లలో జోష్

- పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు
- ఆమోదం పొందడం లాంఛనమేననే అభిప్రాయాలు
- 2028 ఎన్నికల నాటికి గ్రేటర్ పరిధిలో పెరగనున్న మహిళా ఎమ్మెల్యేలు



సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టడంతో ఆమోదం పొందడం లాంఛనమేనన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. దీంతో రాబోయే రోజుల్లో.. వీలైతే 2028 ఎన్నికలకు లేదా ఆ తర్వాత మాత్రమే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. అయినప్పటికీ.. వివిధ రంగాల్లోని మహిళలు.. ముఖ్యంగా ప్రస్తుతం జీహెచ్ఎంసీలో కార్పొరేటర్లుగా ఉన్న వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ ఎన్నికల్లో మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లుండగా, అంతకంటే ఎక్కువ సంఖ్యలో మహిళా కార్పొరేటర్లు ఉన్నారు. అయినప్పటికీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేటప్పటికి వారికి అవకాశాలు అందడం లేదు. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే తప్పనిసరిగా టికెట్లు ఇవ్వాలి కాబట్టి ఎక్కువమంది మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఒక్కరే..

గ్రేటర్ నగర పరిధిలో 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి తప్ప మరో మహిళా ఎమ్మెల్యే లేరు. రిజర్వేషన్లు అమల్లోకి వస్తే వీరి సంఖ్య పెరగనుంది. జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ ముగిశాకే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలనే పరిగణనలోకి తీసుకున్నా 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే 39 టికెట్లు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. జనగణన అనంతరం డీలిమిటేషన్‌తో అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి. ఆమేరకు ఎక్కువమంది మహిళలకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం లభించనుంది. అందులోనూ గ్రేటర్ పరిసరాల్లోని వారికి మిగతా వారికంటే ఎక్కువ అవకాశాలు లభించే వీలుంది. ఈ నేపథ్యంలో నగరంలోని మహిళా కార్పొరేటర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెట్టెక్కనున్న కార్పొరేటర్లు

ప్రస్తుతం సిట్టింగ్ కార్పొరేటర్లుగా 75 మందికి పైగా మహిళలున్నప్పటికీ, ఎమ్మెల్యేలుగా అవకాశాలు లభిస్తున్న వారంటూ లేరు. త్వరలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ నుంచి మాజీ కార్పొరేటర్ లాస్య నందితకు టికెట్ లభించింది సాయన్న ఖాతాకిందనే కావడం తెలిసిందే. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాక ఎక్కువమంది మహిళా కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలు అయ్యే అవకాశం లభించనుంది.

చరిత్రాత్మకం

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రధాని నరేంద్ర మోదీ చొరవతోనే సాకారం కానుంది. నారీ శక్తి.. దేశ్‌కీ శక్తి అనే నినాదంతో మహిళా సాధికారత కోసం ఇప్పటికే మహిళలకు ముద్ర రుణాలు, తదితర ఎన్నో కార్యక్రమాలు అమల్లోకి తెచ్చారు. పార్లమెంటు కొత్త భవనంలో, దేశానికి స్వాతంత్య్రం లభించిన 75 ఏళ్ల అమృత్‌కాలంలో లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం కానుంది. అన్నిపార్టీలూ మద్దతునిచ్చి బిల్లుకు ఆమోదం తెలుపుతాయనే నమ్మకం ఉంది.

– బండ కార్తీక రెడ్డి, బీజేపీ నేత, నగర మాజీ మేయర్

దీటుగా పనిచేస్తారు

పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలకు రిజర్వేషన్ల వల్ల చట్టసభల్లో అవకాశాలు పెరుగుతాయి. తద్వారా మరింత దీటుగా పని చేస్తారు. కొత్త పార్లమెంట్ భవనంలో మొదటి బిల్లుగా ప్రవేశపెట్టడం హర్షణీయం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. మహిళా రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ ఎంతో కాలంగా కృషి చేస్తోంది. 2014లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించడం, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడం తెలిసిందే.

– మోతె శ్రీలత, డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్

ఇంటింటికీ ఆరు.. కాంగ్రెస్ జోరు!

ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం

- నియోజకవర్గాల్లో నేతల పర్యటనలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటికీ ప్రచారం చేస్తోంది. సోమవారం సీడబ్ల్యూసీ నేతలు తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పక్కాగా ఆరు పథకాలను అమలు చేయనున్నామని చెప్పారు. ఏకంగా పథకాల కార్డులు అందజేసి రసీదులను సైతం తీసుకున్నారు. డివిజన్లవారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి ఆరు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అగ్రనేతలు పిలుపునిచ్చారు. ఎన్నికల గడువుకు మిగిలిన వంద రోజులను సద్వినియోగం చేసుకుంటే అధికారం తమదేనన్న భరోసా కల్పించారు.

నేతల ప్రచారం ఇలా..

ప్రచారంలో భాగంగా రాజస్తాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ నాంపల్లిలోని యూసుఫియన్ దర్గాలో ప్రార్థనలు, దేవీభాగ్‌లోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఆరు పథకాలపై అవగాహన కల్పించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ మంత్రి తారీఖ్ అన్వర్ అంబర్‌పేటలోని గోల్నాక డివిజన్ నెహ్రూ నగర్, సుందర్‌నగర్, కృష్ణానగర్‌లలో పర్యటించారు. ముషీరాబాద్‌లో మహారాష్ట్ర పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే ప్రణీతి షిండే చిరు వ్యాపారులను కలిసి ఆరు పథకాలపై అవగాహన కల్పించారు. ఆమె వెంట టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌లు ఉన్నారు. యాకుత్‌పురాలో నాగాలాండ్ పీసీసీ అధ్యక్షుడు ఎస్ఎస్ జమీర్, ఖైరతాబాద్‌లో మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్‌రెడ్డితో కలిసి ప్రజలకు ఆరు పథకాలపై అవగాహన కల్పించారు. కూకట్‌పల్లిలో రాజ్యసభ మాజీ సభ్యుడు పీఎల్ పూనియా, మలక్‌పేటలో కేంద్ర మాజీ మంత్రి అజయ్ మాకెన్‌లు పర్యటించి ఆరు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు.



ముషీరాబాద్‌లో మహారాష్ట్ర పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీతి షిండే ప్రచారం, చిత్రంలో అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

నలుదిక్కుల నుంచి





మొదటిరోజు మహాగణపతిని దర్శించుకున్న భక్తులు

- తొలిపూజ చేసిన గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

ఖైరతాబాద్: శ్రీ దశమహా విద్యాగణపతిగా ఖైరతాబాద్‌లో కొలువుదీరిన మహాగణపతికి సోమవారం ఉదయం 11.15 గంటలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తొలిపూజ చేశారు. వినాయక చవితి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు ప్రాణప్రతిష్ఠ (కలశపూజ) నిర్వహించిన అనంతరం తమిళిసైతో పాటు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతికుమారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేశామని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని, నిమజ్జనం వరకు ఇదే తరహాలో ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్, ఉత్సవ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, లక్ష్మణ్‌యాదవ్, వీణామాధురి తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఖైరతాబాద్ మహాగణపతిని సోమవారం తొలిరోజు ఏకంగా 4 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.



మహాగణపతి తొలి పూజలో గవర్నర్ తమిళిసై, మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం తదితరులు

75 అడుగుల భారీ కండువా, జంధ్యం

ఖైరతాబాద్: వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భారీ కండువా, జంధ్యం, గరిక మాలతో పాటు దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి 75 అడుగుల జంధ్యాన్ని, 75 అడుగుల కండువాను హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, గరికమాలను ఐఏఎస్ అధికారి వెంకటేశ్, లడ్డూ, కరెన్సీ మాలను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ శివానంద ప్రసాద్ సమర్పించారు. సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి ముత్యాలాభిషేకం చేయించారు. హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ పట్టు వస్త్రాలను, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ వీసీ నీరజ ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కడారి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య పాల్గొన్నారు.

నిమజ్జానికి అన్ని ఏర్పాట్లు: మంత్రి తలసాని

ఖైరతాబాద్: అన్ని పండుగలకు ఏర్పాట్లు చేస్తూ అన్ని వర్గాల ప్రజల ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌లతో కలిసి సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి జీహెచ్ఎంసీ పరిధిలో గతంలో కంటే 25 శాతం ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించడంతో అందుకు తగినవిధంగా నిమజ్జన ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాటు జరగకుండా విజయవంతం చేయాలన్నారు. నిమజ్జనం కోసం ఎన్ని క్రేన్లు కావాలన్నా ఏర్పాటు చేస్తామన్నారు. మంటప నిర్వాహకులకు ఏ ప్రాంతంలో నిమజ్జనం చేయాలో సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బారికేడింగ్, లైటింగ్, జనరేటర్లు అన్నింటిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈసారి నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ మీద 90 వేల విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామన్నారు.



తప్పుల సవరణతోనే స్పష్టమైన ఓటరు జాబితా

సాక్షి, సిటీబ్యూరో: బూత్ స్థాయిలో తప్పుల సవరణ సరిగా జరిగినప్పుడే స్పష్టమైన ఓటరు జాబితాను తయారు చేసుకునే వెసులుబాటు ఉంటుందని ఓటరు జాబితా పరిశీలకులు డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో జ్యోతి బుద్ధ ప్రకాష్, జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ మాట్లాడారు. ఓటరు జాబితాపై ఫిర్యాదులు వచ్చినప్పుడు ఇంటింటికీ తిరిగి పరిశీలన చేసి నివేదిక ఇస్తున్నామన్నారు. బీఎల్‌ఓలు మరోసారి ఓటరు జాబితాలో తప్పుల సవరణ చేస్తున్నారని చెప్పారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చిన్న భవనాల్లో నాలుగు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎపిక్ కార్డు ఉన్నా ఓటరు జాబితాలో పేరు లేకపోవడం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. మలక్‌పేట ఎమ్మెల్యే బలాలా మాట్లాడుతూ... పోలింగ్ స్టేషన్‌లో హౌస్ నంబర్లను ముందుగానే తెలపాలన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటర్లు నమోదవుతున్నారని ఆరోపించారు.

దా'రుణాల' ముఠా గుట్టురట్టు

- నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల తయారీ
- ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ
- ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రూ.కోట్లలో రుణాలు
- రెండు వేర్వేరు కేసుల్లో 18 మంది అరెస్టు
- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి

తక్షణమే వ్యక్తిగత, వ్యాపార, హోమ్ లోన్‌లు





సాక్షి, సిటీబ్యూరో: పర్సనల్, బిజినెస్, హోమ్ ఏ తరహా రుణం అయినా సరే చిటికెలో ఇప్పించేస్తారు. నకిలీ సర్టిఫికెట్లు, స్టాంపులు, అధికారుల సంతకాలు అన్నీ నకిలీవే. బ్యాంకు అధికారులు, అడ్వకేట్లు, వాల్యుయేటర్లతో కుమ్మక్కై కొన్నేళ్లుగా లోన్ కన్సల్టెన్సీలు, ఏజెంట్లు వ్యవస్థీకృతంగా సాగిస్తున్న దందాకు సైబరాబాద్ పోలీసులు చెక్ పెట్టారు. నకిలీ పత్రాలతో ఈ కేటుగాళ్లు ఇప్పటివరకు సుమారు 1,200 మందికి ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రూ.6–7 కోట్ల వరకు రుణాలను ఇప్పించారు. రెండు వేర్వేరు కేసుల్లో 18 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.10 కోట్ల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీపీ స్టీఫెన్ రవీంద్ర వివరాలు వెల్లడించారు.

- మేడ్చల్ జిల్లా సూరారం గ్రామానికి చెందిన ఘంటా రంగారావు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమంగా డబ్బు సంపాదించేవాడు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు చార్జీ వసూలు చేస్తుంటాడు. ఇతనిపై గతంలో మీర్‌పేట, జీడిమెట్ల ఠాణాలలోనూ కేసులున్నాయి.
- కేపీహెచ్‌బీ కాలనీకి మాణిక్ ప్రభు, సూరారంకు చెందిన సీతారామరాజు, జీడిమెట్లకు చెందిన చంద్రశేఖర్ రావు, అల్విన్‌కాలనీకి చెందిన సుధాకర్ రావు, ప్రశాంత్‌నగర్‌కు చెందిన నాగ మల్లేశ్వరరావులతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా గృహ రుణాల కోసం హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలకు చెందిన నకిలీ డాక్యుమెంట్లు, టాంపరింగ్ లే-అవుట్లు, ఆయా విభాగాల రబ్బరు స్టాంపులతో పాటు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రుణాలు ఇప్పించేవారు.
- ఈ క్రమంలో కూకట్‌పల్లికి చెందిన వ్యక్తి హోమ్ లోన్ కోసం నాగ మల్లేశ్వరరావు, సుధాకర్ రావులను సంప్రదించడంతో వారు రంగారావును ఆశ్రయించారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు మాణిక్ ప్రభు నకిలీ రబ్బరు స్టాంపులు, నకిలీ డాక్యుమెంట్లు, టాంపరింగ్ లే-అవుట్ల కోసం సీతారామరాజు, చంద్రశేఖర్‌ను సంప్రదించారు. వీరు ఇందుకోసం ఒక్కో స్టాంప్‌కు రూ.1,000, లే-అవుట్‌కు రూ.2 వేలు చార్జీ వసూలు చేశారు. రుణాన్ని బట్టి 3–4 శాతం కమీషన్ ఉంటుంది. ఈ కేసులో రూ.10 లక్షల కంటే ఎక్కువ రుణాన్ని పొందినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది.
- వీరి వ్యవహారంపై సమాచారం అందుకున్న బాలానగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), కేపీహెచ్‌బీ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ విభాగాలకు చెందిన నకిలీ రబ్బరు స్టాంపులు, డాక్యుమెంట్లు, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిగత, వ్యాపార రుణాలు ఇప్పిస్తున్న మరో ముఠా అరెస్ట్

- కార్మిక శాఖకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి, వాటిపై అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి వీటిని బ్యాంకులకు సమర్పించి వ్యక్తిగత, వ్యాపార రుణాలను ఇప్పిస్తున్న మరొక ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏబీఎల్ లోన్స్ యజమాని వాక నాగిరెడ్డి, డీఎంకే అసోసియేట్స్ యజమాని దొంతుల మణికంఠ, నిధి అసోసియేట్స్ యజమాని కరిమి షణ్ముఖ రావు, ఆర్ఆర్ అసోసియేట్స్ డైరెక్టర్ కొల్లి రామరాజు, ఆయా సంస్థల ఉద్యోగులు మెట్నాల చంటి, పూరిమెట్ల నవీన్ కుమార్, దాస్పల్లి వీరబాబు, గొల్లమూడి రామ్ తివారీ, కొల్లి శంకర్ రావు, ఏజెంట్లు రావూరి దొరబాబు, బొత్స మహేష్, లక్ష్మణ్ రాకేష్ కుమార్ ముఠాగా ఏర్పడ్డారు.
- లైసెన్స్ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని వీరు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించేవారు. ప్రాసెసింగ్ ఫీజు కింద ఒక్కో కస్టమర్ నుంచి రూ10 వేలు చార్జీతో పాటు రుణం మంజూరయ్యాక 2 నుంచి 3 శాతం కమీషన్ తీసుకునేవారు. దీనిపై సమాచారం అందడంతో బాలానగర్ ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు 12 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి కార్మిక శాఖకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు, రబ్బరు స్టాంపులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

కేన్సర్ వచ్చిందేమోనని..

భయంతో యువకుడి ఆత్మహత్య



జీడిమెట్ల: తనకు కేన్సర్ వచ్చిందేమోననే భయంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌కు చెందిన సత్యనారాయణ కుమారుడు శరత్(19) స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం అతడికి రక్తంతో కూడిన వాంతి అయ్యింది. దీంతో తనకు కేన్సర్ సోకిందేమోనని శరత్ ఆందోళనకు గురైన శరత్ ఈ విషయాన్ని తల్లి లక్ష్మీబాయికి చెప్పగా, తెలపగా వినాయక చవితి మరుసటి రోజు మంచి అస్పత్రిలో పరీక్షలు చేయిస్తానని చెప్పింది. అయినా శరత్ తనలో తాను మదన పడేవాడు. సోమవారం లక్ష్మీబాయి వినాయకుడి పూజ నిమిత్తం మండపం వద్దకు వెళ్లింది. రాత్రి 7 గంటలకు ఆమెకు ఫోన్ చేసిన శరత్ త్వరగా ఇంటికి రావాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. లక్ష్మి ఇంటికి చేరుకోగానే తలుపులు మూసి ఉన్నాయి. తలుపులు తెరచి లోపలికి వెళ్లి చూడగా శరత్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఒకటే..మూడు నంబర్లు



ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన లారీ

చాదర్‌ఘాట్: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రిజిస్ట్రేషన్ నంబర్లతో తిరుగుతున్న లారీని మంగళవారం ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ దేవాలయం వద్ద రోడ్డుపై వెళుతున్న ఇటుక లారీకి మూడు వైపుల వివిధ రిజిస్ట్రేషన్ నెంబర్లు ఉండటాన్ని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు లారీని సీజ్ చేసారు. లారీ వివరాలు ఆర్‌టీఏ అధికారులకు పంపించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. లారీ ముందు భాగంలో ఏపీ03యూ8183, వెనుక ఏపీ28యూ3618, పక్కన ఏపీ03కే8183 నంబర్లు ఉండటం గమనార్హం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరించి దారి దోపిడీ

నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న డమ్మీ పిస్టల్



నిందితులు సోహైల్, సాజద్

చిలకలగూడ : డమ్మీ పిస్టల్‌తోపాటు చాకులతో మహిళలను బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన వ్యక్తులను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. చిలకలగూడ ఏసీపీ జయపాల్‌రెడ్డి, సీఐ మట్టంరాజు, డీఐ శ్రీశైలంనాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంజిల్లా, తిరువూరుకు చెందిన వెంకటేశ్వరరావు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భార్య సుజాత, సోదరుడు మహేష్, అతని భార్య శ్రీభాలు రోగికి సహాయం చేసేందుకు వచ్చారు. ఈనెల 17న రాత్రి తన సొంత ఆటోలో మహేష్, శ్రీభా, సుజాతలతో కలిసి సికింద్రాబాద్ నుంచి గాంధీ ఆస్పత్రికి బయలుదేరాడు. పిల్లర్ నంబర్ 1015 వద్ద ఆటోను రోడ్డు పక్కన ఆపి మహేష్ మూత్ర విసర్జనకు వెళ్లాడు. అదే సమయంలో కొందరు యువకులు ఆటోను చుట్టుముట్టి పిస్టల్, చాకులతో శ్రీభా, సుజాతలను బెదిరించారు. వారివద్ద ఉన్న రూ. 2 వేల నగదు లాక్కున్నారు. వారి మెడలోని గొలుసులు తెంపేందుకు యత్నించగా, బాధితులు గట్టిగా కేకలు వేయడంతో ఆటో వద్దకు చేరుకున్న మహేష్‌ను పక్కకు నెట్టివేసి బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. మంగళవారం ఉదయం నామాలగుండు చౌరస్తావద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై అటుగా వచ్చిన నిందితులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.

ఆటోడ్రైవర్లుగా పని చేస్తూనే..

ముషీరాబాద్, వారాసిగూడ, బండ్లగూడలకు చెందిన సోహైల్, అఫ్రోజ్, సాజద్ ఆటోడ్రైవర్లుగా పని చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు మరికొందరితో కలిసి దారిదోపిడీలకు పాల్పడేందుకు డమ్మీ పిస్టల్, చాకులను సమకూర్చుకుని గాంధీఆస్పత్రి ఎదుట మెట్రో స్టేషన్ సమీపంలో మాటువేశారు. రోడ్డు పక్కన నిలిచి ఉన్న ఆటోలో ఉన్న మహిళలను గమనించి బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. నిందితులు సోహైల్, సాజద్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి డమ్మీ పిస్టల్, చాకులు, నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలోఉన్న అఫ్రోజ్‌తో పాటు మరికొందరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. రౌడీషీటరైన ప్రధాన నిందితుడు సోహైల్‌పై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దారి దోపిడీ కేసును చాకచక్యంగా చేధించిన చిలకలగూడ ఎస్‌ఐ మట్టంరాజు, డీఐ శ్రీశైలం నాయక్, క్రైం సిబ్బందిని నార్త్‌జోన్ డీసీపీ సునీల్ దత్, ఏసీపీ జయపాల్‌రెడ్డి అభినందించారు.

గాంధీ సెక్యూరిటీ సిబ్బంది ఔదార్యం...

దారిదోపిడీకి గురైన బాధితులకు గాంధీ జీడీఎక్స్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ నేతృత్వంలో అన్నం పెట్టి, వసతి కల్పించారు. ఖమ్మం వెళ్లేందుకు అవసరమైన బస్సు చార్జీలను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు.

నాగార్జున సోదరి నాగసుశీలపై కేసు నమోదు

భూ తగాదా నేపథ్యంలో మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ తెలుగు సినిమా హీరో అక్కినేని నాగార్జున సోదరి అక్కినేని నాగసుశీలపై మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భూ తగాదా నేపథ్యంలో సుశీలతో పాటు మరో 12 మంది తన ఇంటిపై, తనపై దాడి చేశారని చింతలపూడి శ్రీనివాస్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు నాగసుశీలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే తన అనుమతి లేకుండా శ్రీనివాస్ భూమి విక్రయించాడని నాగ సుశీల ఆరోపించడంతో అతడిపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నాగ సుశీల, శ్రీనివాస్ గతంలో వ్యాపార భాగస్వాములుగా ఉండేవారు. శ్రీ నాగ్ ప్రొడక్షన్ పేరుతో నాగ సుశీల కుమారుడు అక్కినేని సుశాంత్ హీరోగా అతను కరెంట్, అడ్డా, కాళిదాసు, ఆటాడుకుందాం రా తదితర చిత్రాలను నిర్మించారు. ఇదిలా ఉండగా.. శ్రీనివాస్ ఓ ట్రస్ట్‌కు భూమిని విరాళంగా ఇచ్చినట్లు తెలిసింది. ఈ భూ వ్యవహారంలో శ్రీనివాస్, నాగ సుశీలకు మధ్య చాలా కాలంగా తగాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

అండర్-17 రన్నరప్ ప్రణవ్‌రామ్

జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



సాక్షి, హైదరాబాద్: యోనెక్స్–సన్‌రైజ్ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్–17 బాలుర విభాగంలో మిజోరంకు చెందిన లల్‌తజువల విజేతగా నిలిచాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో లల్‌తజువల 21–11, 21–15 స్కోరుతో తెలంగాణకు చెందిన ఎస్.ప్రణవ్‌రామ్‌పై విజయం సాధించాడు. అండర్–17 బాలికల విభాగంలో హరియాణాకు చెందిన అన్‌మోల్ ఖర్బ్ టైటిల్ గెలుచుకుంది. ఫైనల్లో అన్‌మోల్ 21–14, 21–19తో పంజాబ్‌కు చెందిన తాన్వి శర్మను ఓడించింది. మొయినాబాద్‌లోని గుత్తా జ్వాల బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా ఈ టోర్నీ జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇతర విజేతలు: (అండర్–15 విభాగం) సింగిల్స్– బాలురు: నిశ్చల్‌చంద్ (ఉత్తరాఖండ్), బాలికలు: ఆదర్శినిశ్రీ (తమిళనాడు); డబుల్స్– బాలురు: హార్దిక్ దివ్యాంశ్–అమిత్‌రాజ్ (కర్నాటక), బాలికలు: అదితి దీపక్‌రాజ్–బి.పొన్నమ్మ (కర్నాటక); మిక్స్‌డ్ డబుల్స్: ఆకాశ్ చంగ్‌మై–శాంతిప్రియ (అసోం); (అండర్–17 విభాగం) డబుల్స్– బాలురు: భార్గవ్‌రామ్–విశ్వతేజ్ (ఆంధ్రప్రదేశ్), బాలికలు: తాన్వి రెడ్డి (తెలంగాణ)–రేషిక (తమిళనాడు); మిక్స్‌డ్ డబుల్స్: భార్గవ్‌రామ్ (ఏపీ)–ప్రగతి పరీదా (ఒడిషా).

రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల రిమాండ్

- మూడు కత్తులు, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం.
- పాత కక్షల నేపథ్యంలో రౌడీషీటర్ హత్య
- పరారీలో మరో నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేశ్ తదితరులు

సంతోష్‌నగర్: రౌడీషీటర్ హత్య కేసులో ఆరుగురు నిందితులను కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్.రూపేశ్ చాంద్రాయణగుట్ట డీసీపీ మనోజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చిట్టీ బుర్రలతో కలిసి వివరాలను వెల్లడించారు. కంచన్‌బాగ్ పీఎస్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ సి–బ్లాక్ ప్రాంతానికి చెందిన సయ్యద్ నసీర్ (22) ఏసీ మెకానిక్‌గా పని చేసేవాడు. అతను 2020 సెప్టెంబర్‌లో ఇలియాస్, ఆరాఫత్‌తో కలిసి చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన బాబా షిండే కుమారుడు విశాల్ షిండేను హత్య చేశాడు. ఛత్రినాక పోలీసులు అప్పట్లో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి బయటికి వచ్చిన అనంతరం సయ్యద్ నసీర్‌తో పాటు అతని స్నేహితులు బాబా షిండే మరో కుమారుడు ఆకాశ్ షిండేను చంపుతామని గత రెండు నెలలుగా బెదిరిస్తున్నారు. దీంతో సయ్యద్ నసీర్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న బాబాషిండే ఈ నెల 13న తెల్లవారుజామున తన కుమారుడు ఆకాశ్ షిండే, హషామాబాద్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షా అబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్, హఫీజ్ బాబానగర్‌కు చెందిన ప్రేమ్ మానే, కైఫ్ మోహీనుద్దీన్, అత్తార్, షేక్ హషమ్ అలీతో కలిసి హఫీజ్‌బాబానగర్‌కు వెళ్లాడు. ఇంటి ముందు ఆటోలో కూర్చున్న సయ్యద్ నసీర్‌పై బాబా షిండే, ఆకాశ్ షిండే, సయ్యద్ షా అబ్దుల్ జబ్బార్ కత్తులతో దాడి చేస్తుండగా మిగతా వారు ఎవరూ రాకుండా కాపలా కాశారు. సయ్యద్ నసీర్ కేకలు విని ఇంట్లో నుంచి బయటికి వచ్చిన అతడి తల్లి సయీదా బేగం చిన్న కుమారుడితో కలిసి వారిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో వారిని కూడా చంపుతామని బెదిరించి అక్కడినుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన నసీర్‌ను చికిత్స నిమిత్తం ఓవైసీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి సయీదా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కంచన్‌బాగ్ పోలీసులు సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి మూడు కత్తులు, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అత్తర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడు షాబాద్

అమీర్‌పేట: ఈఎస్ఐసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగి సహాయకురాలిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బీహెచ్ఈఎల్ ఆర్‌సీ పురానికి చెందిన యువకుడు అనారోగ్యంతో సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బోధన ఆసుపత్రిలో చేరాడు. అతడికి సహాయంగా అతడి సోదరి(19) అక్కడే ఉంటూ సేవలు అందిస్తోంది. ఈ నెల 16న రాత్రి భోజనం చేసేందుకు క్యాంటీన్‌కు వచ్చి తిరిగి వార్డుకు వెళుతుండగా క్యాంటీన్‌లో పని చేసే షాబాద్ (33) అనే వ్యక్తి ఆమెను వెంబడించి ల్యాబ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడు షాబాద్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్ట్



నిందితుడు ప్రశాంత్

ఘట్‌కేసర్: పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పుకుంటూ అమాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి ఘట్‌కేసర్ మండలం, చౌదరిగూడకు చెందిన కుసుమ ప్రశాంత్ రిజర్వ్‌డ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న యువకులు, అతడి స్నేహితులకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి భారీ మొత్తంలో వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం అతడిని యంనంపేట్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి పోలీస్ యూనిఫాం తదితరాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వాహనం టైరు మారుస్తుండగా..

– కారు ఢీకొని వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : వాహనం టైరు మారుస్తుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌కు చెందిన అశ్వినికుమార్ పాండే(30) సోమవారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో అల్లం, వెల్లుల్లి బస్తాలు లోడ్ చేసుకుని వరంగల్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక వాహనం ఆలేరు శివారులోని బహదూర్‌పేట హైవే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి టైరు మరుస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అశ్వినికుమార్‌ను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సంతోష్ పాడే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా కొణతాల ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ట్రస్మా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ పర్యవేక్షణలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా షేక్ సయీద్ అహ్మద్, కోశాధికారిగా మంచాల రఘు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు, కార్యవర్గ సభ్యుల సహకారంతో హైదరాబాద్ జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

వండర్ కిడ్..

- 4 వరల్డ్ రికార్డులు సాధించిన 14 ఏళ్ల నగర బాలుడు..
- కాంగ్ యాట్సే–1 పర్వతాన్ని అధిరోహించిన పిన్న వయస్కుడిగా రికార్డ్



సాక్షి, సిటీబ్యూరో: అతి ఎత్తైన పర్వాతాలను అధిరోహిస్తూ ఇప్పటికే 3 వరల్డ్ రికార్డులు సొంతం చేసుకున్న నగరానికి చెందిన 14 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ మరో వరల్డ్ రికార్డును సాధించాడు. ఈ నెల 17న లద్దాక్ సమీపంలో హిమాలయాల్లోని 6,400 మీటర్ల ఎత్తైన కాంగ్ యాట్సే–1 పర్వతాన్ని అధిరోహించి నాల్గో వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విశ్వనాథ్ కార్తికేయ గతంలోనే 6.270 మీటర్ల ఎత్తున్న కాంగ్ యాట్సే పర్వతాన్ని, 6,240 మీటర్ల ఎత్తైన ద్జోజాంగో పర్వాతాన్ని అధిరోహించి ఈ పర్వతాల శిఖరాగ్రాలను చేరుకున్న అతిపిన్న వయస్కునిగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నాడు. అంతేకాకుండా ఐరోపాలోనే అత్యంత ఎత్తైన ఎల్‌బ్రస్ పర్వత తూర్పు(5,621మీ), పడమర(5,642మీ) శిఖరాలను 24 గంటల వ్యవధిలో అధిరోహించి చరిత్ర సృష్టించాడు. ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన ఈ పర్వత శిఖరాలను అధిరోహించిన అతి చిన్న వయస్కుడిగా వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు.

ప్రయాణం సాగిందిలా...,

తన నాల్గో వరల్డ్ రికార్డ్ ×కాంగ్ యాట్సే–1×ను పూర్తి చేయడంలో భాగంగా ఈ నెల 7న 3 వేల మీటర్ల ఎత్తులోని ×లేహ్×కు చేరుకున్నాడు. అనంతరం 5,100 మీటర్ల ఎత్తులోని బేస్ క్యాంపును 13వ తేదీన చేరుకున్నాడు. అక్కడి నుంచి మరో రెండు రోజుల ట్రెక్కింగ్ తరువాత 5,700 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్–1ను, 16న 5,900 మీటర్ల బేస్ క్యాంప్–2ను చేరుకున్నాడు. చివరగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ ఈ నెల 17న 6,400 మీటర్ల ఎత్తైన శిఖరాగ్రాన్ని చేరుకుని రికార్డు సృష్టించాడు. ట్రెక్కింగ్‌పైన ఆసక్తిని క్రమక్రమంగా పెంచుకుంటూ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అతడి తల్లి లక్ష్మీ తెలిపింది. ప్రపంచంలోని అతి ఎత్తైన పర్వతాలన్నింటినీ అధిరోహించడమే లక్ష్యంగా తన కుమారుడి ప్రయాణం ముందుకు సాగుతుందన్నారు. ట్రెక్కింగ్‌తో పాటు చదువులను సైతం అదే క్రమంలో కొనసాగిస్తున్నాడన్నారు. 4వ వరల్డ్ రికార్డు సాధించిన విశ్వనాథ్ కార్తికేయ ఈ రోజు నగరానికి చేరుకోనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

లబ్ధిదారుల్లో డబుల్ ఆనందం

- విడతల వారీగా ఇళ్ల కేటాయింపు
- నియోజక వర్గానికి ఆరు వేలు మంజూరు
- ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుంది అంటున్న అధికారులు



బంజారాహిల్స్: విడతల వారీగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ కేటాయింపు జరుగుతుండటంతో మహిళల్లో ఆనందం వెల్లువెత్తుతున్నది. రెండు వారాల క్రితం 500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు రాగా తాజాగా రెండు రోజుల క్రితం మరో 500 మంది డబుల్ బెడ్‌రూమ్‌లకు అర్హులయ్యారు. వీరందరికి అధికారుల నుంచి ఫోన్లు రాగా సంతోషంతో ఎగిరి గంతేశారు. ఎన్నో ఏళ్ళుగా అద్దె ఇళ్ళల్లో అవస్థలు పడుతున్న వీరంతా సొంతింటి కల నెరవేరుతున్న వేళ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 6 వేల మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాబోతుండగా రెండు విడతల్లో ఇప్పటికే వెయ్యి కేటాయించారు. రాబోయే రోజుల్లో మిగతా వారందరికీ దశల వారీగా ఇళ్ళ కేటాయింపు జరగనుండటంతో అర్హులైన వారిలో ఆశలు మొలకెత్తుతున్నాయి. ఏ క్షణంలోనైనా అధికారుల నుంచి ఫోన్ కాల్ రావొచ్చనే ఆశతో ఎదురు చూస్తున్నారు దరఖాస్తుదారుల్లో దాదాపు ఇళ్ళు లేని వారందరికీ ఈ సారి ఇళ్ళ కేటాయింపు జరిగింది. పారదర్శకంగా సర్వే పూర్తి కావడంతో ఇళ్లు వచ్చిన వారంతా పక్కాగా ఈ లబ్ధి పొందేందుకు అర్హత సాధించిన వారయ్యారు. మహిళలు తమకు ఇళ్ళు కేటాయించడం పట్ల ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదేళ్ళ క్రితం దరఖాస్తు చేసుకొని ఇళ్ళ మీద ఆశలు వదులుకున్న వారందరికీ ఇప్పుడిప్పుడే డబుల్ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రతి ఒక్కరికి ఇల్లు కేటాయించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే దానం నాగేందర్ భరోసానిస్తుండటంతో నియోజక వర్గ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సీఎం కేసీఆర్ సైతం ఖైరతాబాద్ నియోజక వర్గంలో అర్హులైన మహిళలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు మంజూరు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ కావడంతో కోటాకుమించి ఇళ్ళు మంజూరయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పాతికేళ్ళుగా అద్దె ఇంట్లోనే



నేను కూరగాయల వ్యాపారం చేస్తుంటాను. గత 25 సంవత్సరాలుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. అయిదేళ్ళ క్రితం డబుల్‌బెడ్‌రూమ్ ఇంటి కోసం దరఖాస్తులు ఆహ్వానించడంతో నేను కూడా దరఖాస్తు ఇచ్చాను. అయితే ఈ విషయాన్ని ఎప్పుడో మర్చిపోయాను. ఇక రాదేమో అనుకున్నాను. తీరా చూస్తే పండుగ రోజు మంగళవారం సాయంత్రం అధికారుల నుంచి ఇల్లు కేటాయించినట్లుగా ఫోన్ వచ్చింది. కేసీఆర్ దేవుడి రూపంలో నాలాంటి వాళ్లకు ఇళ్ళను కేటాయించారు.

– జి. విజయ, జాగిర్‌బాద బస్తీ

అద్దె ఇంట్లోనే ఉంటున్నాను



ఎన్నో ఏళ్ళుగా అద్దె ఇంట్లో ఉంటూ సొంతింటి కలలు కంటున్నాను. నా భర్త చనిపోయిన తర్వాత కుటుంబం ఆగమైంది. వ్యాపారం చేసుకుంటూ పిల్లల్ని పోషిస్తున్న తాను ఇల్లు కొనడం అనేది కలగానే ఉండేది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దేవుడిలా నాకు ఇల్లు కేటాయించాడు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు రుణపడి ఉంటాం. నా సొంతింటి కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది.

– హెచ్.రజిని, ఫిలింనగర్, వినాయకనగర్

ఫోన్ రాగానే ఆనందం పట్టలేకపోయాను



నా భర్త అశోక్ ఆటో డ్రైవర్ కాగా నేను ఇళ్ళల్లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. అద్దె ఇంట్లోనే కొన్నేళ్ళుగా ఉంటున్నాం. ఇటీవలనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయిస్తుండటంతో నాకు కూడా ఆశ పెరిగింది. కొంత మందికి ఇల్లు రాగానే నాకు వస్తుందో రాదో అని అనుమానం కలిగింది. అయితే మంగళవారం సాయంత్రం ఇల్లు కేటాయించినట్లుగా ఫోన్ రావడంతో మా కుటుంబం అంతా ఆనందించాం. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు జన్మ, జన్మనా మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– డి. అనిత, జ్ఞానిజైల్‌సింగ్ నగర్

క్లుప్తంగా...

అక్టోబర్ 1న సంగీత విభావరి



ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: వచ్చే నెల 1వ తేదీన తారామతి బారాదరిలో జైన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ చారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాక్‌స్టార్ పేరుతో ఇండియన్ ఐడల్ గాయకులతో లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ కుమార్ డి వోరా వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ ఐడల్ విన్నర్ రిషీ సింగ్, దేబోష్మితారాయ్, షణ్ముఖ ప్రియ తదితరులు తమ స్వరాలతో అలరించబోతున్నారని అన్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి కార్యక్రమం ఇదే మొదటిసారి అని అన్నారు. అక్టోబర్ 1న సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. నగర శివార్లలో డయాలసిస్ సెంటర్ నిర్వహణతో పాటు ఒక పాఠశాలను దత్తత తీసుకోవడానికి నిధుల సేకరణ కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని జగన్నాథ టెంపుల్‌లో కళింగ కల్చరల్ ట్రస్ట్ నాట్యమండపంలో నాట్యమయూర విద్యార్థులు గణేష్ చతుర్థి వేడుకల సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను, భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. హబ్సిగూడకు చెందిన నాట్యమయూర సంగీత అకాడమీకి చెందిన 16 మంది విద్యార్థులు ఈ ప్రదర్శన నిర్వహించారు.

బాలికలకు సాధికారతే లక్ష్యం

బంజారాహిల్స్: తెలుగు రాష్ట్రాల్లో 2040 నాటికి రెండు మిలియన్ల మంది బాలికలకు సాధికారత కల్పించడమే బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ లక్ష్యమని చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బంగారు తల్లి కార్యక్రమం ద్వారా లక్షన్నర మంది బాలికల జీవితాలను మార్చడంలో తన వంతు సహకారం అందించినందుకు గర్వంగా ఉందన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు లక్ష మంది వినియోగదారులు ఉన్నారని వెల్లడించారు. సమాజానికి సేవచేయడం, ఆరోగ్యవంతమైన సంఘంలో భాగంగా ఉండాలని విశ్వసిస్తున్నామని అన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బంజారాహిల్స్: గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఈ రెండు వేడుకలు జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలకు మేమున్నామనే భరోసాను కల్పిస్తూ జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పి. రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వివిధ గణేష్ మండపాలను, బస్తీలను చుడుతూ ఈ మార్చ్‌ఫాస్ట్ జరిగింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు బలగాలకు మండపాల పరిధితో పాటు పోలీస్ స్టేషన్ల పరిధి తెలిసే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా పోలీసులు ఉన్నారనే భరోసాను కల్పిస్తూ భద్రతను మరింత పెంచుతున్నామని తెలిపేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు రవీంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రతిరోజూ వివిధ ప్రాంతాల్లో పోలీసు బలగాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తాయని తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



పూజల్లో పాల్గొన్న విశ్వకర్మలు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో కొలువుదీరిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామివారికి అభిషేకం, పూజ అనంతరం అన్నదాన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు ఆవంచ దేవేంద్రచారి, వీరేష్, మహేశ్వరం లింగాచారి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 31, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 22, చామగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పండగల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ జోయల్ డేవిస్

ఫిలింనగర్: గణేష్ నవరాత్రులు, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ర్యాలీల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పలు ప్రాంతాల నుంచి అదనపు బలగాలను కూడా మోహరిస్తున్నామని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు బలగాలనుద్దేశించి ఆయన జూబ్లీహిల్స్ ఏసీపీ హరి ప్రసాద్, సీఐ రామకృష్ణతో కలిసి మాట్లాడుతూ ఈ తొమ్మిది రోజుల పాటు పోలీసులంతా అవిశ్రాంతంగా పనిచేయాలని ప్రశాంత వాతావరణంలో ఈ రెండు పండుగలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు.

జూదరుల అరెస్ట్.. నిందితుల్లో కానిస్టేబుల్



బంజారాహిల్స్: తాను కానిస్టేబుల్‌గా పని చేస్తున్నప్పుడు ఎన్నో జూద గృహాలపై, వ్యభిచారగృహాలపై స్పాలపై దాడులు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసిన ఓ కానిస్టేబుల్ అదే పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాడుతూ పట్టుబడ్డాడు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని అరోరా కాలనీలో ఉన్న హోటల్ హిల్ స్ట్రీట్‌లో కొంత కాలంగా పోలీసుల కళ్లుగప్పి పేకాడుతున్న గదిపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మంది పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. గతంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ప్రస్తుతం బోరబండ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న రమేష్ అనే కానిస్టేబుల్ ఈ దాడుల్లో పట్టుబడ్డాడు. హోటల్ హిల్‌స్ట్రీట్ యజమాని మహ్మద్ అజారుద్దీన్‌తో పాటు మేనేజర్ ఎస్.రాజు, వ్యాపారవేత్త సందీప్, అమర్‌నాథ్‌రెడ్డి, జి.శివనర్సింహ రాజు, జి. శ్రీకాంత్‌రెడ్డి, ఎస్. దయాకర్, కానిస్టేబుల్ రమేష్ పట్టుబడ్డ వారిలో ఉన్నారు. వీరి నుంచి రూ. 1,58,580 మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె. వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే'

పంజగుట్ట: గత శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తర్వాత రాష్ట్రంలో ఎక్కువ శాతం ఓట్లు సాధించిన నాలుగవ పార్టీగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నిలిచిందని, ఈ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తమ పార్టీనే ఉండబోతుందని పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయమ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. బిజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. లిక్కర్ స్కాంలో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా లాంటి ప్రముఖులనే అరెస్టు చేసి కవితను అరెస్టు చెయ్యకపోవడంతోనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని అర్థమయ్యిందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వీ.ప్రసాద్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాములు యాదవ్, సీనియర్ నాయకులు మురళీధర్ దేశ్ పాండే పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

పంజగుట్ట: వినాయక మండపం ఏర్పాటులో అపశ్రుతి నెలకొంది. పంజగుట్ట పోలీసులు తెలిపిన మేరకు.. బీఎస్ మక్తాకు చెందిన వి.హనుమ (26) ప్రైవేట్ ఉద్యోగి. బిఎస్ మక్తా శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్‌లో కీలక సభ్యుడు. ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి సమయంలో అదే ప్రాంతానికి చెందిన దాసరి తేజ అనే యువకునితో కలిసి రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద వినాయక మండపానికి షెడ్ ఏర్పాటు చేస్తున్నారు. షెడ్ పైన ఇనుప రేకులు అమర్చే క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫారానికి రేకు తాకింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరూ కిందపడిపోయారు. స్థానికులు అక్కడకు చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే హనుమ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ నేతలను నిలదీయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: ఓట్ల కోసం వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నేతలను మాకు మీరేం చేశారని నిలదీసి తరిమికొట్టాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రజలకు సూచించారు. మంగళవారం బంజారాభవన్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. గృహలక్ష్మి పథకం కింద నియోజక వర్గంలో ఆరు వేల మందికి లబ్ధి చేకూరబోతుందన్నారు.

కారు బ్యాటరీ మాయం

శ్రీనగర్‌కాలనీ: వాహనాల్లోని బ్యాటరీలను దొంగతనం చేసే ముఠాను మధురానగర్ పోలీసులు అరెస్టుచేశారు. గత కొద్ది రోజులుగా ఎల్లారెడ్డిగూడతో పాటు స్థానికంగా పలు కాలనీల్లో వాహనాల్లోని బ్యాటరీలు, ఇంటి వద్ద పాలప్యాకెట్లను దొంగతనం అవడంతో పలు పిర్యాదులు కాలనీల్లో అధికమయ్యాయి. ఎల్లారెడ్డిగూడ తవక్కల్‌నగర్‌కు చెందిన మహ్మద్‌అజామ్ తన కారును వేయాలనుకొని తీసిపెట్టుకున్న కార్‌బ్యాటరీ మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు పిర్యాదు చేశారు. సీసీ కెమెరాల సహాయంతో దొంగతనాలు చేసే వారిని స్థానికులు పట్టుకొని మంగళవారం పోలీసులకు అప్పగించారు. వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్ హ్యాండ్సమ్ పోటీలకు నగర యువకులు



గెలుపొందిన ట్రోఫీలతో యువకులు

వెంకటేశ్వరకాలనీ: త్వరలో జరగనున్న హ్యాండ్సమ్ పోటీలకు నగరానికి చెందిన ముగ్గురు యువకులు ఎంపికయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని కమలాపురి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ హ్యాండమ్ ట్రెజర్ ర్యాంప్ వాక్‌లో విజేతలుగా నిలిచి ఆ సందర్భంగా అందుకున్న ట్రోఫీలను ప్రదర్శించారు. టీమ్ విభాగంలో పి. జయంత్‌రెడ్డి, అడల్ట్ విభాగంలో షారంగ్ పాత్రో, క్లాసిక్ విభాగంలో శ్రీనివాస్‌గౌడ్ గెలుపొందినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లోబల్ హాండ్సమ్ ట్రెజర్ ఈవెంట్‌లో అవకాశం కల్పించిన సుహాసిని పాండ్యంకు వారు కతజ్ఞతలు తెలిపారు. ఆ ప్రదర్శనలో గెలుపొందిన తర్వాత తమకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయని త్వరలో దుబాయ్ వేదికగా జరగబోయే ఇంటర్నేషనల్ గ్లోబల్ హ్యాండ్సమ్ ట్రెజర్ పోటీలకు తాము ఎంపికయ్యామని అక్కడ కూడా విజయం సాధించి తీరుతామని వారు తెలిపారు.

మహాగణపతికి లడ్డూ నైవేద్యం



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నైవేద్యంగా 25కిలోల లడ్డూను సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో మహాగణపతి ఉత్సవాల ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌ల నేతృత్వంలో మహాగణపతికి సమర్పించారు. కార్యక్రమంలో సాయి సుప్రీత్ సభ్యులు పాల్గొన్నారు.

మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు

శ్రీనగర్‌కాలనీ: మైనర్‌బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్ళిన వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి ఫోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఈనెల 17న మహిళా కానిస్టేబుల్ కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు పిర్యాదుచేసింది. ఇంటిసమీపంలో ఉండే ఆంజనేయులు అనే యువకుడిపై అనుమానం ఉందని వ్యక్తం చేసింది. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా దర్యాప్తుచేసి బాలిక కొండాపూర్‌లో ఉందని సమాచారం అందుకొని వ్యక్తిని అరెస్ట్ చేసి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను తీసుకెళ్ళిన ఆంజనేయులుపై సోమవారం ఫోక్సో కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



అమీర్‌పేట సితార హోటల్‌లో పూజలు



వెంగళరావునగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

గణనాథుడికి ఘనంగా పూజలు


ఖైరతాబాద్,జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీలు,బస్తీల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రాయల్ ఎన్‌ఫీల్డ్ సర్వీస్‌సెంటర్‌లో గణనాథుని పూజలు



వెంకటగిరి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గణనాథునికి పూజలు



రహమత్‌నగర్‌లోని గణేష్ మండపం



బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో రజత కవచాలతో దర్శనమిస్తున్న శ్రీ విజయగణపతి స్వామి

తొమ్మిది రకాలతో గణనాథుడు



బంజారాహిల్స్: తొమ్మిది రకాల వస్తువులతో గణనాథుడిని తయారు చేశాడు ఓ కళాకారుడు.. రుద్రాక్షలు, వక్కలు, మొక్కజొన్న పొత్తులు, గంటలు, గరిక, కర్జూర, పసుపు కొమ్ములు, పూసలు, పూలతో తయారుచేసిన గణనాథుడిని సోమాజిగూడ బస్తీలో ఏర్పాటు చేశారు. 40 రోజుల పాటు బళ్లారికి చెందిన శ్రీను అనే కళాకారుడు ఇక్కడే ఉండి ఈ ప్రతిమను తయారు చేసినట్లు రామాంజనేయ భజన మండలి శ్రీ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు.



ప్రెస్‌క్లబ్‌లో పూజలు చేస్తున్న దేవులపల్లి అమర్, సీనియర్ పాత్రికేయులు



నిమ్స్ మిలీనియం బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ లబ్ధిదారుల ఆత్మీయ సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదలపై ఒక్క పైసా కూడా భారం లేకుండా వారి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో మంగళవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఇప్పటివరకు పేదలుక అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం అన్నారు. పార్టీలకతీతంగా ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

గణేష్ ఆలయంలో మంత్రి పూజలు..

గణేష్ నవరాత్రుల సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులోని గణేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఈఓ వినోద్, కమిటీ సభ్యులు హన్మంతరావు, వజీర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల పట్టు, కాటన్ వస్త్రాలతో పాటు డిజైనరీ వస్త్రాలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2023 పేరిట ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనలోని చీరలు మగువల మనసు దోచుకుంటున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన మహిళలను విశేషంగా ఆకట్టుకుంటుంది. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటుచేశామని, ఈనెల 21 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

ముగిసిన వారం రోజుల ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో చోటుచేసుకున్న భీకర ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా కమాండ్ ఉజయిర్ ఖాన్ సహా ఇద్దరు హతమయ్యారు. వీరిద్దరి మృతితో భద్రతాబలగాలతో వారం రోజులుగా ఈ ప్రాంతంలో కొనసాగుతున్న ఎదురుకాల్పులు ముగిసినట్లయిందని కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని గడోల్ అటవీ ప్రాంతంలో గత బుధవారం మొదలైన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ అధికారులు, ఒక పోలీసు అధికారి సహా నలుగురు భద్రతా సిబ్బంది వీరమరణం పొందిన విషయం తెలిసిందే.

ఆదిత్య ప్రస్థానంలో కీలక దశ షురూ

బెంగళూరు: సూర్యుని గుట్టు విప్పేందుకు ఇస్రో ప్రయోగించిన తొలి మిషన్ ఆదిత్య -ఎల్1 ప్రస్థానంలో కీలక దశ మొదలైంది. దాని కక్ష్యను పెంచి సూర్యుని కేసి ట్రాన్స్ లగ్రాంజియన్ పాయింట్ దిశలో విజయవంతంగా ప్రవేశపెట్టడంలో సైంటిస్టులు మంగళవారం విజయం సాధించారు. ఇప్పుడది లగ్రాంజ్ 1 పాయింట్ దిశగా వెళ్తోంది. మరో 110 రోజుల తర్వాత ఆదిత్య ఎల్1ను భూమి నుంచి దాదాపు 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లగ్రాంజ్ 1 పాయింట్ కక్ష్యలో ప్రవేశపెడతారు. అప్పటి నుంచి అది సౌర శోధనకు దిగుతుంది. ఈ మేరకు ఇస్రో ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సూర్యునిపై పరిశోధనల కోసం సెప్టెంబర్ 2న ఆదిత్య -ఎల్1 ప్రయోగం చేపట్టడం తెలిసిందే.

బెంగళూరు బయోలాజికల్ పార్కులో 7 చిరుత కూనలు మృత్యువాత

బెంగళూరు: బెంగళూరులోని బన్నెర్‌ఘట్ట బయోలాజికల్ పార్కులో ఏడు చిరుత కూనలు అత్యంత తీవ్రమైన వైరస్ సోకి మృత్యువాతపడ్డాయని మంగళవారం అధికారులు తెలిపారు. ఫెలైన్ పెర్వోవైరస్‌తో వచ్చే ఫెలైన్ పాన్‌లుకోపీనియా(ఎఫ్‌పీ) అనే వ్యాధితో ఇవి మరణించాయి. మూడు నుంచి ఎనిమిది నెలల వయస్సున్న ఈ కూనలకు మొదటగా ఆగస్టు 22న వైరస్ సోకింది. మొత్తం 9 కూనలుండగా 15 రోజుల వ్యవధిలోనే ఏడు కూనలు ప్రాణం విడిచాయి. ముందుగా టీకా వేయించినప్పటికీ అవి వైరస్ బారినపడ్డాయని, చికిత్స కొనసాగుతుండగానే మరణించాయన్నారు. వైరస్ వ్యాప్తిని విజయవంతంగా అడ్డుకోవడంతో గత 15 రోజులుగా పార్క్‌లో ఎలాంటి కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ ప్రాంతం మొత్తాన్ని శానిటైజ్ చేసి పరిశుభ్రతను పూర్తి స్థాయిలో పాటిస్తున్నామని చెప్పారు.

ఓటు బ్యాంకు రాజకీయం!



ఖలిస్తాన్ వేర్పాటు వాదులపై కెనడా ఉదాసీన వైఖరి

40 ఏళ్లుగా కెనడాలో చాప కింద నీరులా ఉగ్రవాదం

- ట్రూడోకు ఖలిస్తాన్ అనుకూల న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు
- దీంతో రెఫరండం, ర్యాలీలతో రెచ్చిపోతున్న వేర్పాటువాదులు

కెనడాలో ఖలిస్తాన్ వేర్పాటువాద ఉగ్రవాదానికి 40 ఏళ్ల చరిత్ర ఉంది. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా, హత్యలు, వ్యవస్థీకృత నేరాలు వంటివి ఖలిస్తాన్ వేర్పాటు వాదులకు గత నాలుగు దశాబ్దాలుగా నిత్యకృత్యంగా మారాయి. అయినా అక్కడ ప్రభుత్వాలు ఖలిస్తాన్ వేర్పాటు వాదుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి దీనికి ఓటు బ్యాంకు రాజకీయాలే ప్రధాన కారణం. భారత్ తర్వాత ప్రపంచంలో కెనడాలో సిక్కు జనాభా అధికంగా ఉంది. 2021 కెనడా జనాభా లెక్కల ప్రకారం దాదాపుగా 8 లక్షల మంది సిక్కులు (మొత్తం జనాభాలో 2%పైగా) ఉన్నారు. వీరి జనాభా శరవేగంతో పెరుగుతూ వస్తోంది. కెనడాలో న్యూ డెమోక్రాటిక్ పార్టీ (ఎన్‌డీపీ) పగ్గాలను సిక్కు నాయకుడైన జగ్మీత్ సింగ్ ధాలివాల్ 2017 సంవత్సరంలో చేపట్టిన తర్వాత ఖలిస్తాన్ వేర్పాటు వాదుల ఎజెండాకు మద్దతు పలికారు. 2021లో ప్రధానమంత్రి జస్టిస్ ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలవలేకపోవడంతో ఎన్‌డీపీ మద్దతు తీసుకోవాల్సి వచ్చింది.దీంతో ఖలిస్తాన్ వేర్పాటువాదులు మరింత చెలరేగిపోతున్నా ప్రధాని ట్రూడో ఏమీ చేయలేకపోతున్నారు. ఇక ప్రస్తుతం కెనడా పార్లమెంటులో 18 మంది సిక్కు ఎంపీలు ఉన్నారు. సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) అనే సంస్థ ప్రత్యేక ఖలీస్తాన్‌పై రెఫరెండం చేపట్టి తమకు లక్ష మందికిపైగా మద్దతు పలుకుతున్నట్టుగా ప్రకటించింది.

2019 నుంచి పెరిగిన దాడులు

- జగ్మీత్ సింగ్ బృందం ఖలిస్తాన్ విషయంలో మరింత చురుగ్గా ఉంటూ దాడులకు ప్రోత్సహిస్తోంది. కెనడాతో పాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియాలో ఇటీవల కాలంలో వీరి దాడులు పెరిగిపోతున్నాయి.
- భారత కార్యాలయాలు, హిందూ ఆలయాలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. మార్చిలో లండన్‌లో భారత హైకమిషనర్ కార్యాలయంపై దాడి జరిగింది.
- 2022 మేలో మొహాలిలో పంజాబ్ ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై గ్రెనేడ్ దాడి వెనుక (ఎస్ఎఫ్‌జే) హస్తం ఉంది.
- దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యను కీర్తిస్తూ జూన్ 4న ఖలీస్తాన్ ఉద్యమకారులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.రక్తపు మడుగులో పడి ఉన్న ఇందిర, ఒక సిక్కు చేతిలో తుపాకీ ఉన్న చిత్రాలకి సంబంధించిన కటౌట్లు టొరాంటో వీధుల్లో వెలిశాయి. దర్బార్ సాహిబ్‌పై దాడులకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగిందంటూ దానిపై రాశారు. ఒంటారియాలో భారీ ర్యాలీతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సంబరాల్ని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా ఖండించారు. కెనడా ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వేర్పాటువాదుల ఆగడాలను చూసీచూడనట్టు వదిలేస్తోందని ఆయన దుయ్యబట్టారు.
- జులైలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో భారతీ విద్యార్థులపై ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఇనుపరాడ్లతో దాడి చేశారు.

ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తండ్రి పియరే ట్రూడో 1980లో కెనడా ప్రధానిగా ఉన్నారు. అప్పట్లోనే ఖలిస్తాన్ కార్యకలాపాలపై భారత ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఆయనకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆ నాటి ప్రభుత్వం కూడా ఉదాసీనంగానే వ్యవహరించిందని బ్లడ్ ఫర్ బ్లడ్ అనే పుస్తకంలో రచయిత టెర్రీ మిల్‌వెస్కీ పేర్కొన్నారు. అప్పట్లో ఖలిస్తాన్ ఉద్యమం కెనడాలో కూడా ఉవ్వెత్తున లేచింది. ఇందిరాగాంధీ హత్య తర్వాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో మళ్లీ వేర్పాటువాదులు చెలరేగిపోతున్నారు. వాస్తవానికి

అప్పట్లో ట్రూడో తండ్రి

ఖలిస్తాన్ ఉద్యమం ప్రజా మద్దతు ఉన్నది కాదన్న అభిప్రాయాలు ఉన్నాయి. '''ఖలిస్తాన్ ఉద్యమం భౌగోళిక రాజకీయాలకు సంబంధించినది. చైనా, పాకిస్తాన్ వంటి దేశాలు తమ శత్రుదేశమైన భారత్‌కు ఇబ్బంది కలుగుతుందని ఖలిస్తాన్ వేర్పాటు వాదులకి సాయపడుతున్నాయి''అని రచయిత టెర్రీ పేర్కొన్నారు. ఇందిర హత్యని ఒక సంబరంగా పేర్కొంటూ 2002లో టొరాంటో ప్రధాన కేంద్రంగా ప్రచురితమయ్యే సంజా సవేరా మ్యాగజైన్ కథనాలు వండి వార్చింది. అలాంటి పత్రికకు ప్రభుత్వం అత్యధికంగా వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ద్వారా తన వైఖరి ఏంటో చెప్పకనే చెప్పింది.

నిజ్జర్ హత్యతో రాజుకున్న చిచ్చు



గత ఏడాది జూన్ 18న కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలో నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను సర్రేలోని గురుద్వారాలో కాల్చి చంపడంతో భారత, కెనడాల మధ్య చిచ్చు రేగింది. ఈ హత్యలో భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా చేసిన ఆరోపణలతో ఇరు దేశాలు తమ రాయబారుల్ని వెనక్కి పిలిపించేదాకా వెళ్లాయి. పంజాబ్‌లో జలంధర్‌కు చెందిన నిజ్జర్ 1997లో కెనడాకు వలస వెళ్లాడు. ప్లంబర్‌గా పని చేస్తూనే ఖలిస్తాన్ వేర్పాటు వాదులతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. సిక్స్ ఫర్ జస్టిస్‌లో కూడా సభ్యుడిగా ఉన్నాడు. 2020లో భారత్ నిజ్జర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది. 2007లో పంజాబ్‌లోని లూధియానాలో పేలుళ్లు, 2009లో పటియాలాలో రాష్ట్రీయ సిక్ సంగత్ అధ్యక్షుడు రూల్దా సింగ్ హత్యలో నిజ్జర్ ప్రమేయమున్నట్టు అనుమానాలున్నాయి. కెనడా, యూకే, అమెరికాలో భారత రాయబార కార్యాలయాల దాడుల వెనుక నిజ్జర్ హస్తం ఉన్నట్టుగా భారత్ విచారణలో తేలింది.

సాక్షి, నేషనల్ డెస్క్

భారత్, కెనడా మధ్య ఖలిస్తాన్ చిచ్చు

- ఖలీస్తానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యతో ముదిరిన వివాదం
- భారత దౌత్యవేత్తను బహిష్కరించిన కెనడా
- ప్రతిగా కెనడా దౌత్యవేత్తను బహిష్కరించిన భారత్
- భారత్‌తో ఉద్రిక్తతల్ని కోరుకోవడం లేదన్న కెనడా ప్రధాని ట్రూడో

టొరాంటో/న్యూఢిల్లీ: భారత్, కెనడాల మధ్య ఖలిస్తాన్ వేర్పాటువాద అంశం అగ్గి రాజేసింది. ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు హర్‌దీప్ సింగర్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో పార్లమెంటు వేదికగా చేసిన ఆరోపణలు ఇరు దేశాల మధ్య విభేదాల్ని మరింత రాజేశాయి. ఇరుదేశాలు పరస్పరం తమ తమ దౌత్యవేత్తల్ని వెనక్కి పిలిపించడానికి దారి తీశాయి. గత జూన్‌లో నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్, భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిని బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలో గురుద్వారాలో కాల్చి చంపడం వెనుక వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణల్ని భారత్ గట్టిగా తిప్పి కొట్టింది. ట్రూడో ఆరోపణలు అర్థంలేనివని, ప్రేరేపితమైనవని దుయ్యబట్టింది. 45 ఏళ్ల వయసున్న నిజ్జర్‌ను జూన్ 18న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అతని తలపై భారత ప్రభుత్వం రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. ట్రూడో సోమవారం కెనడా పార్లమెంటులో మాట్లాడుతూ నిజ్జర్ వెనుక భారత్ ప్రమేయం ఉందని, కెనడా భద్రతా ఏజెన్సీ దర్యాప్తులో కూడా దీనికి సంబంధించిన అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ట్రూడో ఆరోపణల తర్వాత కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలనీ జోలీ ఒక భారత్ దౌత్యవేత్తని దేశం నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ధ్రువీకరించారు. కెనడాలో భారత ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్ పవన్ కుమార్ రాయ్‌ను దేశం వీడి వెళ్లాల్సిందిగా ఆదేశించినట్టు కెనడా విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో భారత్ కూడా గట్టిగా ఎదురు తిరిగింది. దెబ్బకి దెబ్బ అన్నట్టుగా భారత్‌లో కెనడా రాయబారిని అయిదు రోజుల్లో దేశం వీడి వెళ్లాలంటూ ఆదేశించినట్టుగా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ''ఇలాంటి ఆరోపణల వల్ల కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్తాన్ ఉగ్రవాదులు , భారత సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతని హెచ్చరిస్తూనే ఉంటాయి''అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఖలిస్తాన్ వేర్పాటువాదుల పట్ల కెనడా ప్రభుత్వ ఉదాసీన వైఖరితో దశాబ్దాలుగా కొనసాగుతూ ఉండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. కెనడా గడ్డ మీద నుంచి జరిగే భారత వ్యతిరేక కార్యకలాపాలకు ట్రూడో ప్రభుత్వం ఇకనైనా ముగింపు పలకాలని పేర్కొంది. భారత్ లో కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్ ఒలివర్ సిల్వెస్టర్‌ను దేశం వీడి వెళ్లాలంటూ భారత్ ఆదేశాలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే కెనడా ప్రధాని ట్రూడో విలేకరులతో మాట్లాడుతూ భారత్‌తో ఉద్రిక్తతల్ని తాము కోరుకోవడం లేదని అన్నారు. అయితే సిక్కు నాయకుడు నిజ్జర్ హత్యని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అన్నారు. భారత ప్రభుత్వంతో ఉన్న విభేదాలు తొలగిపోవడానికి చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.



కెనడా ప్రధాని ట్రూడో

భారత్‌కు ప్రయాణాలు మానుకోండి: కెనడా

భారత్‌లో పర్యటించాలనుకునే తమ పౌరులకు కెనడా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. తాజాగా ట్రావెల్ అడ్వైజరీ విడుదల చేసింది. 'దేశమంతటా ఉగ్రవాద దాడుల ప్రమాదం పొంచి ఉంది. దాంతోపాటు చొరబాటుదారుల ముప్పు కూడా ఉన్నందున ఈశాన్య భారతానికి అనవసర ప్రయాణాలు మానుకుంటే మేలు. అలాగే జమ్మూ కశ్మీర్‌కు ప్రయాణం అస్సలు చేయకుంటే మంచిది' అని సూచించింది!

బైడెన్, సునాక్‌లతో ట్రూడో మంతనాలు

నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందన్న ఆరోపణల్ని వివిధ దేశాల అధినేతలతోనూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పంచుకున్నారు. తమ మిత్ర దేశాలైన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మార్కస్‌లతో నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని చెప్పినట్టుగా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ట్రూడో చేసిన ఆరోపణలపై అమెరికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ హత్య కేసులో కుట్రదారులకు శిక్ష పడడం, కెనడా తన దర్యాప్తుని ముందుకు తీసుకువెళ్లడం అత్యంత కష్టమని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికారి ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ వ్యవహారం భారత్, బ్రిటన్ దేశాల సంబంధాలపై ప్రభావం చూపిస్తుందని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఆందోళన వ్యక్తం చేశారు. కెనడా అధికారులు దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలో తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ప్రధాని కార్యాలయం అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ ట్రూడో చేసిన ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని, ఈ విషయాన్ని భారత్‌కు తెలియజేస్తామని చెప్పారు.

ముస్లిం ధోబీలకూ ఉచిత విద్యుత్

ఎంపీ అసదుద్దీన్ విజ్ఞప్తిపై సీఎం నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రజకులు నిర్వహించే ధోబీఘాట్లు, లాండ్రీషాపులకు ప్రతి నెలా 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు అమలు చేస్తున్న పథకాన్ని ముస్లిం ధోబీలకు సైతం రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేసింది. ముస్లింలలో సామాజికంగా వెనకబడిన వర్గాల్లో ఒకరైన ధోబీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దశాబ్దాలుగా ధోబీ వృత్తిని కుటుంబ వృత్తిగా నిర్వహిస్తున్నారు. వీరికి సైతం రజకుల తరహాలో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన విజ్ఞప్తికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. సీఎం ఆదేశాలతో ముస్లిం ధోబీల ధోబీఘాట్లు, లాండ్రీషాపులకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఈ నెల 16న ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్, బీసీ వెల్ఫేర్, మైనారిటీస్ వెల్ఫేర్ కమిషనరేట్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి

మహాసభలో మంత్రులు దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన బేడ బుడగ జంగాల చైతన్యవేదిక రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడారు. బేడ బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జంగాల జనాభా దామాషా ప్రకారం వారికి చట్టసభల్లో అవకాశం కల్పించాలనే డిమాండ్‌ను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలలో బుడగ జంగాలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనకబడి ఉన్నారని, ఐకమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలని అన్నారు.

రాష్ట్రీయం

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులే

సర్కారులో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ

అపాయింటెడ్ డే పేర్కొంటూ ఉత్తర్వు జారీ అయితేనే ఖజానా నుంచి జీతాల విడుదల



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల ఆరో తేదీన ఈమేరకు ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపగా, అందులో కొన్ని సందేహాలను నివృత్తి చేసుకుని గత గురువారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దానిపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆ బిల్లును చట్టరూపంగా ఇప్పుడు అమలులోకి తెస్తూ, సెప్టెంబరు 15వ తేదీతో మంగళవారం గెజిట్ నోటిఫికేషన్‌ను న్యాయ శాఖ కార్యదర్శి జారీ చేశారు. దీంతో 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులు ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారినట్టయింది. ఇక విలీన విధివిధానాలను ఖరారు చేసేందుకు కమిటీని నియమిస్తూ ప్రభుత్వం త్వరలో ఉత్తర్వు జారీ చేయనుంది. ఆ కమిటీ కూలంకుషంగా పరిశీలించి, ఆర్టీసీ ఉద్యోగులు– ప్రభుత్వంలో ఏయే కేడర్‌లతో సమంగా ఉండాలి, వారి పే స్కేల్ ఎలా ఉండాలి, రిటైర్మెంట్ వయసు, పింఛన్ విధానం, ప్రస్తుతం ఆర్టీసీలో కొనసాగుతున్న ప్రత్యేక ఆర్థిక బెనిఫిట్స్ ఉండాలా వద్దా.. వంటి చాలా అంశాలపై స్పష్టతనిస్తూ ప్రభుత్వానికి సిఫారసులు అందించనుంది. వాటిని ఏ రోజు నుంచి అమలులోకి తేవాలో ఓ అపాయింటెడ్ డే ను కూడా ఖరారు చేయాల్సి ఉంది.

ఈ నెల జీతాలు ఆర్టీసీ నుంచేనా?

గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో.. వచ్చే నెల జీతాలను ప్రభుత్వం చెల్లిస్తుందని ఉద్యోగులు భావిస్తున్నారు. కానీ, ట్రెజరీ వేతనాలు ఎప్పటి నుంచి చెల్లించాలో స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయాల్సి ఉన్నందున, అప్పటి వరకు ఆర్టీసీ నుంచే యథావిధిగా జీతాలు చెల్లించాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. వీలైనంత తొందరలో ఉత్తర్వు జారీ అయితే ఆ సందిగ్ధం వీడుతుందంటున్నారు. కాగా ప్రస్తుతం ఆర్టీసీ ఎంత చెల్లిస్తుందో, ప్రభుత్వం కూడా అంతే చెల్లిస్తుందని, విధివిధానాలు ఖరారయ్యాక అసలు జీతాలపై స్పష్టత వస్తుందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

జనాభా దామాషా ప్రకారమే పోస్టులు

- సీడీసీ వారీగా కానిస్టేబుల్ నియామకాలు
- హైకోర్టులో టీఎస్ఎస్పీ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: అందరికీ న్యాయం కోసమే జనాభా దామాషా ప్రకారం పోస్టులు కేటాయించామని, కాంటిజియస్ డిస్ట్రిక్ట్ కేడర్(సీడీసీ)లోని జిల్లాల వారీగా నియామకాలు చేపడుతున్నామని తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ) తెలిపింది. రాష్ట్రస్థాయి పోస్టులైన స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను గత నోటిఫికేషన్లకు విరుద్ధంగా జిల్లా పోస్టులుగా గుర్తించి ఆ మేరకు నియామకాలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ కానిస్టేబుల్ అభ్యర్థులు కరుణాకర్‌తో పాటు మరో 19 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీని కోసం ప్రభుత్వం తెచ్చిన జీవో 46ను కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. 2018లో రాష్ట్రస్థాయి వారీగా నియామకం చేపట్టి.. ఇప్పుడు రాష్ట్రాన్ని కాంటిజియస్ డిస్ట్రిక్ట్ కేడర్‌గా విభజించి నియామకం చేపట్టడం చెల్లదన్నారు. ఈ కారణంగా తక్కువ పోస్టులున్న జిల్లాకు చెందిన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం జులైలో విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేసే వరకు స్పెషల్ పోలీస్ పోస్టుల ఫలితాలు నిలిచిపోయాయి. దీంతో తాజాగా టీఎస్ఎస్పీ కౌంటర్ దాఖలు చేస్తూ.. నియామకంపై స్పష్టత ఇచ్చింది.

టీఎస్ఎస్పీ వాదన ఇది..: 'రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమన్యాయం జరిగేలా ప్రభుత్వం జీవో 46 జారీచేసింది. కొత్త రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఈ జీవోను జారీ చేశాం. జీవో వచ్చిన 15 నెలల తర్వాత సవాల్ చేయడం చట్టప్రకారం చెల్లదు' అని కౌంటర్‌లో పేర్కొంది. హైకోర్టు అనుమతితో ఫలితాల విడుదలకు టీఎస్ఎస్పీ ఏర్పాట్లు చేస్తోంది.

యువతికి బలవంతంగా పురుగుల మందు తాగించి...

- ప్రేమ పేరుతో వెంటపడి.. హతమార్చిన యువకుడు
- ఆత్మహత్యగా భావించి ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువతి మృతి
- పదేళ్ల చిన్నారి సాక్ష్యంతో వెలుగులోకి దారుణం

సిర్పూర్ (టి): అతడికి అప్పటికే వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయినా ఓ యువతిని ప్రేమ పేరుతో వేధించాడు. ఆ యువతి ప్రేమకు నిరాకరించడంతో నేరుగా ఇంట్లోకి వెళ్లి ఆమెకు పురుగుల మందు తాగించి పరారయ్యాడు. తొలుత ఆత్మహత్యగా భావించినప్పటికీ ఓ పదేళ్ల చిన్నారి చెప్పిన సాక్ష్యంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన బుదే విట్టు, జీవనకళ దంపతుల కుమార్తె బుదే దీప (19) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన దంద్రె జోగాజీ, దుమన్‌బాయిల కుమారుడు కమలాకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్దిరోజులుగా కమలాకర్ ప్రేమ పేరుతో దీప వెంటపడుతున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 17న ఆదివారం సాయంత్రం యువతి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న ఇద్దరు చిన్నారులను భయపెట్టి బయటికి పంపించాడు. తనను ప్రేమించాలని లేకుంటే నిన్ను, నీ కుటుంబం మొత్తాన్నీ చంపుతానని దీపను బెదిరించాడు. అయినప్పటికీ ఆమె ఒప్పుకోకపోవడంతో వెంట తెచ్చుకున్న పురుగుల మందును బలవంతంగా ఆమెకు తాగించి పరారయ్యాడు. దీప కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువతిని మొదట సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో కాగజ్‌నగర్‌కు.. అక్కడి నుంచి మంచిర్యాలకు ఆ తర్వాత మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. సోమవారం కరీంనగర్‌లో దీప మృతి చెందింది. దీపది ఆత్మహత్యగా భావించిన కుటుంబ సభ్యులు పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే దీపకు కమలాకర్ బలవంతంగా పురుగుల మందు తాగించిన విషయం ఓ పదేళ్ల చిన్నారి ద్వారా మంగళవారం వెలుగులోకి వచ్చింది. దీంతో సామాజిక ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామంలో స్థానికులు నిందితుడిపై దాడికి యత్నించారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై రమేశ్ వారికి నచ్చజెప్పారు. పోలీసులు ఆస్పత్రిలోనే చిన్నారిని విచారించి పూర్తి వివరాలు సేకరించారు. మృతురాలి సోదరుడు బుదే రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.



బుదే దీప(ఫైల్)

నేడు 'పాలమూరు'పై కీలక తీర్పు!

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు 18న జారీ చేసిన ఉత్తర్వుల(జీవో నెం.246ను)ను సవాలు చేస్తూ కృష్ణా ట్రిబ్యునల్‌లో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో బుధవారం కీలక తీర్పు వెలువడనుంది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట రెండు రాష్ట్రాలు దాదాపు 4 నెలల పాటు సుదీర్ఘ వాదనలను వినిపించాయి. వాదనలు ముగిసిన తర్వాత 2 నెలల కిందట ట్రిబ్యునల్ తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం తీర్పును ప్రకటించనుండడంతో రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

అక్టోబర్ 5 తర్వాత.. ఏ క్షణంలోనైనా ఎన్నికల నగారా!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాల్లో పర్యటనలు నిర్వహిస్తుంది. ఆ తర్వాత షెడ్యూల్‌ను ప్రకటిస్తుంది. ప్రస్తుతం ఎన్నికలు జరగాల్సిన ఐదు రాష్ట్రాలకుగాను.. తెలంగాణ మినహా మిగతా 4 రాష్ట్రాల్లో ఇప్పటికే సీఈసీ బృందం పర్యటనలు ముగిశాయి. అక్టోబర్ 5వ తేదీ నాటికి తెలంగాణలోనూ పర్యటన ముగుస్తుంది. అంటే ఆ తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం గత శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను 2018 అక్టోబర్ 6న ప్రకటించగా.. అదే ఏడాది డిసెంబర్ 7న పోలింగ్, 11న ఫలితాలను ప్రకటించారు. ఈసారి కొన్ని రోజులు అటూఇటూగా షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలను ఒక్కో దఫాలోనే పూర్తి చేశారు. అలాగే ఈసారి కూడా ఒకే దఫాలో నిర్వహించవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 16వ తేదీతో ముగుస్తుంది. ఆలోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఓటర్ల జాబితా రెండో సవరణ కార్యక్రమంలో భాగంగా.. అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. దానితో ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్టేనని అధికారవర్గాలు చెప్తున్నాయి.

సీఈసీ బృందం షెడ్యూల్ ఇదీ..

- కేంద్ర ఎన్నికల కమిషనర్ల బృందం రాష్ట్ర పర్యటనలో భాగంగా.. అక్టోబర్ 3న జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశమై, అభిప్రాయ సేకరణ జరుపుతుంది. అనంతరం వివిధ కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులతో సమావేశమై.. ఎన్నికల్లో ధనం, మద్యం, ఇతర ప్రలోభాలు, అక్రమాల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తుంది. తర్వాత రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి (ఎస్ఎన్‌పీఓ), కేంద్ర సాయుధ బలగాల నోడల్ అధికారి తమ సన్నద్ధతను ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారు.
- అక్టోబర్ 4న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 33 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లతో సీఈసీ బృందం సమావేశం అవుతుంది. జిల్లాల వారీగా క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలు/పీసీలు ప్రజెంటేషన్ ఇస్తారు.
- అక్టోబర్ 5న ఓటర్లలో చైతన్యం కల్పించడానికి అమలు చేస్తున్న 'స్వీప్' కార్యక్రమం తీరుతెన్నులను సీఈసీ బృందం పరిశీలిస్తుంది. ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రచారకర్తలుగా ఉన్న క్రీడా, సినీ రంగ సెలబ్రిటీలతో సమావేశం అవుతుంది. దివ్యాంగ, యువ ఓటర్లతో ముఖాముఖీగా మాట్లాడుతుంది. చివరిగా ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌లతో సమావేశమై రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం, భద్రత సంస్థలను సమన్వయం పర్చే అంశంపై సమీక్షిస్తుంది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి తమ పర్యటన విశేషాలను వెల్లడిస్తుంది.

బిల్లు కట్టలేక బిడ్డను ఆసుపత్రిలో వదిలేశారు..

ఐదు రోజులుగా ఆపన్నుల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

సైదాబాద్(హైదరాబాద్): వైద్యానికైన బిల్లు చెల్లించేస్తోమత లేక నిరుపేద దంపతులు తమ కూతురును ఆసుపత్రిలోనే వదిలేశారు. ఐదురోజులుగా ఎంత ప్రయత్నించినా ఆదుకునేనాథుడులేక దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. హైదరాబాద్ ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో నివసించే నితిన్, ప్రవల్లిక ఏడాదిన్నర క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. నితిన్ కిరాయి ఆటో నడుపుతూ భార్యను పోషిస్తున్నాడు. 13 రోజుల క్రితం వారికి కూతురు జన్మించింది. అయితే పసిపాపకు ఊపిరితిత్తుల సమస్య ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒవైసీ ఆసుపత్రిలో చేర్చారు. ఏడురోజుల చికిత్స అనంతరం చిన్నారి కోలుకుంది. వైద్యానికిగాను రూ.లక్షా 16 వేల బిల్లు అయింది. అయితే వారి వద్ద కేవలం రూ. 35 వేలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన డబ్బులు కట్టడానికి సహాయం కోసం ఎవరిని అడిగినా ఫలితం లేకపోయింది. దాంతో బిల్లు కట్టలేక ఆ దంపతులు తమ కూతురును ఆసుపత్రిలోనే వదిలేశారు. గత ఐదు రోజులుగా తమను ఆదుకునేవారి కోసం ఎదురు చూస్తున్నారు. మంగళవారం సేవాలాల్ బంజారా సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ దాతలు ఈ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి ఆసుపత్రి బిల్లు కట్టేందుకు సాయం చేయాలని కోరారు.



తమను ఆదుకోవాలని వేడుకుంటున్న పాప తల్లిదండ్రులు

ప్రజాధనాన్ని లూటీ చేశారు

ఇదంతా అప్పటి సీఎం చంద్రబాబుకు తెలిసే జరిగింది

ఏపీ హైకోర్టుకు నివేదించిన సీఐడీ తరఫు న్యాయవాదులు • వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: ప్రజాధనం దుర్వినియోగం అధికార విధుల్లో ఎంత మాత్రం భాగం కాదని, అందువల్ల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. చంద్రబాబు స్వలాభాపేక్షతో, ఉద్దేశపూర్వకంగా రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు మంగళవారం నివేదించారు. ఇదంతా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిసే, ఆయన సమక్షంలోనే జరిగిందన్నారు. ప్రభుత్వ ఖజానాకు రూ.371 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్రకు సంబంధించి పూర్తి ఆధారాలను సేకరించేందుకు సీఐడీకి ఇంత సమయం పట్టిందని, చిన్న చాన్స్ కూడా తీసుకోలేదని, పక్కా ఆధారాలున్నాయని నిర్ధారించుకున్న తరువాతనే చంద్రబాబు అరెస్ట్ వరకు వెళ్లామన్నారు. గుజరాత్‌లో ఇదే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలకు రూ.కోటి చెల్లించగా, మన రాష్ట్రంలో మాత్రం అవే కేంద్రాలకు రూ.వందల కోట్లు చెల్లించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసు రాజకీయ ప్రేరితమంటూ చంద్రబాబు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. నిజాయితీతో పనిచేసే అధికారులు, ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తులను రాజకీయ కక్ష సాధింపుల నుంచి కాపాడేందుకే అవినీతి నిరోధక చట్టంలో 17ఏను చేర్చారే కానీ, నిర్భీతితో పట్ట పగలే ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు వంటి వారి కోసం కాదన్నారు. ప్రజాధనానికి ధర్మకర్తగా, రక్షకుడిగా వ్యవహరించాల్సిన వ్యక్తి భక్షకుడిగా మారి రూ.వందల కోట్లను దారి మళ్లించేశారన్నారు. ఇది పూర్తిగా అనధికారిక విధుల కిందకే వస్తుందని, అందువల్ల చంద్రబాబుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ఎంత మాత్రం వర్తించదని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, ఈ దశలో దర్యాప్తునకు ఆటంకం కలిగించేలా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని కోర్టును అభ్యర్థించారు. ఈ కేసులో ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం దర్యాప్తు చేపట్టాయని నివేదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యంలో తాను మధ్యంతర ఉత్తర్వుల జోలికి వెళ్లడం లేదని, రోజంతా పూర్తిస్థాయిలో వాదనలు విన్న నేపథ్యంలో ప్రధాన వ్యాజ్యంలోనే తగిన ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయమూర్తి ప్రకటించారు. కాగా విచారణ నిమిత్తం చంద్రబాబును తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులను సోమవారం వరకు ఒత్తిడి చేయవద్దంటూ ఏసీబీ కోర్టును ఆదేశిస్తూ గత



వారం ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తి పొడిగించలేదు.

సుదీర్ఘంగా వాదనలు..

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన మాజీ సీఎం చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు గత మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు ఆధారంగా విజయవాడ ఏసీబీ కోర్టు తనకు రిమాండ్ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టులో మధ్యాహ్నం 12.05 గంటలకు మొదలైన వాదనలు సాయంత్రం 5.20 వరకు నిరాటంకంగా కొనసాగాయి. వాదనల సమయంలో కోర్టు హాలు కిక్కిరిసిపోయింది. చంద్రబాబు తరఫున దేశంలోనే అత్యంత ఖరీదైన సీనియర్ న్యాయవాదిగా పేరున్న హరీశ్ సాల్వే, టీడీపీ తరఫున ప్రతి కేసును వాదించే మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. లండన్‌లో ఉంటున్న హరీశ్ సాల్వే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన వాదనలను వినిపించారు. ఈ సందర్భంగా అర్ణబ్ గోస్వామి కేసును కూడా ప్రస్తావించారు. 2024లో ఎన్నికలు రాబోతున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వం తన కౌంటర్‌ను చివరి నిమిషంలో తమకు అందచేసిందని, ముందే అందచేసి ఉండాల్సిందని సాల్వే పేర్కొనగా సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ జోక్యం చేసుకుంటూ ఇది కూడా కక్షపూరిత రాజకీయంలో భాగమేనంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీంతో న్యాయమూర్తితో సహా కోర్టు మొత్తం నవ్వులతో నిండిపోయింది. చంద్రబాబు ఎక్కడికీ పారిపోరని, ఒకవేళ ఆయన పారిపోతే ప్రభుత్వం కచ్చితంగా ఆయనపై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరిస్తుందని సాల్వే నవ్వుతూ చెప్పారు. దీంతో కోర్టులో నవ్వులు విరిశాయి.

10 రోజుల్లోనే కొట్టేయాలంటున్నారు..

సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, పొన్నవోలు సుధాకర్‌రెడ్డిలు వాదనలు వినిపిస్తూ స్కాం జరిగిన తీరును వివరించారు. స్కిల్ కుంభకోణంలో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందన్నారు. పలువురిని విచారించాల్సి ఉందని, మరి కొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. దర్యాప్తు దశలో కేసును కొట్టేయడానికి వీల్లేదని, ఈ విషయంలో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పునిచ్చిందంటూ నిహారికా కేసులో సుప్రీంకోర్టు తీర్పును చదివి వినిపించారు. సెప్టెంబర్ 7న చంద్రబాబును నిందితుడిగా చేర్చారని, 9వ తేదీన అరెస్ట్ చేశారని, 12వ తేదీన ఆయన తనపై కేసును కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. చంద్రబాబుపై కేసు నమోదు చేసి కేవలం 10 రోజులే అయిందన్నారు. తాము కౌంటర్ ఇప్పుడే ఇచ్చామని చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి 900 పేజీల అదనపు డాక్యుమెంట్లను వారు ఇప్పుడే తమకు అందచేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన వారికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అసలు వర్తించదన్నారు. కేసు నమోదు చేసింది 2021లో కావొచ్చు, కానీ కథ నడిచింది మొత్తం 2014, ఆ తరువాతేనని కోర్టుకు నివేదించారు. 2018కి ముందే ఈ కుంభకోణం వ్యవహారంలో సీఐడీ ప్రాథమిక దర్యాప్తు జరిపిందని వివరించారు. రికార్డులను తారుమారు చేయడం, ప్రజాధనాన్ని కొల్లగొట్టడం పబ్లిక్ డ్యూటీ కిందకు రానే రాదన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్ద ఆలోచనల నుంచే ఈ కుంభకోణం మొదలైందని రోహత్గీ తదితరులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆదాయపు పన్ను శాఖ, ఈడీలు సైతం దర్యాప్తు చేస్తున్నాయన్నారు. డ్యాం కట్టాం, వరదల వల్ల అది కొట్టుకుపోయింది.. మా తప్పేమీ లేదని చెప్పేంత చిన్న వ్యవహారం కాదని కోర్టుకు నివేదించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక చాలా లోతైన కుట్ర దాగి ఉందన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన పెద్దలు, దానిని దారి మళ్లించేందుకు పలు షెల్ కంపెనీలను సృష్టించారని, ఇందుకు పక్కా ఆధారాలున్నాయంటూ కోర్టు ముందుంచారు. కేసు డైరీని సైతం కోర్టుకు సమర్పించి కీలక ఆధారాలను కోర్టుకు నివేదించారు. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే హైకోర్టు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద తనకున్న అధికారాన్ని ఉపయోగించగలదన్నారు. ప్రాథమిక దశలో దర్యాప్తును కొనసాగించకుండా పోలీసులను నియంత్రిస్తూ ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదని తెలిపారు. దర్యాప్తు ప్రాథమిక దశలో కోర్టులు ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లడానికి వీల్లేదన్నారు. దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు పోలీసులకు అనుమతినివ్వాలని కోరారు. ఈ కేసు రాజకీయ ప్రేరేపితం అని చెబుతున్నారని, అదే నిజమైతే 2021లోనే చంద్రబాబును నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేసే వారిమన్నారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్రకు సంబంధించి ఆధారాలు లభించాయి కాబట్టే ఇప్పుడు అరెస్ట్ చేశామన్నారు. స్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందే రూ.300 కోట్లకు పైగా మొత్తాన్ని ప్రైవేటు కంపెనీల పేరు మీద మళ్లించేశారు, అదే ఇక్కడ కీలక విషయమని కోర్టుకు వివరించారు. ఒప్పందంలో భాగమైన రెండు ప్రైవేటు కంపెనీలు కలిసి మూడో కంపెనీని తెరపైకి తెచ్చి, ఆరు షెల్ కంపెనీలను సృష్టించి నిధులను మళ్లించేశాయన్నారు. ఇదంతా కూడా చంద్రబాబుకు తెలిసే జరిగిందని వివరించారు. నిధుల చెల్లింపునకు ఆయనే అనుమతినిచ్చారని తెలిపారు. ఇదంతా తాము చెబుతున్నది కాదని, కాగితాలే అందుకు సాక్ష్యమన్నారు.

చంద్రబాబు మనుషులు విదేశాలకు పారిపోయారు...

ఐటీ శాఖ అధికారులు చంద్రబాబుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులకు నోటీసులు ఇవ్వగానే ఒకరు దుబాయ్‌కి, మరొకరు వాషింగ్టన్‌కు పారిపోయారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. డిజైన్ టెక్ కంపెనీ రూ.200 కోట్లు దారి మళ్లించినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో బహిర్గతమైందన్నారు. పలు కీలక డాక్యుమెంట్లను మాయం చేశారనని, వాటన్నింటినీ కూడా వెతికే పనిలో దర్యాప్తు అధికారులున్నారని తెలిపారు. ముగ్గురి వాదనలు పూర్తి కాగానే దీనిపై సాల్వే, లూథ్రా తిరుగు సమాధానం ఇచ్చారు. అనంతరం న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఈ వ్యవహారంలో ఏం చెప్పాలనుకున్నా, ఇప్పుడే చెప్పాలని, ఈ వ్యాజ్యంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం లేదని, ప్రధాన వ్యాజ్యంపైనే నిర్ణయం వెలువరిస్తానని తేల్చి చెప్పారు. రోజంతా వాదనలు విన్న తరువాత ఓ అంశంపై ఇప్పుడు, మరో అంశంపై తరువాత ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇరుపక్షాలు వాదనలు పూర్తి చేయడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

కార్పొరేషన్‌ను ప్రతివాదిగా చేర్చాల్సిందే..

ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేసిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ)ను ప్రతివాదిగా చేర్చకుండానే పిటిషన్ దాఖలు చేశారని న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో కె.అజయ్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చారని, ఆయనకు ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఎలాంటి సంబంధం లేదని గట్టిగా చెప్పారు. అందువల్ల కార్పొరేషన్‌ను ప్రతివాదిగా చేర్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ఈ విషయాన్ని ముందే చెప్పి ఉండాల్సిందని పేర్కొన్నారు.



మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

స్కూళ్లు, హాస్టళ్లలో వసతులపై నివేదిక ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో మౌలిక వసతుల స్థితిగతులపై నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఫుడ్‌పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన విద్యార్థుల వివరాలను సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో అక్టోబర్ వరకు సమయం ఇస్తున్నామని, ఆలోగా రెండు నివేదికలు అందజేయాలని నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాలల హక్కుల పరిరక్షణ కోసం 'జాతీయ కమిషన్–2018' నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సౌకర్యాలు అందించడం లేదని, పది మందికి ఓ బాత్‌రూమ్, ఏడుగురికి ఓ మరుగుదొడ్డి, 50 మందికో వార్డెన్ ఉండాలని మార్గదర్శకాలు చెబుతున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీర్తినేడి అఖిల్‌శ్రీ గురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

గురుకుల పోస్టుల్లో సమాంతర రిజర్వేషన్ అమలు చేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీలోనూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాంతర రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుత రిజర్వేషన్ విధానంపై వివరణ ఇవ్వాలని గురుకుల సంస్థ నియామక బోర్డుకు నోటీసులు జారీచేసింది. గురుకుల డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు, పీజీ టీచర్లు, గ్రాడ్యుయేట్ టీచర్లు తదితర 9,026 పోస్టుల భర్తీ నిమిత్తం గురుకుల సంస్థ నియామకబోర్డు ఏప్రిల్ 5న జారీ చేసిన 9 నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ కొండ్రుపల్లి శ్రీనివాస్, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పి.మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సుంకర చంద్రయ్య వాదనలు వినిపిస్తూ తెలంగాణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్నట్లుగా గురుకుల టీచర్ నియామకాల్లో కూడా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహిళ, వికలాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ తదితర కోటాలను సమాంతరంగా అమలు చేయాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. ఈ నోటిఫికేషన్లకు సంబంధించిన పోస్టుల భర్తీలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలంటూ మధ్యంతర ఉత్తరులు జారీచేశారు. కౌంటర్ దాఖలు చేయాలని గురుకుల సంస్థల నియామకబోర్డుకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 18కి వాయిదా వేశారు.



శ్రీవారి సేవలో ఏపీ సీఎం


తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండుసార్లు శ్రీవారిని దర్శించుకున్నారు. సోమ, మంగళవారం తిరుపతి, తిరుమలలో గడిపిన సీఎం జగన్ శ్రీవారి సేవలో పాల్గొనడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తిరుపతిలో నూతనంగా నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్, ఎస్వీ హాస్టల్ నూతన భవనాలను ప్రారంభించడంతోపాటు టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.

– సాక్షి, తిరుపతి

శ్రీవారికి సమర్పించడానికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న ఏపీ సీఎం జగన్

చంద్రబాబు అరెస్టుపై సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం లేదు

ఎవరైనా మాట్లాడితే అది వారి వ్యక్తిగతమే: నిర్మాత డి.సురేశ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుపై సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం లేదని, అది చాలా సున్నితమైన విషయమని నిర్మాత డి.సురేశ్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం ఓ సినీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినీ పరిశ్రమ ఎప్పుడూ రాజకీయాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఉందని సురేశ్‌బాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలోనూ పరిశ్రమ ఎలాంటి స్పందననూ వ్యక్తం చేయలేదని గుర్తుచేశారు. ''ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డితోపాటు చాలా మంది సీఎంలు సినీ పరిశ్రమకు ఎంతో మేలు చేశారు. అలాగే చంద్రబాబు కూడా. నిజానికి మర్రి చెన్నారెడ్డి ఎక్కువ మేలు చేశారు. మేం సినిమాలు నిర్మించడానికి వచ్చాం. సినిమాలు తీస్తాం. కొందరు కొన్ని రాజకీయ పార్టీలతో సంబంధాలు పెట్టుకున్నప్పటికీ అది వారి వ్యక్తిగతం. ఆ రాజకీయాన్ని సినిమా ఇండస్ట్రీకి ఆపాదించాల్సిన అవసరం లేదు..'' అని సురేశ్‌బాబు స్పష్టం చేశారు.

నీటి బొట్టు.. విలువ తెలుసు

డోన్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్

రాయలసీమ బిడ్డగా కన్నీటి కష్టాలు తీర్చేందుకే హెచ్ఎన్ఎస్ఎస్ పంప్‌హౌస్

- రూ.250 కోట్లతో లక్కసాగరం వద్ద నాలుగేళ్లలోనే సాకారం.. కరువుకు శాశ్వత విముక్తి
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులకు సాగునీరు.. పది వేలకుపైగా ఎకరాలు సస్యశ్యామలం

"రాష్ట్రంలో నాలుగేళ్లలో సాకారమైన మార్పులు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో మంచి జరిగిందా? లేదా? అని మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలి. ఆపై ఓట్లు వేసేందుకు ఎన్నికల్లో అడుగులు వేయాలి. గతంలోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్! మారిందల్లా ముఖ్యమంత్రి మాత్రమే. కానీ అప్పుల రేటు గతంలో కంటే ఇప్పుడు చాలా తక్కువ. మీ బిడ్డ వచ్చాక అక్క చెల్లెమ్మల ఖాతాల్లో ఏకంగా రూ.2.35 లక్షల కోట్లు జమ చేశాడు. చంద్రబాబు హయాంలో ఇది ఎందుకు జరగలేదు? నాడు జన్మభూమి కమిటీల నుంచి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడి వరకూ దోచుకోవడం, పంచుకోవడమే! మన పాలనలో ప్రతి అడుగు మంచి కోసమే. విద్య, వైద్యం తోపాటు మహిళా సాధికారత దిశగా అడుగులు వేశాం. సామాజిక న్యాయంలో మన ప్రభుత్వానికి ఎవరూ సాటి లేరు. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు తోడుగా నిలబడి ప్రోత్సహించండి. దేవుడి దయతో మీకు ఇంకా మంచి చేసే పరిస్థితి రావాలని కోరుకుంటున్నా.

- సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: వినాయక చవితి సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువైన వరాలను అందించారు. రెండు జిల్లాల్లో 77 చెరువులకు హంద్రీ–నీవా నీటితోపాటు తాగునీటిని కూడా అందించే ప్రాజెక్టును సీఎం జగన్ మంగళవారం ప్రారంభించారు. పత్తికొండ నియోజకవర్గం లక్కసాగరం సమీపంలోని ఆలంకొండ పంప్‌హౌస్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించి నీటిని విడుదల చేశారు. అక్కడ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం డోన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

పక్కనే శ్రీశైలం ఉన్నా..

''ఇది నీటి విలువ తెలిసిన మనందరి ప్రభుత్వం.. హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి మెట్ట ప్రాంతాలకు తాగు, సాగు నీటిని అందించేందుకు లక్కసాగరం వద్ద పంప్ హౌస్ ఏర్పాటు చేసి 77 చెరువులను నింపుతున్నాం. రోజుకు 160 క్యూసెక్కుల చొప్పున 90 రోజుల్లో 1.24 టీఎంసీల హంద్రీ–నీవా జలాలతో చెరువులను నింపుతాం. ఆశ్చర్యమేంటంటే పక్కనే శ్రీశైలం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం జగన్

ఉన్నా మెట్ట ప్రాంతాలైన పత్తికొండ, డోన్‌కు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. డోన్ చరిత్రలో ఇప్పటివరకూ ఒక్క ఎకరాకు కూడా నికరజలాలు లేని పరిస్థితి. ఇంత దారుణ పరిస్థితులున్నా గతంలో ఎవరూ పట్టించుకున్న పరిస్థితులు లేవు. 2019 ఎన్నికలకు కేవలం 4–5 నెలల ముందు చంద్రబాబు ఒక జీవో ఇచ్చి టెంకాయ కొట్టారు. కనీసం పైపులు వేసేందుకు భూసేకరణ కూడా జరగలేదు. టెంకాయలు కొట్టేందుకు మాత్రం 8 ఎకరాలు కొనుగోలు చేశారు. అలాంటి దారుణమైన మోసాలకు పాల్పడ్డారు. చంద్రబాబు మాదిరిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావుడిగా పనులు చేపట్టే ప్రభుత్వం మాది కాదు. మనందరి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నీటి విలువ తెలిసిన రాయలసీమ బిడ్డగా రూ.253 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాం. నాలుగేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశాం. ఈ ప్రాంతంలో 8 మండలాలు అత్యంత కరువుతో ఉన్నాయి. మొత్తం 10,130 ఎకరాలకు సాగునీటితోపాటు ఈ ప్రాంతంలోని గ్రామాలకు తాగునీరు అందించే పనులు పూర్తి చేశాం. ఈ ప్రాజెక్టుతో డోన్, పత్తికొండ నియోజకవర్గాలకు మంచి జరుగుతుంది. ఆలూరు, పాణ్యం నియోజకవర్గాలకు కూడా మేలు జరుగుతుంది'' అని సీఎం అన్నారు.

ఫైబర్ నెట్ కేసులోనూ..

బాబుపై పీటీ వారంట్

- విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో దాఖలు చేసిన సీఐడీ
- ఫైబర్ నెట్ ప్రాజెక్టులోనూ చంద్రబాబు అవినీతి దందా
- అడ్డగోలుగా బినామీ కంపెనీకి టెండరు ఖరారు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడిని ఫైబర్ నెట్ కుంభకోణంలో అరెస్టు చేసి విచారించేందుకు అనుమతించాలని సీఐడీ మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రిజనర్ ఇన్ ట్రాన్సిట్ (పీటీ) వారంట్ దాఖలు చేసింది. ఇప్పటికే అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ పేరుతో చేసిన భూ దోపిడీ కేసులో ఏ1 చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు పీటీ వారంట్‌ను సీఐడీ ఇటీవల దాఖలు చేసింది. తాజాగా ఫైబర్ నెట్ కుంభకోణంలోనూ చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించడంతో న్యాయస్థానంలో పీటీ వారంట్ దాఖలు చేసింది. అందుకు న్యాయస్థానం అనుమతిస్తే ఈ కేసులో కూడా చంద్రబాబును అరెస్ట్ చేసి విచారించి న్యాయస్థానంలో హాజరుపరచనుంది.

బినామీ కంపెనీకి అడ్డగోలుగా ప్రాజెక్టు

టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫైబర్ నెట్ ప్రాజెక్టులో చంద్రబాబు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. మొత్తం రూ.2 వేల కోట్ల ఈ ప్రాజెక్టు కింద మొదటి దశలో రూ.333 కోట్ల విలువైన పనులు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు, లోకేశ్‌లకు సన్నిహితుడైన వేమూరి హరికృష్ణకు చెందిన 'టెరా సాఫ్ట్' కంపెనీకి టెండర్లు కట్టబెట్టారు. అందుకోసం టీడీపీ ప్రభుత్వం పక్కా పన్నాగంతో కథ నడిపించారు. చంద్రబాబు విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖలను తన వద్దే అట్టిపెట్టుకున్నారు. వాస్తవానికి ఫైబర్ నెట్ ప్రాజెక్టును ఐటీ శాఖ చేపట్టాలి. కానీ ఈ ప్రాజెక్టును విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖ చేపడుతుందని అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నిర్ణయించారు.

పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధంగా


ఫైబర్ నెట్ టెండర్లను తన బినామీ కంపెనీ అయిన టెరా సాఫ్ట్‌కు కట్టబెట్టడం కోసం చంద్రబాబు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధంగా టెరా సాఫ్ట్‌కు చెందిన వేమూరి హరికృష్ణ ప్రసాద్‌ను ముందుగానే రెండు కీలక పదవుల్లో నియమించారు. తొలుత ఆయన్ని ఏపీ ఇ– గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా చేర్చారు. నేర చరిత్ర ఉన్న ఆయన్ని అంతటి కీలక స్థానంలో నియమించడంపై అనేక అభ్యంతరాలు వచ్చినా ఏమాత్రం పట్టించుకోలేదు. అంతేకాకుండా.. ఫైబర్ నెట్ టెండర్ల మదింపు కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు. ఓ ప్రాజెక్టు టెండర్ల మదింపు కమిటీలో ఆ ప్రాజెక్టు కోసం పోటీ పడే సంస్థకు చెందిన వారు ఉండకూడదన్న నిబంధననూ ఉల్లంఘించారు. మరోవైపు టెరా సాఫ్ట్ సంస్థ అప్పటికే బ్లాక్ లిస్టులో కూడా ఉంది. అంతకు ముందు చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయలేకపోవడంతో ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. కానీ చంద్రబాబు ఒత్తిడి తీసుకువచ్చి బ్లాక్ లిస్ట్ జాబితా నుంచి టెరా సాఫ్ట్ కంపెనీ పేరును తొలగించారు. అనంతరం పోటీలో ఉన్న పలు కంపెనీలను పక్కనబెట్టి మరీ టెరా సాఫ్ట్ కంపెనీకి ప్రాజెక్టును కట్టబెట్టారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా సాంకేతిక కారణాలతో అనర్హులుగా చేయడం గమనార్హం.

షెల్ కంపెనీల ద్వారా..

చంద్రబాబు బినామీ కంపెనీ కావడంతో ఫైబర్ నెట్ ప్రాజెక్టును టెరా సాఫ్ట్ కంపెనీ అత్యంత నాసిరకంగా చేసి నిధులు కొల్లగొట్టింది. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యతా ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. దాంతో 80 శాతం ప్రాజెక్టు పనులు నిరుపయోగమయ్యాయి. మరోవైపు షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా తరలించారు. వేమూరి హరికృష్ణ తన సన్నిహితుడు కనుమూరి కోటేశ్వరరావు సహకారంతో కథ నడిపించారు. వేమూరికి చెందిన కాఫీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో కనుమూరి కోటేశ్వరరావు భాగస్వామిగా ఉన్నాడు. వేమూరి హరికృష్ణ, తుమ్మల గోపీచంద్, రామ్‌కుమార్ రామ్మూర్తిలతో కలసి విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ అనే మేన్‌పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కథ నడిపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరా సాఫ్ట్ కంపెనీ, ఇతర కంపెనీలకు గత సర్కారు ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. నకిలీ ఇన్వాయిస్‌లతో కొల్లగొట్టిన ఆ నిధులను కనుమూరి కోటేశ్వరరావు ద్వారా అక్రమంగా తరలించారు. వాటిలో రూ.144 కోట్లను షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ప్రభుత్వంలో 'ముఖ్య' నేతకు చేరినట్టు సీఐడీ గుర్తించింది. ఇక నాసిరకమైన పనులతో కూడా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని నిగ్గు తేల్చింది.

ఆధారాలతో సహా బట్టబయలు

ఫైబర్ నెట్ కుంభకోణంపై కేసు నమోదు చేసిన సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది. ముందుగా ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో మొత్తం అవినీతి బట్టబయలైంది. టెరా సాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించిందని, నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది. అనంతరం ఐపీసీ సెక్షన్లు 24, 166, 167, 418, 465, 468, 471, 409, 506, అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేసింది. కుంభకోణంలో కీలక పాత్రధారులైన టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్‌క్యాప్ వీసీ కె.సాంబశివరావు, ఫాస్ట్‌లేన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ డైరెక్టర్ విప్లవ కుమార్, జెమిని కమ్యూనికేషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ రామ్మూర్తి, నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించిన కనుమూరి కోటేశ్వరరావులను సీఐడీ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న వేమూరి హరికృష్ణ ప్రసాద్, ఏ11 తుమ్మల గోపీచంద్, ఏ22 రామ్‌కుమార్ రామ్మూర్తి ముందస్తు బెయిల్ పొందారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరెస్టుకు అనుమతి కోరుతూ సీఐడీ పీటీ వారంట్ దాఖలు చేయడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.


రూ.61.8 కోట్లు ధర పలికిన 'ది స్టోరీ టెల్లర్' చిత్రం

అమృత షేర్‌గిల్. 20వ శతాబ్దపు గొప్ప చిత్రకారిణి. 1941లో 28 ఏళ్ల చిన్న వయసులో మరణించినా ఆమె చిత్రాలు ఇప్పటికీ వార్తలు సృష్టిస్తూనే ఉన్నాయి. అమ్మలక్కల కబుర్లను 'ది స్టోరీ టెల్లర్' పేరుతో ఆమె బొమ్మ గీస్తే ఇప్పటివరకూ భారతదేశంలో ఏ చిత్రకారుడికీ పలకనంత వెల- 61.8 కోట్లు పలికింది. ఆ చిత్రం గురించి... ఆ గొప్ప చిత్రకారిణి గురించి.

అమృత చిత్రం

అమృత షేర్‌గిల్ తన జీవిత కాలంలో 200 లోపు చిత్రాలను గీసింది. అన్నీ కళాఖండాలే. వాటిలో చాలామటుకు ప్రఖ్యాత మ్యూజియమ్‌లలో ఉన్నాయి. కొన్ని మాత్రమే ఆమె చెల్లెలి (ఇందిర) కుమారుడు వివాన్ సుందరం, కుమార్తె నవీనల దగ్గర ఉన్నాయి. 1937లో తను గీసిన 'ది స్టోరీ టెల్లర్' చిత్రాన్ని అప్పటి లాహోర్‌లో మొదటిసారి ప్రదర్శనకు పెట్టింది అమృత. అప్పటి నుంచి ఆ చిత్రం చేతులు మారుతూ తాజాగా ఢిల్లీలో జరిగిన వేలంలో 61.8 కోట్లు పలికింది. ఇప్పటివరకూ భారతీయ చిత్రకారుల ఏ పెయింటింగ్‌కూ ఇంత రేటు పలకలేదు. ఆ విధంగా చనిపోయిన ఇన్నాళ్లకు కూడా అమృత రికార్డు స్థాపించ గలిగింది. దీనికంటే ముందు గతంలో సయ్యద్ హైదర్ రజా గీసిన 'జెస్టేషన్' అనే చిత్రం 51.75 కోట్లకు పలికి రికార్డు స్థాపించింది. దానిని అమృత బద్దలు కొట్టింది.

గొప్ప చిత్రకారిణి

అమృత షేర్‌గిల్ భారతీయ సిక్కు తండ్రి ఉమ్రావ్ సింగ్‌కి, హంగేరియన్ తల్లి ఎంటొనెట్‌కు జన్మించింది. బాల్యం నుంచి గొప్ప లావణ్యరాశిగా ఉండేది. ఐదేళ్ల నుంచి బొమ్మలు గీయడం మొదలు పెట్టింది. వీరి కుటుంబం సిమ్లాలో కొంత కాలం ఉన్నా అమృత బొమ్మల్లోని గొప్పదనాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆమెకు 16 ఏళ్ల వయసున్నప్పుడు పారిస్‌కు తీసుకెళ్లి ఐదేళ్ల పాటు చిత్రకళలో శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత అమృత గొప్ప చిత్రాలు గీస్తూ వెళ్లింది. అవన్నీ కూడా భారతీయ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేవే. ఇప్పుడు అత్యధిక రేటు పలికిన 'ది స్టోరీ టెల్లర్'– పల్లెల్లో నలుగురు అమ్మలక్కలు కూచుని కబుర్లు చెప్పుకునే సన్నివేశం. ఇది కాకుండా 'వధువు అలంకరణ', 'ఒంటెలు', 'యంగ్ బాయ్ విత్ త్రీ యాపిల్స్', 'జిప్సీ గర్ల్స్', 'యంగ్ గర్ల్స్' ఆమె ప్రఖ్యాత చిత్రాలు. ఆమె తన సెల్ఫ్ పోర్ట్రయిట్‌ను కూడా గీసుకుంది.


అమృత షేర్‌గిల్

అకాల మరణం

అమృత షేర్‌గిల్ తన హంగేరియన్ కజిన్ విక్టర్‌ను వివాహం చేసుకుంది. వారు లాహోర్‌లో ఉన్న సమయంలో కేవలం 28 ఏళ్ల వయసులో 1941లో మరణించింది. అందుకు కారణం కలుషిత ఆహారంతో వచ్చిన వాంతులు, విరేచనాలు అని చెప్తారు. మరో కారణం ఆ సమయంలో ఆమె గర్భవతిగా ఉందని సంప్రదాయ డాక్టర్‌గా ఉన్న విక్టర్ ఆమెకు రహస్యంగా, అశాస్త్రీయంగా అబార్షన్ చేయబోయాడని, అందువల్ల తీవ్రమైన బ్లీడింగ్ జరిగి మరణించిందని అంటారు.

ఆకర్షణాజాలం

అమృత షేర్‌గిల్ ఆ రోజుల్లో సంపన్న వర్గాల్లో గొప్ప ఆకర్షణ కలిగిన వ్యక్తిగా కీర్తి గడించింది. జవహర్‌లాల్ నెహ్రూ ఆమె స్నేహం కోసం అనేక లేఖలు రాశాడు. ఢిల్లీలో జరిగిన అమృత ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు హాజరయ్యాడు. 'అమృత ఎక్కడ అడుగు పెట్టినా అక్కడ ఉన్నవారందరూ చేష్టలు డిగి ఆమెను చూస్తూ ఉండిపోయేవారు' అని అనేకమంది రాశారు. 'ఆమె జీవించి ఉంటే ప్రపంచం మొత్తం ఎన్నదగిన గొప్ప చిత్రకారిణి అయి ఉండేది' అని ఆర్ట్ క్రిటిక్స్ అంటారు.

ఆమె లేదు. కాని ఆమె చిత్రాలు ఆమెను సజీవంగా ఉంచుతూనే ఉన్నాయి.

సూ్కలు నుంచి కాలేజీ దాకా సెకండ్ లాంగ్వేజ్‌గా ఉండే మాతృభాషను మొక్కుబడిగా చదివేవారే ఎక్కువ. ఆ.. మనకు తెలిసిందే కదా? దీనికి ఎందుకు ఎక్కువ సమయం కేటాయించాలని లైట్ తీసుకుంటుంటారు. కానీ మాతృభాషతో కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్‌లా ఐటీ కంపెనీల్లో పనిచేయవచ్చు. వాళ్లలా డాలర్లు సంపాదించవచ్చని చెబుతోంది రాధి దాట్ల. హిందీ మాత్రమే చదువుకుని అమెరికా వెళ్లిన రాధికి ఒక్క ఉద్యోగం కూడా దొరకలేదు. అయినా నిరాశపడకుండా తనకు తగిన ఉద్యోగాన్ని వెతికి పట్టుకుంది. ఇప్పుడామె ఏకంగా ఏఐ యంత్రాలకే హిందీ నేర్పిస్తోంది. అంతర్జాతీయ హిందీ టీచర్‌గా రాణిస్తోన్న రాధి గురించి ఆమె మాటల్లోనే.....

మెషీన్స్‌కూ... మదర్‌టంగ్ కావాలోయ్


రాధి దాట్ల

అమ్మా వాళ్లు తెలుగు వాళ్లే. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో పుట్టాను. నాన్న ఎయిర్ ఫోర్స్‌లో ఉత్తరభారత దేశంలో వివిధ ప్రాంతాల్లో పనిచేయడంతో... కేంద్రీయ విద్యాలయాల్లో చదివాను. అలా నా చదువంతా హిందీలోనే సాగింది. రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం వచ్చినప్పటికీ, యూపీ, పంజాబ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు వైజాగ్‌లో ఉండడంతో నా మొదటి భాష హిందీగా మారింది. హిందీ తరువాత తెలుగు, ఇంగ్లీష్ నేర్చుకున్నాను. కానీ హిందీ వచ్చినంతగా ఇంగ్లిష్, తెలుగు రాదు.

కెరీర్‌గా అనుకోలేదు...

డిగ్రీ వరకు హిందీని ఒక లాంగ్వేజ్‌గా మాత్రమే చూశాను. అయితే హిందీనే కెరీర్‌గా మారుతుందని అప్పుడు అనుకోలేదు. ఆ తరువాత మాస్టర్స్ చేసేటప్పుడు లింగ్విస్టిక్స్ చదివే అవకాశం రావడంతో హైదరాబాద్ యూనివర్శిటీలో హిందీకి అప్లైచేశాను. హిందీ కోర్సు చేసేటప్పుడు హిందీ మీద మక్కువ ఏర్పడింది. దీనికితోడు మా ప్రొఫెసర్ ''నీకు తెలిసిన సబ్జెక్టుని కెరీర్‌గా ఎంచుకో'' అని సలహా ఇచ్చారు. అప్పుడు నేను హిందీనే కెరీర్‌గా మలుచుకోవాలనుకున్నాను. ఆ తర్వాత పీహెచ్‌డీ చేస్తోన్న సమయంలో పిట్స్ బర్గ్, క్యాలిఫోర్నియా యూనివర్శిటీ విద్యార్థులు, బయాలజీ, ఎకనమిక్స్‌తోపాటు హిందీ నేర్చుకునేవారు.

అప్పుడు వారికి హిందీ చెప్పేదాన్ని.

అమెరికాలో.. హిందీ ఉద్యోగం

2003లో పెళ్లి అయ్యింది. నా భర్త ఉద్యోగ రీత్యా రెండేళ్ల తరువాత అమెరికా వెళ్లాము. అక్కడ ఉద్యోగం చేద్దామని ఉద్యోగాల కోసం వెతికాను. కానీ ఎక్కడా దొరకలేదు. చాలా మంది అమెరికా వచ్చాక... ఉద్యోగం కోసం కంప్యూటర్ సైన్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్‌లు నేర్చుకుంటుంటారు. నేను మాత్రం హిందీ టీచర్‌గా పనిచేసేందుకే ప్రయత్నించాను. అనేక వ్యయప్రయాసల తర్వాత అమెరికాలో బాగా పాపులర్ అయిన 'బెర్లిట్జ్' లాంగ్వేజ్ కార్పొరేషన్‌లో తొలి ఉద్యోగం దొరికింది. అక్కడ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్లో పనిచేసే వారికి హిందీ నేర్పించాలి. అలా డిఫెన్స్ వారికి హిందీ నేర్పించాను.

ఐదు నెలల బిడ్డను వదిలి...

డిఫెన్స్ వాళ్లకు పాఠాలు చెబుతూనే 2008లో జాన్ హాప్కిన్స్ యూనివర్శిటీకి అప్లై చేసాను. కొన్నాళ్ల తరువాత ఇంటర్వ్యూ కాల్ వచ్చి, హిందీ టీచర్‌గా సెలక్ట్ అయ్యాను. అప్పుడు నాకు ఐదు నెలల బాబు. వాడిని వదిలి వెళ్లాలంటే చాలా కష్టంగా అనిపించింది. ఆయన మేరీలాండ్ యూనివర్శిటీలో రీసెర్చర్‌గా చేసేవారు. ఆయన ఇంటికి వచ్చాక నేను క్లాసులు చెప్పడానికి వెళ్లేదాన్ని. సాయంత్రం ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు క్లాసులు చెప్పేదాన్ని.

ఇంట్లో కూర్చుని...

యూనివర్శిటీలో తరగతులు చెబుతూ ఫారిన్ సర్వీసెస్‌కు అప్లై చేశాను. వివిధ దేశాల్లో నివసిస్తోన్న అమెరికన్‌లకు హిందీ నేర్పించడానికి ఆఫర్ వచ్చింది. దీంతో అమెరికా ఫారిన్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హిందీ బోధించేదాన్ని. కోవిడ్ సమయంలో ఎడ్యుకేషన్ అంతా ఆన్‌లైన్ అయ్యింది. ఇదే సమయంలో మేరీలాండ్ యూనివర్శిటీ ఆన్‌లైన్ క్లాసులు చెప్పడానికి ఆఫర్ ఇవ్వడంతో 2021 నుంచి ఆన్‌లైన్ క్లాసులు చెబుతున్నాను. ఆ తర్వాత ఐటీ కంపెనీ ఆర్కిల్‌లో భాషా విభాగంలో పనిచేశాను. అక్కడ హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, బెంగాలీ, మరాఠీ, నేపాలీ భాషలను నేర్పించేవారు. ఆ తరువాత అమేజాన్‌లో సీనియర్ లింగ్విస్ట్‌గా, యాపిల్ కంపెనీలో హిందీ ప్రాజెక్టులో పనిచేశాను.

ఇప్పుడంతా డేటా అనలిస్టు, మెషిన్ లెర్నింగ్ గురించే మాట్లాడుతున్నారు. మెషిన్ లెర్నింగ్ ఒక్క ఇంగ్లిష్‌లోనే లేదు. ఇతర భాషల్లో కూడా అందుబాటులోకి వస్తోంది. మెషిన్‌కి అన్ని భాషలు తెలియవు. అందువల్ల ప్రతి భాషను మెషిన్‌కు నేర్పించాల్సిందే. అప్పుడు మాత్రమే కోడింగ్ చేయగలరు. కోడింగ్ ద్వారానే అన్నిరకాల యాప్‌లు క్రియేట్ చేస్తారు. ఒక యాప్ తయారవడానికి కచ్చితంగా భాషా నిపుణులు అవసరం. అందుకే సైన్స్, మ్యాథ్స్‌లకున్న ప్రాముఖ్యత భాషకూ ఉంది. ఇది మనం గ్రహించాలి.

ప్రపంచంలో ఇండియా పెద్ద మార్కెట్. చాలా కంపెనీలు మన దేశం వైపు చూస్తున్నాయి. అందువల్ల భవిష్యత్ తరాలకు హిందీతోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ఇంగ్లీష్‌తోపాటు, హిందీ కూడా అవసరమే. ఇంగ్లీష్‌తో పాటు హిందీ కూడా చక్కగా నేర్చుకోండి ఓపికగా వెతికితే మంచి అవకాశాలు మీ దగ్గరకు వస్తాయి.'' అని నేటి యువతరానికి రాధి చెబుతోంది.

ఇంటిప్

బొప్పాయి విత్తనాలు కూడాను..

- బొప్పాయి పండు విత్తనాల్లో ఆల్కలాయిడ్స్,ఫ్లేవనాయిడ్స్, పాలీఫీనాల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి అర్థరైటిస్‌ను తగ్గిస్తాయి.
- బొప్పాయి గింజలు తినడం వల్ల జీర్ణసంబంధ సమస్యలు తగ్గుముఖం పడతాయి. జీర్ణక్రియారేటు పెరుగుతుంది.
- వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఆహారాన్ని విషం కానివ్వవు.
- గింజలను ఆహారంలో భాగం చేసుకుంటే గుండె సంబంధిత సమస్యలు దరిచేరవు. హార్ట్‌ఎటాక్ రాదు.
- బొప్పాయి గింజలు కొవ్వుని కరిగించి, బరువుని నియంత్రణలో ఉంచుతాయి.



అమ్మ లిప్‌స్టిక్.. అమ్మమ్మ చీర కలిస్తే.. ఎంట్రప్రెన్యూర్

జీవితంలో ఇది అవ్వాలి! అది అవ్వాలి! అని కలలు కంటుంటాము. కొంతమంది కలలు మాత్రమే నిజం అవుతాయి. కొంతమంది పరిస్థితులకు తలొగ్గి ఇష్టం లేకపోయినా సర్దుకుపోయి బతికేస్తుంటారు. హిమాద్రి పటేల్ మాత్రం ఈ కోవకు చెందిన అమ్మాయి కాదు. ఇక ఇంతేలే అని సరిపెట్టుకోకుండా తను అనుకున్నది సాధించేందుకు అందర్నీ ఒప్పించి, కష్టపడి.. ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కంటెంట్ క్రియేటర్, ఎంట్రప్రెన్యూర్‌గా రాణిస్తోంది.





ఐదు గంటలకు పడుకునేవాళ్లం

అక్కా నేను రాత్రంతా మేలుకుని చేయాల్సిన పని గురించి పరిశోధించి, వివరంగా తెలుసుకుని పేపర్ వర్క్ పూర్తిచేసేవాళ్లం. లీగల్ విషయాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెల్లవారుజామున ఐదు గంటలకు పడుకునేవాళ్లం. అలా అన్నివిధాలా సన్నద్ధమయ్యాక అంటే రెండేళ్ల తరువాత డ్రై బ్రాండ్‌ను గతేడాది అక్టోబర్‌లో తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎవరూ సాయం చేయలేదు. యూట్యూబ్, కంటెంట్ బిజినెస్ ద్వారా వచ్చిన ఆదాయంతో దాచుకున్న డబ్బులనే డ్రై బ్రాండ్‌కు పెట్టుబడిగా పెట్టుకున్నాను. ప్రారంభంలో పెద్దగా ఆర్డర్లు ఏమీ రాలేదు. నెల తరువాత ఆర్డర్లు రావడం మొదలయ్యాయి. అలా వచ్చిన ఆర్డర్లతో పెట్టుబడికి కొంత, మిగతాది వర్కర్లకు జీతాలకు ఇచ్చేదాన్ని. అలా చేస్తూ ఇప్పుడు కాస్త లాభాలు ఆర్జిస్తున్నాను.

– హిమాద్రి పటేల్

డెహ్రాడూన్‌కు చెందిన 26 ఏళ్ల హిమాద్రి పటేల్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేది. మేకప్ అంటే ఎంతో ఆసక్తి. అమ్మ వాడే లిప్‌స్టిక్ రాసుకుని తనని తాను అద్దంలో చూసుకుని తెగ మురిసిపోతుండేది. ఎప్పుడూ నలుగురిలో ప్రత్యేకంగా ఉండేందుకు తాపత్రయ పడేది. ఇంటర్మీడియట్‌లో ఉండగానే జాతీయ, అంతర్జాతీయ మేకప్ ట్యుటోరియల్స్ చూసి మెకప్ మెళకువలు నేర్చుకుంటుండేది. ఇలా నేర్చుకుంటూ తను కూడా సొంతంగా యూట్యూబ్ ఛానల్ పెట్టాలనుకుంది. కానీ దానికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఈలోపు ఇంటర్మీడియట్ పూర్తయింది. తరువాత ఫ్యాషన్‌ను కెరీర్‌గా మలచుకోవాలనుకుంది. తల్లిదండ్రులు ఇంజినీరింగ్ చేయమని చెప్పారు. ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులను నొప్పించలేక కంప్యూటర్ సైన్స్‌లో చేరింది. బీటెక్ చదువుతున్నప్పటికీ మేకప్ మెళకువలు నేర్చుకుంటూనే ఉంది.

ఇన్ఫోసిస్‌ను వదిలి ఇన్‌ఫ్లుయెన్సర్‌గా...

బీటెక్ చదువుతున్నప్పటికీ మనసు యూట్యూబ్ పైనే ఉండడంతో మరోసారి తల్లిదండ్రులను యూట్యూబ్ ఛానల్ పెడతానని అడిగింది. అయినా ఒప్పుకోలేదు. అప్పుడు హిమాద్రి అక్క... ''ఛానల్‌ను పెట్టనివ్వండి. ఆమెకు మూడు నెలలు సమయం ఇద్దాం. ఆలోపు తనని తాను నిరూపించుకుంటే ఒకే. లేదంటే మనం చెప్పినట్టు చేస్తుంది'' అని తల్లిదండ్రులను ఒప్పించింది. దీంతో హిమాద్రి పటేల్ పేరుతోనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించింది. ఒక లిప్‌స్టిక్, ఐలైనర్‌తో ఛానల్లో వీడియోలు పోస్టుచేయడం ప్రారంభించింది. అందంగా కనిపించేందుకు ఎటువంటి హానీ లేని మేకప్‌ను ఎలా వేసుకోవాలో చెబుతూ వీడియోలు పోస్టుచేసేది. ఎక్కువగా నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారాలు చెబుతుండడంతో తన ఛానల్‌కు మంచి ఆదరణ లభించింది. మరోపక్క బీటెక్ ఫైనల్ ఇయర్‌లోకి వచ్చింది. క్యాంపస్ సెలక్షన్స్‌లోనూ మంచి ప్రతిభచూపి ఇన్ఫోసిస్, క్యాప్‌జెమినీలలో ఉద్యోగం సంపాదించింది. అయినా హిమాద్రికి పెద్ద సంతోషంగా అనిపించలేదు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదింటివరకు చేసే సాంప్రదాయ ఉద్యోగం చేయడం తనకి నచ్చలేదు. తల్లిదండ్రులు ఇన్ఫోసిస్‌లో చేరమని చెప్పారు. కానీ తను యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతానని చెప్పింది. అప్పటికే హిమాద్రి మీద నమ్మకం ఉన్న తల్లిదండ్రులు యూట్యూబర్‌గా కొనసాగడానికి ఒప్పుకున్నారు. అప్పటి నుంచి యూట్యూబ్ ఛానల్ వివిధ రకాల సరికొత్త కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తూ సంపాదిస్తూ, ఎక్కువమంది ఫాలోవర్స్‌తో.. బ్యూటీ, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పాపులర్ అయ్యింది.

అమ్మమ్మ చీరలుచూసి...

హిమాద్రి చిన్నప్పటి నుంచి అమ్మమ్మ కట్టుకునే చీరలను జాగ్రత్తగా గమనించేది. నిమిషంలో కుచ్చిళ్లు పెట్టుకుని అందంగా చీరకట్టుకుని సైకిల్ తొక్కేది అమ్మమ్మ. అంతేగాక చీరలకు తనే స్వయంగా డిజైన్లు కుట్టుకోవడం, ఇంట్లో అందరికి స్టోల్స్ అల్లడాన్ని చూసి పెరిగిన హిమాద్రి అలాంటి బట్టలనే మార్కెట్లో విక్రయించాలనుకుని..'డ్రై బై హిమాద్రి' పేరిట క్లాత్ బ్రాండ్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బ్రాండ్ ద్వారా అత్యంత నాణ్యమైన, సాంప్రదాయ దుస్తులను విక్రయిస్తోంది. అలనాటి డిజైన్ చీరలు, డ్రెస్‌లను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా హిమాద్రి దూసుకుపోతోంది.

గౌరవంగా...

డ్రై (DRI) అంటే సంస్కృతంలో గౌరవం అని అర్థం. అమ్మాయిలు, మహిళలు ధరించే చీరలు, డ్రెస్‌లు ఏవైనా గౌరవించేలా వారి కట్టుబొట్టు ఉండాలి. అందకు తగ్గట్టుగా సాంప్రదాయ వస్త్రాలను తయారు చేసి విక్రయిస్తోంది హిమాద్రి. వ్యాపార రంగంలో ఎటువంటి అనుభవమూ లేదు. కుటుంబం నుంచి వచ్చిన తొలివ్యాపారి కావడంతో హిమాద్రి అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. వివిధ రకాల చిక్కులను తన అక్క సాయంతో ఎదుర్కొంటూ.. చిన్న చిన్న వేడుకల నుంచి వెడ్డింగ్ డ్రెస్‌ల వరకు అన్ని వస్త్రాలను రూపొందించి డ్రైబ్రాండ్‌కు గుర్తింపు తెచ్చుకుని యంగ్ ఎంట్రప్రెన్యూర్‌లకు ప్రేరణగా నిలుస్తోంది.



యూత్ పల్స్

విజేతల విజయాలు ఇతరులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది స్టార్ ఉమెన్ ఇన్వెస్టర్‌ల నుంచి స్ఫూర్తి పొందిన ఈతరం అమ్మాయిలు 'లెర్నింగ్ అండ్ చేజింగ్' సూత్రంతో ట్రేడింగ్ అండ్ ఇన్వెస్టింగ్‌లలో విజయం సాధిస్తున్నారు. తమదైన గెలుపు ప్రణాళికను పక్కాగా రూపొందించుకుంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్ట్‌మెంట్ గేమ్‌లో పురుషాధిక్యత కనిపిస్తుంది. ఒక ఆన్‌లైన్ వెల్త్ మేనేజ్‌మెంట్ స్టడీ ప్రకారం అయిదుమందిలో ఒకరు మాత్రమే ఉమెన్ ఇన్వెస్టర్. అయితే ఈ పరిస్థితులలో ఇప్పుడు ఆశాజనకమైన మార్పు కనిపిస్తుంది. ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఏరియాలోకి మహిళలు వచ్చి సత్తా చాటుతున్నారు. మన దేశం విషయానికి వస్తే పాండమిక్ సమయంలోనూ ఉమెన్ ఇన్వెస్టర్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది.

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన వర్ష శ్రీవాస్తవకు ఇన్వెస్ట్‌మెంట్ ఫీల్డ్‌లో రాణించాలనేది భవిష్యత్ లక్ష్యం. ఇన్వెస్ట్‌మెంట్‌లో అద్భుత విజయాలు సాధించిన మహిళలు ఎంబీఏ చేస్తున్న వర్షకు స్ఫూర్తి.

బెంగళూరుకు చెందిన ఏంజెల్ ఇన్వెస్టర్ అంకిత వశిష్ఠ ఔత్సాహిక మహిళా ఇన్వెస్టర్‌లకు స్ఫూర్తిగా నిలిచింది. వెంచర్ క్యాపిటల్ ఫండ్ 'సహ ఫండ్'కు అంకిత ఫౌండర్, సీయివో. వీసీ ఫర్మ్ 'స్ట్రాంగ్‌హర్' ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్.

పద్మజ రూపరెల్ ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్(ఐఏఎన్) కో–ఫౌండర్, ప్రెసిడెంట్. 'ఐఏఎన్' పది దేశాలలో ఫైనాన్స్, వ్యవసాయం, అంతరిక్షం, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు... మొదలైన రంగాలలో పెట్టుబడులు పెడుతోంది. పద్మజ 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్'గా గుర్తింపు పొందింది.

... ఈ ఇద్దరు మాత్రమే కాదు భారతీ జాకబ్, నీతా మీర్ చందానీ, సాక్షి చోప్రా, బాలా దేశ్ పాండే...లాంటి ప్రముఖ ఇన్వెస్టర్‌లు వర్షకు స్ఫూర్తి.

ముంబైకి చెందిన చైత్రకు లారెన్ సీమన్స్ అంటే చెప్పలేనంత ఇష్టం. 'సీమన్స్ గురించి చదివిన కొద్దీ చదవాలనిపిస్తుంది. ఆమె మాటల్లో ఎంతో స్ఫూర్తి దొరుకుతుంది' అంటుంది చైత్ర. ఇరవై మూడు సంవత్సరాల వయసులో వాల్‌స్ట్రీట్‌లో యంగెస్ట్ ఫుల్–టైమ్ ఫిమేల్ ట్రేడర్‌గా ఎంతో మందికి స్ఫూర్తి ఇచ్చింది లారెన్ సీమన్స్. కెరీర్ మొదలుపెట్టినప్పుడు సీమన్స్‌కు ఎలాంటి అనుభవమూ లేదు. కుటుంబ సభ్యులు, బంధువులలోనూ ఆ రంగంలో ఎవరూ లేరు. జెనెటిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన సీమన్స్ న్యూయార్క్ సిటీకి వెళ్లి ఫైనాన్స్ రంగంలో అడుగు పెట్టింది,.

'డైరెక్షన్‌లెస్' 'కన్‌ఫ్యూజ్‌డ్' అంటూ ఆమెకు పేర్లు తగిలించేవాళ్లు కొందరు పురుషులు. ఈ పేర్ల వెనుక ఉద్దేశం ఆమెకు ఏమీ తెలియదు అని. అయితే 'రోసెన్ బ్లాట్ సెక్యూరిటీస్' సీయివో జో గారోస్కి మాత్రం ఆమెపై నమ్మకం ఉంచాడు. 'జార్జియా నుంచి ఇక్కడికి వచ్చిన ఈ అమ్మాయికి ఫైనాన్స్‌లో డిగ్రీ లేదు. అయితే ఏదో సాధించాలనే ఉత్సాహం ఉంది. అంకితభావం ఉంది' అన్నారు. రోసెన్ బ్లాట్ సెక్యూరిటీస్‌లోకి అడుగు పెట్టి ప్రయాణం ప్రారంభించింది సీమన్స్. ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ కీనోట్ స్పీకర్‌గా ఫైనాన్స్‌కు సంబంధించి అమ్మాయిలకు స్ఫూర్తి ఇస్తుంది. వారి కోసం ఎన్నో రచనలు చేసింది.

సీమన్స్‌లాగే మన దేశానికి చెందిన మహెక్ షాకు వెటకారం మాటలు ఎదురయ్యాయి. పందొమ్మిది సంవత్సరాల వయసులోనే ట్రేడింగ్‌లోకి వచ్చిన మహెక్ వాటిని పట్టించుకోలేదు. తన పనితోనే సమాధానం చెప్పాలనుకుంది. ఇంట్రాడే ట్రేడింగ్‌తో స్టాక్‌మార్కెట్‌లో తొలి అడుగు వేసింది. టెక్నికల్ టర్మ్స్‌ను అర్థం చేసుకోవడం నుంచి సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలో తెలుసుకోవడం వరకు ఎన్నో విషయాలను తన ప్రయాణంలోనే నేర్చుకుంది. హైయెస్ట్ ప్రాఫిట్ చూసిన రోజు తన ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యేది. ట్రేడింగ్‌లో డబ్బు కోల్పోయిన సందర్భాలు కూడా లేకపోలేదు. 'చాలా నిరుత్సాహానికి గురయ్యాను. అయితే అంతలోనే తేరుకొని తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాను' అంటుంది 26 సంవత్సరాల మహెక్.

పొద్దున తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు చేతిలో ల్యాప్‌టాప్‌తో పనిలో తలమునకలై ఉంటుంది మహెక్. డిగ్రీ తరువాత ఫుల్‌టైమ్ ట్రేడర్ అయింది. తల్లిదండ్రులపై ఆధారపడకుండా తాను సంపాదించిన డబ్బుతో యూకేలో ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ చేసింది.



పవర్ ఆఫ్ ట్రేడింగ్ తెలుసుకున్నాను. ఫారిన్ మార్కెట్‌లో కూడా ట్రేడింగ్ చేయాలనుకుంటున్నాను. ఇండియాలో నేర్చుకున్న విషయాలు నాకు ఉపకరిస్తాయి.

– మహెక్ షా

చార్టెడ్ ఎకౌంటెన్సీ ట్రైనింగ్ నుంచి మధ్యలోనే బయటకు వచ్చిన ప్రియల్ అనిల్ బర్గీ ఈక్విటీ ఇన్వెస్టింగ్‌లోకి అడుగు పెట్టింది. తండ్రి నుంచి కొంత మొత్తాన్ని తీసుకొని స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన ప్రియల్ ఆ మొత్తాన్ని కొంత కాలానికే రెట్టింపు చేసింది. అంతమాత్రాన ఆమెకు నష్టాలు ఎదురు కాలేదని కాదు. ఒకేరోజు కొన్ని లక్షలు పోగొట్టుకొని షాక్‌కు గురైంది. అయితే నిరాశతో వెనకడుగు వేయకుండా, తాను వేసిన తప్పటడుగును లోతుగా విశ్లేషించుకుంది.

'ఇతరుల ద్వారా తెలుసుకునే టిప్స్ మాత్రమే మనం నిలదొక్కుకోవడానికి ఉపయోగపడవు. అతిపెద్ద సవాలు ఏమిటంటే దురాశకు దూరంగా ఉండడం. అదే సమయంలో ఆశావాదాన్ని కోల్పోకుండా ఉండడం. భయం ఉండాలి. అది మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే భయం కాకూడదు. మనల్ని హద్దుల్లో పెట్టే భయమై ఉండాలి' అంటున్న 27 సంవత్సరాల ప్రియల్ బర్గీ నాగ్‌పూర్ కేంద్రంగా 'సతిభాయి తులసీదాస్ ఇన్వెస్ట్‌మెంట్స్' సంస్థను ప్రారంభించింది.



ఇతరుల ద్వారా తెలుసుకునే టిప్స్ మాత్రమే మనం నిలదొక్కుకోవడానికి ఉపయోగపడవు. అతి పెద్ద సవాలు ఏమిటంటే దూరాశకు దూరంగా ఉండడం. అదే సమయంలో ఆశావాదాన్ని కోల్పోకుండా ఉండడం.

– ప్రియల్ బర్గీ

ప్రణీత్‌కు చేజారిన అవకాశం

భారత వర్ధమాన చెస్ ఆటగాళ్లకు అనూహ్య రీతిలో ఒక అరుదైన అవకాశం చేజారింది. వీసా సమస్యల కారణంగా ఐదుగురు చెస్ ఆటగాళ్లు ‘ఫిడే’ వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌కు దూరమయ్యారు. మెక్సికో సిటీలో ఈ నెల 22నుంచి అక్టోబర్ 2 వరకు టోర్నీ జరగనుంది. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన ఉప్పల్ ప్రణీత్ కూడా ఉన్నాడు. గత మే నెలలో భారత 82వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందిన ప్రణీత్ కెరీర్‌లో మరింత ఎదిగే ప్రయత్నంలో వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యాడు. వివిధ టోర్నీల ప్రాక్టీస్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణీత్‌కు రూ. 2.5 కోట్ల ప్రోత్సాహకాన్ని అందించింది. ప్రణీత్‌తో పాటు వృశాంక్ చౌహాన్, అరుణ్ కటారియా, భాగ్యశ్రీ పాటిల్, ఫెమిల్ చెల్లదురైలకు నిరాశ ఎదురైంది. భారత ప్రభుత్వం ద్వారా ఎన్ని ప్రయత్నాలు చేసినా వీసా దక్కలేదని అధికారులు వెల్లడించారు. చివరి నిమిషంలో ఇద్దరి కోచ్‌లను మార్చడం వల్ల ఈ సమస్య తలెత్తిందని సమాచారం.



వరల్డ్ కప్ ఆడతాడా!

- ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు అశ్విన్ ఎంపిక
- సత్తా చాటేందుకు సరైన అవకాశం
- తొలి రెండు మ్యాచ్‌లకు రోహిత్, కోహ్లి దూరం
- కెప్టెన్‌గా కేఎల్ రాహుల్

వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టును ప్రకటించినప్పుడు సెలక్టర్లను అందరూ పదే పదే అడిగిన ప్రశ్న...‘జట్టులో ఒక్క ఆఫ్ స్పిన్నర్ కూడా లేడు. ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లకు చోటు ఎంత వరకు సమంజసం, స్పిన్ బౌలింగ్‌లో వైవిధ్యం లేకపోతే ఎలా’ అని! తమ ఎంపికను సమర్థించుకుంటూ చీఫ్ సెలక్టర్ అగార్కర్ దానికి వివరణ ఇచ్చుకుంటూ పోయాడు. అయితే ఇప్పుడు అక్షర్ పటేల్ గాయం వారిలోనూ కొత్త ఆలోచనను తెచ్చినట్లుంది. అందుకే ముందుగా ఆసియా కప్ ఫైనల్ కోసం ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఎంపిక చేసిన సెలక్టర్లు ఇప్పుడు సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌నూ జట్టులోకి తెచ్చారు. టీమ్ ప్రకటనకు తుది గడువైన సెప్టెంబర్ 28లోగా అక్షర్ కోలుకోకపోతే మరి అనుభవాన్ని బట్టి అశ్విన్‌ను తీసుకుంటారా, లేక సుందర్ వైపు మొగ్గు చూపుతారా అనేది చూడాలి. అయితే ఏడాదిన్నర క్రితం తన చివరి వన్డే ఆడిన అశ్విన్ ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన ఇస్తాడనేదే ఆసక్తికరం.



ఆస్ట్రేలియాతో సిరీస్‌కు భారత జట్టు (తొలి రెండు వన్డేలకు)
రాహుల్ (కెప్టెన్), జడేజా (వైస్ కెప్టెన్), గిల్, రుతురాజ్, శ్రేయస్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్, శార్దుల్, బుమ్రా, సిరాజ్, షమీ, తిలక్, ప్రసిధ్, అశ్విన్, సుందర్.

ముంబై: ప్రపంచ కప్‌కు ముందు సన్నాహకంగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే తొలి రెండు వన్డేలకు ఒక జట్టు, చివరి వన్డేకు మరో జట్టును విడివిడిగా ఎంపిక చేశారు. సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పునరాగమనమే ఈ ఎంపికలో విశేషం. ఆసియా కప్ కోసం ముందుగా ఎంపిక చేసిన ప్రధాన జట్టులో ఆఫ్‌స్పిన్నర్ లేడు. ఫైనల్‌కు ముందు సుందర్ జట్టుతో చేరగా, ఇప్పుడు తాజా సిరీస్ కోసం అతనితో పాటు అశ్విన్‌కూ అవకాశమిచ్చారు. సుందర్‌ను ఈ సిరీస్ కోసం కూడా కొనసాగించనున్నారు. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా టీమ్‌లో చోటు లభించింది. తొలి రెండు వన్డేలు ఆడిన అతను ఆ తర్వాత ఆసియా క్రీడల జట్టుతో కలుస్తాడు.

నలుగురు ప్రధాన ఆటగాళ్లకు తొలి రెండు మ్యాచ్‌నుంచి విశ్రాంతి కల్పించారు. ఆసియా కప్‌లో ఆడిన కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు విరామం లభించింది. గాయం కారణంగా అక్షర్ పటేల్ తొలి రెండు మ్యాచ్‌లకు ముందే దూరమయ్యాడు. రోహిత్ లేకపోవడంతో కేఎల్ రాహుల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అయితే మూడో వన్డేకు మాత్రం వీరంతా తిరిగొస్తారు. వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసిన 15 మంది బృందాన్నే చివరి వన్డేకు ఎంపిక చేశారు. వీరికి తోడు అదనంగా అశ్విన్, సుందర్‌లకు కూడా చోటు లభించింది. అప్పటికి అక్షర్ పటేల్ కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. లేదంటే అక్షర్ స్థానంలో అశ్విన్, సుందర్‌లలో ఒకరికి చివరి వన్డేలో, ఆపై వరల్డ్ కప్ టీమ్‌లోనూ అవకాశం దక్కుతుంది.



అశ్విన్ స్థాయి ఆటగాడికి బరిలోకి దిగి ఎన్ని రోజులైందనేది పెద్ద విషయం కాదు. అతని అనుభవం అన్నింటికంటే కీలకం. అందుకే తీసుకున్నాం. వన్డేలు ఆడకపోయినా అతను టెస్టు రెగ్యులర్, స్థానిక తమిళనాడు లీగ్‌కు కూడా ఆడుతున్నాడు. ఆస్ట్రేలియాతో ఆడితే అతని ప్రస్తుతం ఆట ఏమిటో మాకు అర్థమవుతుంది.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్

ఆరేళ్లలో రెండు వన్డేలే..

2011 వన్డే వరల్డ్ కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో భాగమైన అశ్విన్ తన 12 ఏళ్ల వన్డే కెరీర్‌లో 113 మ్యాచ్‌లలో 33.49 సగటుతో 151 వికెట్లు పడగొట్టాడు. 2015 వన్డే వరల్డ్ కప్ కూడా ఆడాడు. అయితే 2017 చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఓటమి తర్వాత అతనిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఆ వెంటనే వెస్టిండీస్ గడ్డపై 3 వన్డేలు ఆడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత నాలుగున్నరేళ్ల పాటు అతనికి వన్డేల్లో అవకాశమే దక్కలేదు. ఈ మధ్య కాలంలో టెస్టుల్లో నంబర్‌వన్‌గా అద్భుత విజయాలు అందించడంతో పాటు ఐపీఎల్‌లో కూడా అతను చెప్పుకోదగ్గ ప్రదర్శనే నమోదు చేశాడు. ఆ తర్వాత అనూహ్యంగా 2022 జనవరిలో దక్షిణాఫ్రికాతో 2 వన్డేలు ఆడే అవకాశం లభించింది. పార్ల్‌లో జరిగిన మ్యాచ్‌లో 10 ఓవర్లలో వికెట్ తీయకుండా 68 పరుగులు ఇవ్వడంతో అతని ఆట అక్కడ ముగిసింది. అంటే ఆరేళ్ల వ్యవధిలో అతను 2 మ్యాచ్‌లు ఆడినట్లే లెక్క! అంతర్జాతీయ టి20 కెరీర్ కూడా ముగిసినట్లే అనిపించిన దశలో అశ్విన్ అనుభవాన్ని పరిగణలోకి తీసుకున్న టీమిండియా సెలక్టర్లు ఊహించని రీతిలో గత ఏడాది వరల్డ్ కప్‌కు తీసుకున్నారు. ఇప్పుడు ఇక్కడా సరిగ్గా అదే పని చేయవచ్చు. ఫార్మాట్‌లో పని లేకుండా తెలివైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగల నైపుణ్యం అశ్విన్ సొంతం. వరల్డ్ కప్ ప్రత్యర్థి జట్లలో ప్రధాన ఆటగాళ్లలో చాలా మంది ఎడంచేతి వాటం ఉన్నారు. వారికి అశ్విన్ ప్రమాదకారి కాగలడు. అన్నింటికి మించి వ్యూహాల పరంగా అతని అనుభవం అక్కరకు రావచ్చు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొనే కావచ్చు రోహిత్ అతని ఎంపికపై ఆసక్తి చూపించాడు. అశ్విన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నానని, వరల్డ్ కప్ జట్టులో స్థానం అసాధ్యమేమీ కాదన్నట్లుగా రోహిత్ బహిరంగంగానే మద్దతు పలికాడు.

ప్రేక్షకులకు ‘నో ఎంట్రీ’

హైదరాబాద్‌లో పాక్ X కివీస్ వామప్ మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: వన్డే వరల్డ్ కప్‌కు ముందు హైదరాబాద్‌లో జరగనున్న తొలి వామప్ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించడం లేదు. ఈ నెల 29న ఉప్పల్ స్టేడియంలో పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య ఈ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే దానికి ఒక రోజు నగరంలో గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ కారణంగా తాము తగినంత భద్రత పోలీసులు కల్పించలేమని పోలీసులు స్పష్టం చేసేశారు. వామప్ మ్యాచ్ తేదీని మార్చుకోవాల్సిందిగా కూడా వారు సూచించారు. అయితే బీసీసీఐ–హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) దీనిపై తగిన విధంగా చర్చించాయి. ప్రధాన మ్యాచ్ కాదు కాబట్టి సమస్య లేదని, తేదీ మార్చాల్సి అవసరం లేదనే నిర్ణయానికి వచ్చాయి. అయితే నగరంలో పరిస్థితుల నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించరాదని నిర్ణయించారు.



చైనా చేతిలో చిత్తుగా...

- ఫుట్‌బాల్‌లో 1–5తో ఓడిన భారత్
- వాలీబాల్‌లో సునాయాస విజయం
- ఆసియా క్రీడల్లో పోటీలు ప్రారంభం



హాంగ్జౌ (చైనా): ఆసియా క్రీడల కోసం ఫుట్‌బాల్ జట్టునే పంపడం లేదని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటన...నేరుగా ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ కోచ్ లేఖ... చివరకు గ్రీన్ సిగ్నల్...అత్యుత్తమ ఆటగాళ్లను ఇవ్వలేమంటూ ఐఎస్ఎల్ జట్ల కొర్రీలు...ఆఖరి నిమిషంలో తృతీయ శ్రేణి జట్టు ఎంపిక...కనీసం టీమ్ జెర్సీలపై ఆటగాళ్ల పేర్లు కూడా రాసుకోలేని స్థితి... ఇన్ని అడ్డంకుల తర్వాత ఎట్టకేలకు భారత ఫుట్‌బాల్ జట్టు సోమవారం సాయంత్రం చైనా గడ్డపై అడుగు పెట్టింది. కనీసం ఒక్కరోజు కూడా ప్రాక్టీస్ లేదు...16 గంటల్లోనే మ్యాచ్ బరిలోకి...సబ్‌స్టిట్యూట్‌లుగా దించేందుకు తగినంత మంది కూడా బెంచీపై లేరు... చివరకు ఊహించినట్లుగానే ప్రతికూల ఫలితం వచ్చింది. తొలి పోరులో ఆతిథ్య చైనా చేతుల్లో చిత్తుగా ఓడి నిరాశను మిగిల్చింది. అధికారికంగా ఆసియా క్రీడలు ఈ నెల 23నుంచి ప్రారంభం అవుతున్నా...కొన్ని ఈవెంట్లు ముందే మొదలైపోయాయి.

గ్రూప్ ‘ఎ’లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో చైనా 5–1 గోల్స్ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 1–1తో పరిస్థితి మెరుగ్గానే ఉన్నా...రెండో అర్ధభాగంతో నాలుగు గోల్స్‌తో చైనా చెలరేగింది. చైనా తరఫున జియావో టియాని (17వ నిమిషం), డీ వీజున్ (51వ నిమిషం), టావో కియాగ్లాంగ్ (72వ నిమిషం, 75వ నిమిషం), హావో ఫాంగ్ (90+2వ నిమిషం)లో గోల్స్ సాధించారు. భారత్ తరఫున ఏకైక గోల్‌ను కనోలీ ప్రవీణ్ రాహుల్ (45+1వ నిమిషం) నమోదు చేశాడు. మ్యాచ్ ఆసాంతం ఇరు జట్ల మధ్య తీవ్ర అంతరం కనిపించింది. 86 నిమిషాలు మైదానంలో ఉన్నా కెప్టెన్ సునీల్ ఛెత్రి ఏమీ చేయలేక చూస్తుండిపోయాడు. జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు మొత్తం 90 నిమిషాలు ఫీల్డ్ ఉండటం పరిస్థితిని చూపిస్తోంది. భారత్ ఈ గ్రూప్ నుంచి ముందంజ వేయాలంటే తర్వాతి మ్యాచ్‌లలో బంగ్లాదేశ్, మయన్మార్‌లపై తప్పనిసరిగా గెలవాలి.

కంబోడియాను ఓడించి...

వాలీబాల్‌లో మాత్రం భారత్ గెలుపుతో శుభారంభం చేసింది. ఈ పోరులో భారత్ 3–0 (25–14, 25–13, 25–19) తేడాతో తమకంటే బాగా తక్కువ ర్యాంక్ గల కంబోడియాను ఓడించింది. గ్రూప్ ‘సి’లో తమ తదుపరి మ్యాచ్‌లో రేపు అత్యంత పటిష్టమైన కొరియాను భారత్ ఎదుర్కోనుంది.

నిశ్చల్‌కు రజతం

వరల్డ్ కప్ షూటింగ్



రియో డి జనీరో (బ్రెజిల్): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో నిశ్చల్ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 458 పాయింట్ల స్కోరుతో ఆమె రెండో స్థానంలో నిలిచింది. సీనియర్ స్థాయిలో ఈ టీనేజర్‌కు ఇదే తొలి ప్రపంచకప్. నార్వేకు చెందిన జీనెట్ హెడ్ డస్టడ్‌కు స్వర్ణం లభించింది. ఈ ప్రపంచకప్‌ను భారత్ 2 పతకాలతో ముగించింది. గత వారం మహిళల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్‌లో ఎలవెని వలరివన్ స్వర్ణం గెలుచుకుంది.

బంగ్లా క్రికెటర్ నాసిర్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు

దుబాయ్: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై బంగ్లాదేశ్ క్రికెటర్ నాసిర్ హుస్సేన్ సహా ఎనిమిది మందిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అవినీతి వ్యతిరేక విభాగం అభియోగాలు నమోదు చేసింది. 2020–21 సీజన్ అబుదాబి టి10 లీగ్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు వీరిపై ప్రధాన ఆరోపణ. ఈ ఎనిమిది మందీ ‘పుణే డెవిల్స్’ జట్టుతో సంబంధం ఉన్న వారే. టీమ్ సహయజమానులైన కృషన్ కుమార్ చౌదరి, పరాగ్ సంఘ్వీ, అసిస్టెంట్ కోచ్ సన్నీ ధిల్లాన్ భారతీయులు కాగా, మిగతావారు విదేశీయులు. నాటి లీగ్‌లో డెవిల్స్ ఆరు మ్యాచ్‌లలో ఒకటే గెలిచింది. నాసిర్ హుస్సేన్ బంగ్లా తరఫున 19 టెస్టులు, 65 వన్డేలు, 31 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

సినిమా

పండగ కిక్కు.. కొత్త లుక్కు


వినాయక చవితికి వినాయకుడికి విభిన్న రకాల వంటకాలను భక్తులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అలాగే ఈ పండక్కి వినాయకుడిని స్మరించుకుంటూ ‘పండగ కిక్కు.. కొత్త లుక్కు’ అంటూ కొందరు సినిమా యూనిట్ వారు పలు రకాల అప్‌డేట్స్ ఇచ్చారు. వీటిలో కొన్ని ఈ విధంగా..



● శ్రద్ధా శ్రీనాథ్, వెంకటేశ్,

బీచ్‌లో సైంధవ్

బీచ్‌లో సేద తీరుతున్నారు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న ‘సైంధవ్’ కొత్త పోస్టర్ విడుదలైంది. శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా నటిస్తున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, తమిళ నటుడు ఆర్య, బాల నటి సారా కీలక పాత్రధారులు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్.



● రవితేజ

వీడు టైగర్...

రవితేజ టైటిల్ రోల్ చేసిన చిత్రం ‘టైగర్ నాగేశ్వర రావు’. స్టువర్టుపురం దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని రెండో పాట ‘వీడు..’ను ఈ నెల 21న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, రవితేజ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● రామ్, ఊర్వశి రౌతేలా

రామ్.. కల్ట్ మామా

‘బిట్టు బిట్టు బాడీ మొత్తం రెడ్డూ చిల్లి సాల్టు..’ అంటూ సాగే పాట ‘స్కంద’ చిత్రంలోనిది. రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శ్రీలీల, సయీ మంజ్రేకర్ హీరోయిన్లు. ఈ సినిమాలో రామ్, ఊర్వశీ రౌతేలా కాంబినేషన్‌లో వచ్చే ప్రత్యేక గీతం ‘కల్ట్ మామా’ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా హేమచంద్ర, రమ్య బెహ్రా, మహా పాడారు. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్‌ల సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది.



● కల్యాణ్‌రామ్, సంయుక్తా



● రణ్‌బీర్

టీజర్ రెడీ

‘యానిమల్’ మూవీ టీజర్ రెడీ అవుతోంది. ఈ నెల 28న ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ పోస్టర్‌ను విడుదల చేశారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్, మురాద్ ఖేతాని, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 1న, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.



● నేహాశెట్టి, కిరణ్

మది దోచేసిందే...

‘మాయే చేసి మెల్లగా మది దోచేసిందే సిన్నగా...’ అంటూ హీరో కల్యాణ్ రామ్ పాడారు. కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్ నటిస్తున్న ‘డెవిల్’లోని పాట ఇది. అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నవంబరు 24న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి ‘మాయే చేశావే..’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరకల్పనలో ఆర్‌వీ సత్య రాసిన ఈ పాటను సిద్ శ్రీరామ్ పాడారు.



● తేజ

దేఖో ముంబై దోస్తీ మజా...

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం ‘రూల్స్ రంజన్’. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 6న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని ‘దేఖో ముంబై దోస్తీ మజా..’ పాట లిరికల్ వీడియోను హీరో రవితేజ రిలీజ్ చేశారు. అమ్రిష్ గణేష్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్, మేఘ్ ఉట్- వాట్ సాహిత్యం అందించగా, అద్నాన్ సమీ, పాయల్ దేవ్ ఈ పాటను పాడారు.

అంజనాద్రిలో...

తేజా సజ్జా, అమృతా అయ్యర్ జంటగా నటించిన ‘హను–మాన్’ పోస్టర్ రిలీజైంది. ‘‘అంజనాద్రి అనే ఊహాత్మక ప్రదేశంలో ఈ సినిమా ఉంటుంది. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్ , జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో జనవరి 12న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

నాలోనూ ఆ భయం ఉంది - ‘దిల్’ రాజు



● అభయ్, దాము, ‘దిల్’ రాజు

‘‘‘రాక్షస కావ్యం’ ట్రైలర్ బాగుంది. శ్రీమాన్ మేకింగ్, టేకింగ్ బాగున్నాయి. కొత్తవాళ్లతో ప్రొడ్యూసర్ దాము మంచి ప్రయత్నం చేశాడు’’ అని నిర్మాత ‘దిల్’ రాజు అన్నారు. అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘రాక్షస కావ్యం’. శ్రీమాన్ కీర్తి దర్శకత్వంలో దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను ‘దిల్’ రాజు విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘కరోనా తర్వాత ఓటీటీలో నెగిటివ్ కంటెంట్ బాగా పెరిగింది.. అదే సక్సెస్ అవుతోంది. నేను పాజిటివ్ కథతో ఓ మంచి సినిమా తీసినా చూడరేమో? అనే భయం కలుగుతోంది. ఎప్పుడూ హీరోలే గెలవాలా? విలన్లు గెలవొద్దా అనే పాయింట్‌తో ‘రాక్షస క్యావం’ చేశారు. నేటి ట్రెండ్‌కి, ప్రేక్షకులకు కావాల్సిన సినిమా ఇది’’ అన్నారు.

నటుడు-దర్శకుడు విజయ్ ఆంటోని కుమార్తె ఆత్మహత్య



● విజయ్ ఆంటోని



● మీరా

సంగీత దర్శకుడు, హీరో, దర్శక–నిర్మాత విజయ్ ఆంటోని పెద్ద కుమార్తె మీరా మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. విజయ్ ఆంటోని తన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని ఆళ్వార్‌పేట, టీటీకే రోడ్‌లోని ఇంటిలో నివసిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కూమార్తెలు. పెద్ద కూతురు మీరా (16) మౌంట్‌రోడ్‌లోని చర్చ్ పార్క్ స్కూల్‌లో ప్లస్ 2 చదువుతోంది. కాగా ఇటీవల మానసిక వేదనకు గురైన మీరా.. కావేరి ఆసుపత్రిలో వైద్యచికిత్స పొందుతూ వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ ఆమె గది తలుపులు తెరచుకోకపోవడంతో లోనికి వెళ్లి చూడగా కూతురు నిర్జీవంగా ఫ్యాన్‌కు వేలాడుతున్న దృశ్యం చూసి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కావేరి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మీరా మృతదేహాన్ని ఒమందలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మీరా భౌతికకాయానికి ఈరోజు ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. – సాక్షి, చెన్నై


వినోదం సందేశం

‘‘భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో ‘రుద్రంకోట’ కథ నడుస్తుంది. ప్రేమ, వినోదంతో పాటు సందేశం ఉంటుంది’’ అని డైరెక్టర్ రాము కోన అన్నారు. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పిస్తున్న చిత్రం ‘రుద్రంకోట’. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా నటించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయమవుతున్న రాము మాట్లాడుతూ– ‘‘ఇప్పటివరకూ పలు హిట్ సీరియల్స్‌కి దాదాపు ఐదు వేలకు పైగా ఎపిసోడ్స్ డైరెక్ట్ చేశాను. డైరెక్టర్ రాజమౌళిగారు మొదట ‘శాంతి నివాసం’ సీరియల్ చేశారు. ఆయన స్ఫూర్తితోనే నేను కూడా సీరియల్స్ నుంచి సినిమాల వైపు వచ్చాను’’ అన్నారు.



● రాము కోన

రాజమౌళి సమర్పణలో మేడ్ ఇన్ ఇండియా



● రాజమౌళి

భారతీయ సినిమాకు ఎక్కడ పునాది పడింది? ఏ విధంగా ఎదిగింది? అనే అంశాలతో ‘మేడ్ ఇన్ ఇండియా’ చిత్రం రానుంది. నితిన్ కక్కర్ దర్శకత్వంలో వరుణ్ గుప్తా, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన ఈ చిత్రాన్ని దర్శకుడు రాజమౌళి సమర్పిస్తున్నారు. మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది ‘‘ఈ సినిమా నరేషన్ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. బయోపిక్ తీయడం చాలా కష్టం. అలాంటిది ‘ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా’ గురించి అంటే ఇంకా పెద్ద సవాల్. గర్వంగా ‘మేడ్ ఇన్ ఇండియా’ను సమర్పిస్తున్నా’’ అని ట్వీట్ చేశారు రాజమౌళి. ‘‘ఈ చిత్రంలోని నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఇది సినిమా భూమి - రక్షిత్ శెట్టి



● హేమంత్, రక్షిత్ శెట్టి, రుక్మిణి

‘‘‘సప్త సాగరాలు దాటి’ చిత్రం టీజర్, ట్రైలర్ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా తెలుగులో విడుదలవడం సంతోషంగా ఉంది’’ అన్నారు నిర్మాత డి. సురేశ్‌బాబు. రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం ‘సప్త సాగర దాచే ఎల్లో’. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రాన్ని టీజీ విశ్వ ప్రసాద్, రక్షిత్ శెట్టి ‘సప్త సాగరాలు దాటి’ పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో నాని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ‘‘777 చార్లీ’ సినిమా కర్ణాటక తర్వాత తెలుగులోనే బాగా ఆడింది. అందుకే నేనీ ప్రాంతాన్ని సినిమా భూమిగా భావిస్తాను. ‘సప్త సాగరాలు దాటి’ సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను’’ అన్నారు రక్షిత్ శెట్టి. ‘‘ఈ చిత్రం తెలుగులోనూ ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

కథాబలం ఉన్న సినిమా - మనోజ్‌కుమార్

‘‘యాక్షన్ థ్రిల్లర్స్‌ను బాగా ఇష్టపడేవారికి ‘అష్టదిగ్బంధనం’ బాగా నచ్చుతుంది. అయితే అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా ఇది’’ అని డైరెక్టర్ బాబా పీఆర్ అన్నారు. సూర్య, విషిక జంటగా నటించిన చిత్రం ‘అష్టదిగ్బంధనం’. మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా బాబా పీఆర్ మాట్లాడుతూ– ‘‘స్వార్థంతో కూడిన ఎనిమిది మంది జీవితాలకు సంబంధించిన కథ ‘అష్టదిగ్బంధనం’. జాక్సన్ విజయ్‌గారి సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతం’’ అన్నారు. మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ– ‘‘మంచి కథా బలం ఉన్న సినిమాతో నిర్మాతగా మారుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. బాబాగారు బాగా తీశారు. మా చిత్రాన్ని ఆంధ్ర, తెలంగాణల్లో 150 నుంచి 200 థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. మా బ్యానర్‌లో మరో సినిమా సెట్స్‌పై ఉంది’’ అన్నారు.



● మనోజ్‌కుమార్, బాబా పీఆర్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
242	59
67,597	20,133

విదేశీ సూచీలు (తారెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,639	▽	71
డోజోన్స్	34,394	▽	230
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,660	△	7
డాక్స్	15,664	▽	63
షాంఘై	3,125	▽	1
నికాయ్	33,243	▽	291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	101.57	104.93
€	యూరో	ఎస్‌బీఐ	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.06	62.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.31	12.38

గూగుల్ యాప్స్‌తో బార్డ్ అనుసంధానం..

న్యూఢిల్లీ: కృత్రిమ మేధతో పనిచేసే 'బార్డ్' చాట్‌బాట్‌ను మ్యాప్స్, డాక్స్, డ్రైవ్ వంటి మరిన్ని యాప్స్‌తో అనుసంధానం చేస్తున్నట్లు టెక్ దిగ్గజం గూగుల్ వెల్లడించింది. అలాగే మరిన్ని దేశాల్లో, మరిన్ని భాషల్లో క్వెరీల ఫలితాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించింది. జీమెయిల్, డాక్స్, గూగుల్ డ్రైవ్ వ్యాప్తంగా గల వ్యక్తిగత సమాచారాన్ని క్రోడీకరించి యూజర్లు అడిగే ప్రశ్నలకు బార్డ్ సమాధానాలు ఇవ్వగలదు. ఈ ఎక్స్‌టెన్షన్స్ డీఫాల్ట్‌గా ఎనేబుల్ అయి ఉంటాయని, కావాలంటే వాటిని ఎప్పుడైనా డిజేబుల్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. ఓపెన్ సోర్స్ జెన్‌ఏఐ ప్లాట్‌ఫాం చాట్‌జీపీటీకి పోటీగా బార్డ్‌ను గూగుల్ రూపొందించింది.



టాటా వాణిజ్య వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను 3% వరకు పెంచాలని నిర్ణయించింది. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. అన్ని రకాల వాణిజ్య వాహనాలకు తాజా నిర్ణయం వర్తిస్తుందని కంపెనీ ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-9-2023	
విశాఖ	535-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
19-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	506-00
వరంగల్	508-00
రిటైల్ ధర	5.60

జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేసింది..

- హైదరాబాద్ సహా 8 నగరాల్లో ఆవిష్కరణ
- రూ. 599 నుంచి ప్లాన్లు ప్రారంభం

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తాజాగా జియో ఎయిర్‌ఫైబర్ సర్వీసులను ఆవిష్కరించింది. హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ తదితర నగరాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు మంగళవారం ప్రకటించింది. వైర్‌లెస్ విధానంలో అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సర్వీసులను పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. జియో ఎయిర్‌ఫైబర్ ప్లాన్స్ ధరలు స్పీడ్‌ను బట్టి రూ. 599 నుంచి ప్రారంభమవుతాయి. వినాయక చవితి కల్లా వీటి సేవలను ప్రవేశపెడతామని రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి తెలిసిందే. జియో ఇప్పటికే ఫైబర్ పేరిట బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను అందిస్తోంది. ఇది ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ వైర్‌లైన్ మాధ్యమం ద్వారా ఇంటర్నెట్‌ను అందిస్తుండగా.. ఎయిర్‌ఫైబర్ వైర్‌లెస్ తరహాలో నెట్‌ను పొందడానికి ఉపయోగపడుతుంది. 'మా ఫైబర్-టు-ది-హోమ్-సర్వీస్ జియోఫైబర్ ఇప్పటికే 1 కోటి మందికి పైగా కస్టమర్లకు సేవలు అందిస్తోంది. ప్రతి నెల వేల కనెక్షన్లు కొత్తగా జతవుతున్నాయి. ఇంకా అసంఖ్యాక గృహాలు, చిన్న వ్యాపారాలకు వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందించాల్సి ఉంది. జియో ఎయిర్‌ఫైబర్ ఇందుకు తోడ్పడనుంది. విద్య, ఆరోగ్యం, స్మార్ట్‌హోమ్ వంటి సొల్యూషన్స్‌తో ఇది కోట్ల గృహాలకు ప్రపంచ స్థాయి డిజిటల్ వినోదం, స్మార్ట్‌హోమ్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించగలదు' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. జియోకు 15 లక్షల కిలో మీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. అయినప్పటికీ చాలా చోట్ల వైర్‌లైన్ వేయడంలో ప్రతిబంధకాల కారణంగా పూర్తి స్థాయిలో విస్తరించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జియో ఎయిర్‌ఫైబర్ ఆ సవాళ్లను అధిగమించి, యూజర్లకు ఇంటర్నెట్‌ను చేరువ చేయడానికి ఉపయోగపడనుంది. జియోఫైబర్ ప్లాన్లు, ఎటువంటి మార్పు లేకుండా స్పీడ్‌ను బట్టి రూ. 399 నుంచి రూ. 3,999 వరకు రేటుతో యథాప్రకారం కొనసాగుతాయని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తెలిపింది.



ప్రత్యేకతలివీ..

- ఎయిర్‌ఫైబర్ కేటగిరీలో అపరిమిత డేటాతో, స్పీడ్ 30 నుంచి 100 ఎంబీపీఎస్ వరకు ఉంటుంది. నెలవారీ ప్లాన్ల ధరలు రూ. 599 నుంచి రూ. 1,199 వరకు ఉంటాయి. ప్లాన్‌ను బట్టి 550 పైగా డిజిటల్ టీవీ చానళ్లు, 14 పైచిలుకు యాప్స్‌కు యాక్సెస్ లభిస్తుంది.
- ఎయిర్‌ఫైబర్ మ్యాక్స్ కేటగిరీలో డేటా స్పీడ్ 300 నుంచి 1000 ఎంబీపీఎస్ వరకు (అపరిమితం) ఉంటుంది. ధర రూ. 1,499 నుంచి రూ. 3,999 వరకు ఉంటుంది. 550 పైగా డిజిటల్ టీవీ చానళ్లతో పాటు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ తదితర 14 పైగా ఓటీటీ యాప్‌లు అందుబాటులో ఉంటాయి.
- అదనంగా చెల్లించాల్సిన అవసరం లేకుండా వైఫై రూటర్, 4కే స్మార్ట్ సెట్‌టాప్ బాక్స్, వాయిస్ యాక్టివ్ రిమోట్ లభిస్తాయి.

అక్టోబర్ నుంచి తగ్గనున్న రిలయన్స్ గ్యాస్ ధర

14 శాతం తగ్గే అవకాశం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఇంధన ధరలు గత ఏడాదికాలంగా నెమ్మదించిన నేపథ్యంలో దేశీయంగా సంక్లిష్ట క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే సహజ వాయువు రేటు కూడా వచ్చే నెల నుంచి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం యూనిట్‌కు (ఎంబీటీయూ) 12.12 డాలర్లుగా ఉన్న సంక్లిష్ట క్షేత్రాల గ్యాస్ రేటును ప్రభుత్వం 10.4 డాలర్లకు తగ్గించవచ్చని తెలుస్తోంది. అక్టోబర్ 1 నుంచి ఆరు నెలల పాటు అమల్లోకి వచ్చే కొత్త రేట్ల ప్రకారం కేజీ–డీ6 క్షేత్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉత్పత్తి చేసే గ్యాస్ ధర సుమారు 14 శాతం తగ్గవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశీయంగా ఉత్పత్తయ్యే గ్యాస్ ధరలను కేంద్రం ఏటా రెండుసార్లు (ఏప్రిల్ 1న ఒకసారి, అక్టోబర్ 1న మరోసారి) సవరిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా మొదలైన వాటికి కేటాయించిన పాత క్షేత్రాలకు, రిలయన్స్ వంటి సంస్థలకు కేటాయించిన కొత్త క్షేత్రాలకు వేర్వేరు ఫార్ములాలను వర్తింపచేస్తుంది.



ఫార్మా, డ్రోన్లు, టెక్స్‌టైల్స్ పీఎల్‌ఐలో మార్పులు

- మరిన్ని ప్రోత్సాహకాలకు వీలు
- త్వరలో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: ఫార్మాస్యూటికల్స్, డ్రోన్లు, టెక్స్‌టైల్స్ రంగాలకు సంబంధించి ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం(పీఎల్‌ఐ) కింద కేంద్రం మార్పులు చేయనుంది. ఈ రంగాల్లో తయారీ, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా రాయితీలను పెంచనుంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ అధికారి అనధికారికంగా వెల్లడించారు. 2021 నుంచి ఇప్పటివరకు 14 రంగాలకు పీఎల్‌ఐ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించి, దరఖాస్తులను సైతం స్వీకరించింది. మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గతంగా కొనసాగిన సంప్రదింపుల్లో భాగంగా ఈ రంగాలకు సంబంధించి సవరణలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించినట్టు సదరు సీనియర్ అధికారి తెలిపారు. దీనికి త్వరలోనే కేబినెట్ ఆమోదం పొందనున్నట్టు పేర్కొన్నారు టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు నిర్వచనం మార్చనున్నట్టు చెప్పారు. అలాగే, డ్రోన్లు, డ్రోన్ల విడిభాగాలకు కేటాయించిన రూ.120 కోట్లను పెంచనున్నట్టు వెల్లడించారు.



వైట్ గూడ్స్ (ఏసీ, ఎల్‌ఈడీ లైట్లు) రంగాలకు పీఎల్‌ఐ కింద నగదు ప్రోత్సాహకాలను ఈ నెల నుంచే విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. 2023 మార్చి నాటికి రూ.2,900 కోట్లను ఇవ్వాల్సి ఉందన్నారు. పీఎల్‌ఐ కింద వైట్ గూడ్స్, వైద్య పరికరాల తయారీ, ఆటోమొబైల్స్, స్పెషాలిటీ స్టీల్, ఆహారోత్పత్తులు తదితర 14 రంగాలకు కేంద్రం రూ.1.97 లక్షల కోట్లను ప్రకటించింది. అయితే, కొన్ని రంగాలకు సంబంధించి పెద్దగా పురోగతి కనిపించలేదు. దీంతో కొన్ని రంగాలకు సంబంధించి మార్పులు చేయాల్సి రావచ్చని కేంద్ర వాణిజ్య శాఖ అధికారి లోగడ సంకేతం ఇవ్వడం గమనార్హం. ముఖ్యంగా అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీలు, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులు, స్పెషాలిటీ స్టీల్ రంగాల్లో పీఎల్‌ఐ పట్ల పెద్దగా స్పందన లేకపోవడంతో మార్పులకు కేంద్రం పూనుకున్నట్టు తెలుస్తోంది.

ఆర్‌ఆర్ కేబుల్ లిస్టింగ్ నేడు

ఐపీవో ముగిసిన 2 రోజుల్లోనే

న్యూఢిల్లీ: గత వారం ఐపీవోకు వచ్చిన వైర్లు, కేబుళ్ల తయారీ కంపెనీ ఆర్‌ఆర్ కేబుల్ కొత్త రికార్డుకు తెరతీయనుంది. బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. వెరసి పబ్లిక్ ఇష్యూ ముగిసిన రెండు రోజుల్లోనే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయిన తొలి కంపెనీగా నిలవనుంది. ఇక టీ+3 విధానంలో లిస్టయిన తొలి కంపెనీ రత్నవీర్ ప్రెసిషన్ ఇంజనీరింగ్‌కాగా.. రెండో రోజు నుంచి టీ+2లో ఆర్‌ఆర్ కేబుల్‌లో ట్రేడింగ్ ప్రారంభంకానుంది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆగస్ట్‌లో ఐపీవో తదుపరి లిస్టింగ్ కాలాన్ని సగానికి కుదించింది. దీంతో టీ+6 నుంచి టీ+3కి లిస్టింగ్ కాలావధి తగ్గింది. ఆర్‌ఆర్ కేబుల్ ఇష్యూ సెప్టెంబర్ 13న మొదలై 15న ముగిసింది. సెప్టెంబర్ 1 నుంచి లిస్టింగ్ తాజా మార్గదర్శకాలు స్వచ్ఛంద ప్రాతిపదికన అమలులోకి వచ్చాయి. అయితే 2023 డిసెంబర్ 1 నుంచి తప్పనిసరి కానున్నాయి. ఈ నెల 20 నుంచి ఆర్‌ఆర్ కేబుల్ ఈక్విటీ షేర్లు బీ గ్రూప్‌లో లిస్టకానున్నట్లు బీఎస్‌ఈ ఒక ప్రకటనలో పేర్కొంది.



స్కంద ఏరోస్పేస్ ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్: స్కంద ఏరోస్పేస్ టెక్నాలజీ (ఎస్‌ఏటీపీఎల్) తమ అత్యాధునిక గేర్ తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. మొదటి దశలో రూ. 75 కోట్లు, వచ్చే రెండు మూడేళ్లలో మరో రూ. 150 కోట్ల మొత్తాన్ని కంపెనీ వెచ్చించనుంది. దేశీయంగా విమానాలు, హెలికాప్టర్లతో పాటు అంతర్జాతీయంగా విమానాల మార్కెట్‌కు అవసరమైన విడిభాగాలను ఇందులో ఉత్పత్తి చేయనుంది. ప్రస్తుతం ఇందులో 150 మంది వరకు ఉద్యోగులు ఉండగా, మూడేళ్లలో దీన్ని 1,000కి పెంచుకోవాలని సంస్థ యోచిస్తోంది. రఘువంశీ మెషీన్ టూల్స్, రేవ్ గేర్స్ కలిసి దీన్ని ఏర్పాటు చేశాయి. స్కంద ఏరోస్పేస్‌కు ఏటా 9 మిలియన్ డాలర్ల ఆర్డర్లు ఇవ్వనున్నట్లు రేవ్ గేర్స్ తెలిపింది. ప్లాంటు ప్రారంభ కార్యక్రమంలో రఘువంశీ ఎండీ వంశీ వికాస్, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ ప్రవీణ్ పి.ఎ. తదితరులు పాల్గొన్నారు.



చారిటబుల్ ట్రస్ట్‌లకు ఐటీఆర్ గడువు పెంపు



న్యూఢిల్లీ: చారిటబుల్ ట్రస్ట్‌లు, మతపరమైన సంస్థలు, వృత్తిపరమైన సంస్థలకు సంబంధించి, ఆదాయపన్ను రిటర్నుల దాఖలు గడువును కేంద్రం పొడిగించనుంది. ఈ సంస్థలు ఐటీఆర్–7 దాఖలు చేసేందుకు అక్టోబర్ 31 గడువు కాగా, ఒక నెల అదనంగా నవంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. 2022–23 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ రిపోర్టులు సమర్పించేందుకు ఫండ్, ట్రస్ట్, ఇన్‌స్టిట్యూషన్, యూనివర్సిటీ లేదా విద్యా సంస్థలు, మెడికల్ ఇన్‌స్టిట్యూషన్లకు నవంబర్ 30 వరకు గడవును పొడిగించారు. ఈ మేరకు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) ప్రకటన విడుదల చేసింది.

జాబ్ పాయింట్

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో 350 నావిక్, యాంత్రిక్ పోస్టులు

అర్మ్‌డ్ ఫోర్సెస్‌లో 01/2024 బ్యాచ్ ప్రవేశాలకు సంబంధించి ఇండియన్ కోస్ట్‌గార్డ్ నావిక్(డొమెస్టిక్ బ్రాంచ్,జనరల్ డ్యూటీ), యాంత్రిక్ పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 350
» **పోస్టుల వివరాలు:** నావిక్(జనరల్ డ్యూటీ)–260, నావిక్(డొమెస్టిక్ బ్రాంచ్)–30, యాంత్రిక్(మెకానికల్)–25, యాంత్రిక్(ఎలక్ట్రికల్)–20, యాంత్రిక్(ఎలక్ట్రానిక్స్) –15.
» **అర్హత:** పదో తరగతి, 10+2(మ్యాథ్స్–ఫిజిక్స్), డిప్లొమా(ఎలక్ట్రికల్/మెకానికల్ /ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్(రేడియో/పవర్)ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నావిక్ పోస్టులకు బేసిక్ పే రూ. 21,700, యాంత్రిక్ పోస్టులకు బేసిక్ పే రూ. 29,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, అసెస్‌మెంట్/అడాప్టబిలిటీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2023
» **వెబ్‌సైట్:** https://joinindiancoast-guard.gov.in

ఏపీ జెన్‌కోలో 26 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్–ఏపీ జెన్‌కో పరిధిలోని థర్మల్ పవర్ ప్లాంట్లలో ఒప్పంద ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మొదటి శ్రేణిలో ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.08.2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **ఎంపిక:** ఎమ్మెస్సీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పని ప్రదేశాలు:** ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా/వీవీ రెడ్డి నగర్, వైఎస్సార్ కడప జిల్లా/నెలటూర్, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా/ఎంసీఎల్ కోల్‌మైన్స్, తాల్చేర్, ఒడిశా/ఎస్‌సీసీఎల్ కోల్ మైన్స్,ఇల్లందు, మణుగూరు, తెలంగాణ.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీని చీఫ్ జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్), మూడో అంతస్తు, ఏపీజెన్‌కో చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 30.09.2023.
» **వెబ్‌సైట్:** https://apgenco.gov.in

కోల్ ఇండియా లిమిటెడ్, కోల్‌కతాలో 560 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్), కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్.. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 560
» **విభాగాల వారీగా ఖాళీలు:** మైనింగ్–351, సివిల్–172, జియాలజీ–37.
» **అర్హత:** డిగ్రీ(మైనింగ్/సివిల్ ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ/ఎంఈ, ఎంటెక్ (జియాలజీ/అప్లైడ్ జియాలజీ)/జియోఫిజిక్స్/అప్లైడ్ జియోఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు గేట్–2023లో అర్హత సాధించి ఉండాలి. » **వయసు:** 31.08.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000
» **ఎంపిక విధానం:** గేట్–2023 స్కోర్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.10.2023
» **వెబ్‌సైట్:** https://www.coalindia.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 95 నాన్ టీచింగ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన గ్రూప్–ఎ, బి, సి నాన్–ఫ్యాకల్టీ, ఇతర అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 95
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ రిజిస్ట్రార్(డిప్యుటేషన్)–01, అసిస్టెంట్ లైబ్రేరియన్ –04, అసిస్టెంట్ రిజిస్ట్రార్–02, సెక్షన్ ఆఫీసర్–02, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్ /ఎలక్ట్రికల్)–02, సెక్యూరిటీ ఆఫీసర్–02, సీనియర్ అసిస్టెంట్–02, ప్రొఫెషనల్ అసిస్టెంట్–01, జూనియర్ ఇంజనీర్(సివిల్ /ఎలక్ట్రికల్)–08, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్–01, జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్–02, స్టాటిస్టికల్ అసిస్టెంట్–01, ఆఫీస్ అసిస్టెంట్–10, లైబ్రరీ అసిస్టెంట్–04, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–44, హిందీ టైపిస్ట్–01, ల్యాబొరేటరీ అటెండెంట్–08.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 06.10.2023.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

ఎస్‌బీఐలో పీఓ కొలువులు

» రెండు వేల పీఓ పోస్టుల భర్తీకి ప్రకటన
» డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు
» మూడంచెల ఎంపిక విధానం
» వేతన శ్రేణి రూ.36,000–రూ.63,840

బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు బ్యాంకింగ్ రంగంలో అద్భుత అవకాశం స్వాగతం పలుకుతోంది! దేశంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. రెండు వేల ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ పీఓ పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణతోపాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

ఎస్‌బీఐ.. క్లరికల్ కేడర్, పీఓ, స్పెషలిస్ట్ ఆఫీసర్స్ తదితర పోస్టుల భర్తీకి క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ఇదే క్రమంలో తాజాగా 2023కు సంబంధించి ప్రొబేషనరీ ఆఫీసర్స్ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికే ఆయా బ్యాంకు ఉద్యోగాలకు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు అదే ప్రిపరేషన్‌తో ఎస్‌బీఐ పీఓ పోస్టులకు కూడా పోటీ పడొచ్చు.

రెండు వేల పోస్టులు

ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం రెండు వేల పీవో పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో జనరల్ కేటగిరీకి 810 పోస్టులు,ఓబీసీ అభ్యర్థులకు 540, ఎస్సీలకు 300, ఎస్టీలకు 150, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 200పోస్టులను రిజర్వ్ చేశారు.

అర్హత

2023, డిసెంబర్ 31 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ 31లోపు తమ కోర్సు ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

వయసు

- ఏప్రిల్ 1, 2023 నాటికి 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** బేసిక్ పే: రూ.41,960(వేతన శ్రేణి రూ.36,000–రూ.63,840)

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్‌బీఐ పీవో పోస్టుల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తోంది.

అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

వంద మార్కులకు ప్రిలిమినరీ

నియామక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు –35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులు.. ఇలా మొత్తం 100 మార్కులు–100 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం ఒక గంట.

తదుపరి దశ మెయిన్

ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. తొలి దశ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 10 మందిని చొప్పున మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ పరీక్ష 200 మార్కులకు; ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్ 50 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 30 ప్రశ్నలు–50 మార్కులకు,జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–60 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు.



డిస్క్రిప్టివ్ టెస్ట్

మెయిన్‌లో భాగంగానే ప్రత్యేకంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇది 50 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్షలో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ ఉంటాయి. 30 నిమిషాల వ్యవధిలో కంప్యూటర్ ఆధారంగా సమాధానాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

నెగెటివ్ మార్కింగ్

ఆబ్జెక్టివ్ విధానంలో జరిగే ప్రిలిమ్స్, మెయిన్స్ ఎగ్జామ్స్‌లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కును తగ్గిస్తారు.

చివరగా సైకోమెట్రిక్ టెస్ట్

మొత్తం ఎంపిక ప్రక్రియలో చివరి దశ సైకోమెట్రిక్ టెస్ట్. ఇందులో భాగంగా గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున(1:3 నిష్పత్తిలో) తుది దశకు ఎంపిక చేస్తారు. మొత్తం 50 మార్కులకు నిర్వహించే చివరి దశ ఎంపిక ప్రక్రియలో గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు ఉంటాయి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా అభ్యర్థులను వేర్వేరు బృందాలుగా విభజిస్తారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా అయిదుగురు అభ్యర్థులు ఉండేలా చూస్తారు. ఇలా బృందాలుగా విభజించాక.. నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని.. దానికి అభ్యర్థుల అభిప్రాయం లేదా సమాధానాన్ని అడుగుతారు. సామాజిక అంశాలపై అవగాహన, టీమ్ స్కిల్స్ వంటి వాటిని పరిశీలిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో బ్యాంకింగ్ నాలెడ్జ్, బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌పై ఆసక్తిని పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

తుది విజేతల ఎంపికలో ఎస్‌బీఐ వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తోంది. మెయిన్ పరీక్షలో పొందిన మార్కులకు 75 శాతం; చివరి దశలోని గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభకు 25 శాతం వెయిటేజీ ఇస్తోంది. ఇలా మొత్తం వంద శాతానికి అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి.. తుది విజేతలను నిర్ణయిస్తుంది.

సిలబస్‌పై పట్టుతో సక్సెస్

రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ అంశాల్లో పరిపూర్ణమైన అవగాహన పొందాలి.

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

అభ్యర్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన మరో విభాగం.. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో రాణించడానికి కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్

ఈ విభాగానికి సంబంధించిన అంశాలను మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇందులో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూ

ఈ ప్రక్రియలో విజయం సాధించడానికి ఇంగ్లిష్ వ్యాకరణం, వాక్య నిర్మాణంపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు సామాజిక పరిణామాలపై పట్టుండాలి. ఇందుకోసం దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర జనరల్ ఎస్సే పుస్తకాలు అనుసరించడం ఉపయుక్తంగా ఉంటుంది.

అనుసంధానం చేసుకుంటూ

పీఓ పోస్టుల అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్‌లోని ఉమ్మడి అంశాలను గుర్తించాలి. ముఖ్యంగా రెండు దశల్లోనూ ఉన్న ఇంగ్లిష్, రీజనింగ్‌కు కామన్ ప్రిపరేషన్ దృక్పథం ఎంతో మేలు చేస్తుంది. ఈ విభాగాలు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. మెయిన్‌లో క్లిష్టత స్థాయి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మెయిన్ పరీక్ష కోణంలోనే ప్రిపరేషన్ సాగిస్తే.. ప్రిలిమ్స్‌లో సులువుగా నెగ్గడమే కాకుండా.. ఒకే సమయంలో రెండింటికీ సన్నద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:సెప్టెంబర్27, 2023
- ప్రిలిమినరీ పరీక్ష(ఆన్‌లైన్) తేదీలు: నవంబర్‌లో
- మెయిన్ ఎగ్జామినేషన్: డిసెంబర్ లేదా 2024 జనవరిలో
- సైకోమెట్రిక్ టెస్ట్:2024 జనవరి/ఫిబ్రవరి నెలలో
- తుది ఫలితాల వెల్లడి: 2024 ఫిబ్రవరి/మార్చి నెలలో
- వివరాలకు వెబ్‌సైట్: https://bank.sbi/careers, https://www.sbi.co.in/careers

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.